RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com




# భారత్ శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN




Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:24 హైదరాబాద్, శనివారం, 5 జూలై 2025 పేజీలు: 12 వెల: 1.00

## జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఉప ఎన్నికలో మూడు పార్టీలు కలిసి బరిలోకి దిగుతాయని చెప్పుకొచ్చారు. ఉప ఎన్నికను సమర్ధవంతంగా సమయంలో 45 లక్షల మందితో క్రియాశీలక సభ్యత్వం చేయించానని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్, %చీూఖ×%, పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలా మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు వరించాయని స్పష్టం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.



ఎదుర్కొవాలని దిశానిర్దేశం చేశారు. ఇవాళ(శుక్రవారం) గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జీ మంత్రులు ప్రతి అంశాన్నీ సీరియస్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ పదవులు వెంటనే భర్తీ చేయాలన్నారు. పార్టీ కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని హుకుం జారీ చేశారు. పార్టీ పదవులు భర్తీ చేయడంలో టీపీసీసీ చీఫ్ ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో నేషనల్ నరేటివ్ బిల్డప్ చేసుకోవాలని సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

దేశంలోనే అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కేంద్రప్రభుత్వం మెడలు వంచి జనగణనలో కులగణన చేసేలా చేయడంలో మనం విజయం సాధించామని వ్యాఖ్యానించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో మనం చాలా విజయాలు సాధించామని చెప్పుకొచ్చారు. తాను టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న

పార్టీ పదవులను క్యాజువల్‌గా తీసుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పార్టీ పదవులతోనే నేతలకు గుర్తింపు, గౌరవమని ఉద్ఘాటించారు. రాజకీయాల్లో నేతల ఎదుగుదలకు ఇది చాలా ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. రాబోయే రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు, జమిలి ఎన్నికలు ప్రభావితం చేయబోతున్నాయని చెప్పుకొచ్చారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని సూచించారు. మీరు నాయకులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలని మార్గనిర్దేశం చేశారు. గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.

మన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మనందరం కలిసికట్టుగా ఈరోజు నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుని కష్టపడి మళ్లీ రెండోసారి కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. తెలంగాణలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం ప్రజాప్రతినిధిగా ఎన్నికైన అరుదైన ఘనత మల్లికార్జున ఖర్గేదని కొనియాడారు. ఖర్గేని నేతలు స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. పార్టీ పదవితోనే అందరికీ గౌరవం, గుర్తింపు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## మూణ్నాళ్ల ముచ్చటే అన్నారు.. అపోహలను పటాపంచలు చేశాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మూడు రంగుల జెండా చేతబూని కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభలో సీఎం మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని.. మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయని చెప్పారు. కార్యకర్తలకు అన్ని పదవులు దక్కే వరకూ విశ్రాంతి తీసుకోబోనని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని.. దాని కంటే ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యతని చెప్పారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. "కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలేరని.. ఈ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని కొందరు అన్నారు. కానీ.. పార్టీ నేతలంతా ఐకమత్యంతో పనిచేస్తూ ఆ అపోహలను పటాపంచలు చేశారు. జనగణనతో పాటు కులగణన.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాటిచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించాం. కష్టాలు, ఒడిదొడుకులు వచ్చాయి.. అన్నీ అధిగమించి ముందుకెళ్తున్నాం. చర్చకు ఎవరొస్తారో రండి..రైతుల కోసం 18 నెలల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని గత సీఎం చెప్పారు.. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచాం.

## ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే: ఖర్గే

హైదరాబాద్, జులై 04: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన



ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్దాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమిటని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ రాష్ట్రానికి మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించారన్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ ప్రధానిగా భయపడలేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు.

రాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు.

## గాంధీభవన్‌కు కేడర్.. అడ్డుకున్న పోలీసులు.. రేణుకా చౌదరి ఫైర్

హైదరాబాద్, జులై 4: గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పీఏసీ సమావేశం కొనసాగుతోంది. ఏఐసీసీ చీఫ్ ఖర్గే, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ అగ్రనేతలు గాంధీ భవన్‌లో ఉండటంతో వారిని కలిసేందుకు కేడర్ క్యూ కట్టింది. ఈ క్రమంలో కేడర్ లోపలికి రాకుండా పోలీసులు



అడ్డుకుంటున్నారు. అడ్డుకున్న వారిలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి స్టాఫ్ ఉన్నారు. దీంతో ఆమె స్వయంగా పోలీసుల వద్దకు వచ్చి స్టాఫ్‌ను లోపలికి తీసుకెళ్లారు.

ఈ క్రమంలో పోలీసుల తీరుపై రాజ్యసభ సభ్యురాలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకంటే పోలీసుల హడావుడి ఎక్కువైందంటూ రేణుకా చౌదరి మండిపడ్డారు. మరోవైపు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అసహనం వ్యక్తం చేశారు. తమను ఆపుతారా అంటూ పోలీసులపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోవైపు పీఏసీ సమావేశంలో పార్టీ నేతలకు ఖర్గే దిశానిర్దేశం చేశారు. సమావేశం మొదలైన వెంటనే పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో చనిపోయిన మృతులకు సంతాపం తెలుపుతూ పీఏసీ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆపై ఎజెండా ప్రకారం పీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎంత మేరకు తీసుకెళ్లారనే దానిపై చర్చించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీలోకి చేరికలను ప్రోత్సహించాలని మల్లికార్జున ఖర్గే తెలిపారు. రాష్ట్రంలో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ వంటి కార్యక్రమాలు ఎలా కొనసాగుతున్నాయనే దానిపై రిపోర్టును పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశంలో చదివి వినిపించారు. గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగింది. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అంశంపై కూడా పీఏసీలో చర్చ జరిగింది.

## సిగాచీ పేలుడులో 9 మంది గల్లంతు.. యాజమాన్యం ప్రకటన..

పాశమైలారం సిగాచీ పరిశ్రమలో పేలుడు జరిగి 5 రోజులు గడుస్తున్నా మృతుల సంఖ్యపై సందిగ్ధత వీడటం లేదు. శిథిలాల తొలగింపు పూర్తికావొస్తున్నా.. గల్లంతైన వారి ఆచూకీ లభించకపోవడంతో బాధిత కార్మిక కుటుంబాల్లో రోదనలు మిన్నంటుతున్నాయి. ఈ దుర్ఘటనలో మొత్తం 40 మంది ప్రాణాలు



కోల్పోగా.. 9 మంది ఆచూకీ గల్లంతైనట్టుగా యాజమాన్యం ప్రకటించింది.

దుర్ఘటన జరిగిన ప్రాంతంలో శిథిలాల ఏరివేత దాదాపుగా పూర్తికావచ్చింది. అణువణువూ జల్లెడ పట్టినప్పటికీ 9 మంది కార్మికుల జాడలు ఇంకా తెలియడంలేదు. ప్రమాదంలో గల్లంతైన వారి సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని తెలంగాణ రాష్ట్ర సీఎస్ రామకృష్ణారావు నేతృత్వంలోని కమిటీ గుర్తించినట్లు సమాచారం. దీంతో బాధిత కుటుంబాల్లో ఆగ్రహావేశాలు మిన్నంటాయి. ఈ క్రమంలోనే ఐలా భవనంలో బాధిత కుటుంబాలతో సీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మా పరిస్థితి ఏంటని.. తమవారిపై ఆశలు వదులుకోవాల్సిందేనా అంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆయనను నిలదీశారు. చాలామంది కాలిపోయినట్టుగా గుర్తించాం. కచ్చితంగా అందరికీ న్యాయం చేస్తామంటూ సీఎస్ హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం బాధితుల కుటుంబీకులు కొందరు జిల్లా కలెక్టర్ కాళ్లపై పడి తమకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు.

కాంట్రాక్టు కార్మికులపై నో క్లారిటీ..

గల్లంతైన కార్మికుల మృతదేహాల ఆచూకీ తెలియకపోవడంతో ప్రమాదంలో వారు పూర్తిగా దగ్ధమైనట్లు సమాచారం. లాకర్ రూంలో లభించిన సెల్ ఫోన్లు కాంట్రాక్టు కార్మికులవేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టు కార్మికుల గురించి యాజమాన్యమూ ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో మృతదేహాలు లభ్యం కాకపోతే బాధిత కుటుంబాలకు నష్టపరిహారం వచ్చే అవకాశం లేనట్టేనని తెలుస్తోంది. ఈ విషయమై సీఎస్ క్లారిటీ ఇవ్వకపోవడమే కారణంగా భావిస్తున్నారు. అంతేగాక, ఇప్పటివరకూ ప్రభుత్వం గల్లంతైన కార్మికుల విషయంలో ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు.

## వర్ష బీభత్సం.. 63 మంది మృతి.. డజన్ల మంది గల్లంతు..

హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా వరదలు, కొండచరియలు విరిగిపడుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకూ 63 మంది ప్రాణాలు కోల్పోయారు. డజన్ల కొద్దీ మంది గల్లంతయ్యారు. దాదాపు రూ.400 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. జూన్ 20వ తేదీన రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ప్రతీ సంవత్సరం లాగానే ఈ ఏడాదీ భారీ వర్షాలు కురుస్తున్నాయి.

వర్షాల కారణంగా వరదలు, కొండచరియలు విరిగిపడడం లాంటి ఘటనల్లో.. ఒక్క మండి జిల్లాలోనే ఏకంగా 17మంది చనిపోయారు. కంగారా జిల్లాలో 13మంది, చంబ జిల్లాలో ఆరుగురు, షిమ్లా జిల్లాలో ఐదుగురు మృత్యువాతపడ్డారు. మండిలోని తునగ్, బగ్సయేద్ ప్రాంతాల్లో వర్షాలు బీభత్సం సృష్టించాయి. తాజా సమాచారం ప్రకారం ఒక్క మండి జిల్లాలోనే 40 మంది గల్లంతైనట్లు తెలుస్తోంది. బిలాస్‌పూర్, హమీర్‌పూర్, కిన్నౌర్, కులు, లాహౌల్ స్పిరిట్, సిర్‌మౌర్, సోలన్, ఉన్నా జిల్లాల్లోనూ మరణాలు నమోదయ్యాయి.

భారత శక్తి
VOICE OF INDIAN

## సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలా..?

భారత దేశం అంటేనే లౌకిక దేశంగా పేరు. ఇపుడా లౌకిక అనే పదాన్నే తీసెయ్యాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయ్. అలాగని ఇది అందరి నుంచీ కాదు.. ఒక సెక్షన్ నుంచి మాత్రమే ఈ తరహా డిమాండ్ వినవస్తోంది. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలి దత్తాత్రేయ హ్సబెలే. రాజ్యాంగ పీఠికలోని సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని ఖీూా నేత చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఎమర్జెన్సీ సమయంలో ఈ పదాలను కాంగ్రెస్ బలవంతంగా చేర్చిందని, దీనిపై చర్చ జరగాలని దత్తాత్రేయ హ్సబెలే చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఆరెస్సెస్ మాస్క్ తొలిగిపోయిందని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ, ఆరెస్సెస్.. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని చూస్తున్నాయని.. రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. ఇందుకు కొనసాగింపుగా ఉపరాష్ట్రపతి ధన్కర్ సైతం ఇదే వాయిస్ వినిపించారు. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, లౌకిక అనే పదాలను జోడించడం సనాతన స్ఫూర్తికి విరుద్ధమని అన్నారాయన. 1975లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితి దేశ రాజ్యాంగానికే చీకటి కాలమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. సోషలిస్ట్, సెక్యులరిస్ట్ పదాలు ప్రవేశికలో ఉండాలా వద్దా? అనే దానిపై చర్చ జరగాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబెలే చెప్పిన రెండు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ వ్యాఖ్యలు చేయడంతో ఇదో చర్చనీయాంశమైంది. దిగారు. అంతే కాకుండా సనాతన ధర్మానికి విరుద్ధం అన్న కామెంట్లు సైతం చేశారు. సరిగ్గా ఇదే సమయంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సైతం ఇదే అంశంపై కామెంట్ చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రి అయిన శివరాజ్ సింగ్.. భారతదేశంలో సోషలిజం అవసరం లేదని అన్నారు. లౌకిక వాదం మన సంప్రదాయం కాదని అన్నారు. ఎమర్జెన్సీలో వీటిని చేర్చారనీ.. ఇది అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో భాగం కానే కాదని అన్నారాయన. భారత్ మే సమాజ్ వాద్ కీ జరూరత్ నహీ హై, ధర్మ నిరపేక్ష్ హమార సంస్కృతి కా మూల్ నహి హై.. ఔర్ ఇస్లీయే పర్ జరూర్ విచార్ హోనా చాహియే.. అన్నారు. దీనర్థమేంటంటే.. భారతదేశంలో ఈ రకమైన పదాలు మనకు అవసరం లేదని అన్నారు చౌహాన్. కాబట్టి, దీనిపై చర్చించాలి అన్నది ఈ వ్యాఖ్యల సారాంశం. ఒకరకంగా చెబితే.. ఇది ఆర్ఎస్ఎస్ పిలుపునకు పరోక్ష మద్దతుగా భావిస్తున్నారు. లౌకిక వాదం మనది కాదన్న అస్సాం సీఎం హిమంత. ఇక ఇదే అంశంపై మరొక నేత కూడా కామెంట్ చేశారు. ఆయనే.. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ. సోషలిజం, లౌకికవాదం మనవి కావు. పాశ్చాత్య భావనలని, ఈ పదాలకు భారత నాగరికతలో స్థానం లేదని అన్నారు. మీరు కాస్త గట్టిగా ఆలోచిస్తే మన అస్తిత్వ సవాళ్లకే మనం అవకాశమిస్తున్నామని.. ఇదొక చీడ పురుగుగా దేశాన్ని పట్టి పీడిస్తోందని అన్నారు ఉప రాష్ట్రపతి. ఇది వేల సంవత్సరాల నాగరికతను కించ పరుస్తోందని.. ఈ సెక్యులరిజం అన్నది మనదైన సంప్రదాయాన్ని తక్కువ చేసుకోవడం తప్ప మరొకటి కాదని అన్నారు ధన్కర్. ఇది సనాతన ధర్మానికే పూర్తి అవమానకమని కామెంట్ చేశారు ధన్కర్. ఉపరాష్ట్రపతి ధన్కర్ కి రచయిత, మాజీ కర్ణాటక ఎమ్మెల్సీ వీరయ్య రాసిన సంకలనం అంబేద్కర్ సందేశాలు అనే పుస్తకం తొలి కాపీ అందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ జగదీప్ ధన్కర్ ఈ కామెంట్లు చేశారు. ఆర్ఎస్ఎస్ అగ్ర నేత నుంచి ఉపరాష్ట్రపతి వరకూ ఈ తరహా కామెంట్లు చేయుడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది కాంగ్రెస్. తర్వాత మురుగన్ మానాడు సభలోనూ పవన్ సరిగ్గా ఇలాంటి సెక్యులరిస్టు కామెంట్లు చేశారు. ఇది గత కొంతకాలంగా భారతదేశంలో వినిపిస్తున్న మాట. ఆ మాటకొస్తే మొన్న పూనేకి చెందిన లా స్టూడెంట్ శర్మిష్ట పనోలీ విషయంలోనూ సరిగ్గా ఇలాగే కామెంట్ చేశారు పవన్. దేశంలో సెక్యులరిజం అంటే అది హిందుత్వ వాదులను అనడానికి మాత్రమే పనికొచ్చే ఒకానొక వెసలుబాటు కాదని కామెంట్ చేశారాయన. ఈ ధోరణి వెనక రాజ్యాంగంలోని ఈ సెక్యులరిస్ట్ పదాలే కారణమన్నది వీరందరి వాదనగా తెలుస్తోంది. 1976లో అత్యవసర పరిస్థితి సమయంలో 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా లౌకిక, సోషలిస్ట్ అనే రెండు పదాలను ప్రవేశికలో చేర్చారు. అత్యవసర పరిస్థితి తర్వాత అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం 42వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేసిన అనేక ఇతర మార్పులను తిప్పికొట్టినప్పటికీ, అది సోషలిస్ట్, సెక్యులరిస్ట్ అనే పదాలను అలాగే ఉంచింది. వాస్తవానికి, 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, నాటి బిజెపి అధ్యక్షుడు అమిత్ షా 2015లో పార్టీ లైన్‌ను స్పష్టం చేశారు. నేటి పీఠిక అలాగే ఉండాలని బిజెపి విశ్వసిస్తుంది. దానిని మార్చాల్సిన అవసరం లేదని అన్నారు. బేసిగ్గా చూస్తే ఇప్పటి వరకూ భారత్ కి రక్షణ కవచం ఈ లౌకిక వాదమే. పాకిస్థాన్ లా ఒక మత తత్వ దేశంగా భారత్ మారితే.. దాని విస్తృత రూపం రేపటి రోజున మరొక విధంగా మారే అవకాశం లేక పోలేదు. కానీ బీజేపీ చూస్తుంటే భారత్ ని లౌకిక వాదం నుంచి పక్కకు తప్పించేందుకు తీవ్ర యత్నాలు చేస్తున్నట్టే కనిపిస్తోందని అంటారు రాజ్యాంగ నిపుణులు. ఏం పాకిస్థాన్ మన నుంచి విడిపోయి ఇస్లామిక్ కంట్రీగా మారినపుడు మన దేశం హిందూ దేశం ఎందుకు కాకూడదన్నది రెగ్యులర్ గా సంఘ్ పరివార్ సభ్యులు వేసే ప్రశ్న. వీరి ఆలోచన ప్రకారం భారత దేశం ఇప్పటి వరకూ లౌకిక వాదం, సామ్యవాదం ద్వారా నష్టపోయినట్టుగానే చెప్పాల్సి ఉంటుంది.

# సుపరిపాలనలో పవన్ ఎక్కడ



విజయవాడ, జూలై 4,

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఏడాది గడుస్తున్నా ఇంత వరకూ తన పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం కాలేదు. జనసేన ఆవిర్భావ సభలో వారిని వేదికపై కలవడమే తప్పించి అడపా దడపా అప్పుడప్పుడు వేర్వేరుగా కలుస్తున్నారు తప్పించి పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు. నియోజకవర్గంలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులతో పాటు ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై కూడా ఫీడ్ బ్యాక్ తీసుకునే ప్రయత్నం చేయకపోవడం ఇప్పుడు జనసేనలో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ అధినేత చంద్రబాబు వరసగా పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమవుతూ వారికి కార్యక్రమాలను ఇస్తూ క్షేత్రస్థాయిలో యాక్టివ్ చేస్తుంటే పవన్ కల్యాణ్ మాత్రం ఆ పనికి పూనుకోకపోవడాన్ని కొందరు నేతలే ప్రశ్నిస్తున్నారు. 2024 లో జరిగిన ఎన్నికల్లో జనసేన హండ్రెడ్ పర్సెంట్ సక్సెస్ రేట్ సాధించింది. 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసి విజయం సాధించింది. అయితే అనేక చోట్ల తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జులతో జనసేన ఎమ్మెల్యేలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల వారి మాటలను అధికారులు కూడా వినడం లేదన్న వార్తలు వస్తున్నాయి. నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పదవులను కూడా తమ ప్రమేయం లేకుండా టీడీపీ నేతలు భర్తీ చేసుకుంటున్నారని కొందరు నేరుగానే ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేల నుంచి క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకుని వాటిని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత పవన్ కల్యాణ్ పైనే ఉంది. . కానీ పవన్ కల్యాణ్ మాత్రం నిత్యం బిజీగానే ఉంటున్నారు. తాను ఒక పార్టీ చీఫ్ అన్న విషయాన్ని మర్చిపోయి ఎమ్మెల్యేలతో టచ్ మి నాట్ గా వ్యవహరిస్తే జరుగుతున్న విషయాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నిస్తున్నారు. కేవలం కొందరు ఇచ్చే ఫీడ్ బ్యాక్ తోనే జనసేనాని ముందుకు వెళితే భవిష్యత్ లో రాజకీయంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఎమ్మెల్యేలతో మూడు గంటల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడే తీరిక లేని పవన్ కల్యాణ్ ఇక రాజకీయాలు ఏం చేస్తారని సొంత పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యేలు ఎవరితో చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలని కోరుతున్నారు

# కొత్త స్ట్రాటజీలో జగన్



విజయవాడ, జూలై 4,

వైసీపీ అధినేత వైఎస్ జగన్ వేగం పెంచారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తి కావడంతో ఇక జనంలోకి వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అలాగే కొత్త నేతలకు కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిని ఇక పార్టీలోకి తిరిగి తీసుకోకుండా వారి స్థానంలో యువనేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగానే నిన్న జరిగిన పార్టీ యువజన విభాగం నేతలతో జరిగిన సమావేశంలో మంచి నేతలను గుర్తించి పార్టీలోకి తీసుకు రావాలని అనడం కూడా అందులో భాగమేనని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాలలో ఇప్పటి వరకూ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.వైసీపీ ఖచ్చితంగా ఈ సారి అధికారంలోకి వస్తుందని భావిస్తున్న జగన్ అందుకు అనుగుణంగా కార్యకర్తలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యువజన విభాగాన్ని పటిష్టం చేయడంతో పాటు పార్టీ అనుబంధ విభాగాలను కూడా మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కేసులకు భయపడి వెనుకంజ వేయవద్దని పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని భరోసా ఇన్తూ ఇక ఎఫెన్స్ లో వెళ్లేందుకు జగన్ నిర్ణయించుకుంటున్నట్లు తెలిసింది. అందుకే యువకులతో పాటు విద్యార్థి విభాగాన్ని కూడా బలోపేతం చేయడంతో పాటు మహిళ విభాగాన్ని కూడా మరింతగా శక్తిమంతం చేసి అధికార పార్టీకి కంటి మీద కునుకు లేకుండా చేయాలన్న యోచనలో ఉన్నారు.. త్వరలోనే వైఎస్ జగన్ వైసీపీ విద్యార్థి విభాగం, మహిళ విభాగం నేతలతో కూడా సమావేశం అయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరొక వైపు జగన్ తాను స్వయంగా సమస్యలపై జిల్లాలను పర్యటిస్తూ పార్టీకి మరింత హైప్ తేవాలని ప్రయత్నిస్తున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా ఏ వర్గాన్ని దూరం చేసుకోకుండా దగ్గరకు తీసుకునే యత్నంలోనే జగన్ ఉన్నట్లు కనపడుతుంది. గుంటూరులో మిర్చిరైతులు, పొదిలిలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధరల కోసం వెళ్లి వారితో మాట్లాడిన జగన్ తాజాగా ఈనెల 9న చిత్తూరు జిల్లా మామిడి రైతులతో కూడా సమావేశం కానున్నారు. ఇలా జిల్లా పర్యటనలతో పాటు మరొకవైపు పార్టీ అనుబంధ విభాగాలపై కూడా ఫోకస్ పెట్టారు. వైసీపీ సోషల్ మీడియా వింగ్ ను కూడా బలోపేతం చేసే దిశగా జగన్ ప్రయత్నాలు ప్రారంభించారు. సోషల్ మీడియా వారియర్స్ పై అక్రమ కేసులు పెడుతున్నారని, అయినా బెదరకుండా పనిచేసిన వారికి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతూ వస్తున్నారు. వైసీపీకి సోషల్ మీడియా బలం ఎక్కువ అన్న నేపథ్యంలో ఇటీవల అక్రమ కేసులతో కొంత వెనకబడి ఉండటాన్ని గమనించిన జగన్ ఆ దిశగా వారికి ధైర్యాన్ని కల్పించి, కేసులు వస్తే తాము అండగా ఉంటామని చెబుతున్నారు. మొత్తం మీద పార్టీ నేతలపై జగన్ ఆధారపడకుండా ఇక అనుబంధ విభాగాలను బలోపేతం చేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు కనపడుతుంది.

# ల్యాండ్ పూలింగ్.. కండిషన్స్ అప్లై...

విజయవాడ, జూలై4, ( కోసం కొత్తగా చేపట్టనున్న భూ సమీకరణకు నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాజధాని అభివృద్ధికి సీఆర్డిఏ పరిధిలో చేయనున్న భూ సమీకరణకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత భూ సమీకరణ (రూపకల్పన, అమలు) నిబంధనలు 2025 గెజిట్లో నిబంధనలను నోటిఫై చేస్తూ ఏపీ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ జీఓ నంబర్ 118 జారీ చేశారు. రాజధాని అమరావతి పరిధిలోని 217 చదరపు కిలోమీటర్లు మినహా సి ఆర్ డి ఏ మొత్తం ప్రాంతానికి ఈ నిబంధనలు వర్తిస్తాయి. 2014లో అమరావతికి ప్రకటించిన నిబంధనలను దాదాపుగా తాజా భూసేకరణకు వర్తింపజేస్తున్నారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, అన్ని ఇతర అవసరమైన ప్రాజెక్టుల వంటి అవసరమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మించడానికి, భూమి సేకరణ విధానం స్వచ్ఛంద పథకంగా రూపొందించారు. ఇది భూ యజమానులు, రాష్ట్రం/అధికార సంస్థ మధ్య పరస్పర ఏకాభిప్రాయం ఆధారంగా ఉంటుంది. ఇది భూమి సేకరణకు ఒక ప్రత్యేకమైన పద్ధతి 'ల్యాండ్ పూలింగ్ పథకం' అమలు చేస్తారు.ల్యాండ్ పూలింగ్ పథకం అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ రూపొందించిన పథకం, భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం, 2013లోని సెక్షన్ 107 ఒ 108 కింద అనుమతి కారణంగా. ల్యాండ్ పూలింగ్ పథకంలో పాల్గొనే భూ యజమానులు అప్పగించిన కారణంగా, ంఖ అఖీఅం చట్టం, 2014లోని సెక్షన్ 48(1) కింద రాష్ట్రం/అధికారికి ప్రాతినిధ్యం వహించే కాంపిటెంట్ అథారిటీ ఇచ్చిన అంగీకారంతో అందించిన భూమిలోని టైటిల్ రాష్ట్రం/అధికారానికి అనుకూలంగా బదిలీ కానుంది. ంఖ అఖీఅం చట్టం, 2014లోని సెక్షన్ 43(4)(జీ) కింద అంగీకరించిన అభివృద్ధి పథకం ప్రకారం, పునర్నిర్మించిన ప్లాట్‌ను అదే ప్రాంతంలో లేదా ఏదైనా ఇతర సమీపంలో భూమి యజమానికి అనుకూలంగా కేటాయించనున్నారు. చట్టంలోని సెక్షన్ 43(5) ఒ (6) ప్రకారం ల్యాండ్ పూలింగ్ పథకం కోసం ఏదైనా ప్రాంతం ఉద్దేశ్యాన్ని ప్రభుత్వమే గుర్తించి తెలియజేస్తే, అథారిటీ ఆమోదం అవసరం లేదు.కమిషనర్ ల్యాండ్ పూలింగ్ పథకాన్ని కొనసాగించడానికి అథారిటీని గుర్తించి ఆమోదం పొందిన తర్వాత, కమిషనర్/ అధికారి చట్టంలోని సెక్షన్ 55(4) కింద తన ఉద్దేశ్యాన్ని ప్రకటించడానికి నోటిఫికేషన్ ఎలో సూచించిన ఫార్మాట్‌లో సెక్షన్ 55(5) కింద అభ్యంతరాలను ఆహ్వానించారు.

– పురపాలక శాఖ పట్టా భూములు మెట్ట భూములైతే అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఎకరానికి 1000 గజాల నివాస స్థలంతో పాటు 250 గజాల కమర్షియల్ ప్లాట్ ఇస్తారు.

– జామ, నిమ్మ, సపోటా వంటి పండ్ల తోటలున్న భూములకు లక్ష రూపాయలు చొప్పున కేవలం ఒక్కసారి పరిహారం చెల్లిస్తారు.

– జరీబు భూములు ఇచ్చే వారికి ఎకరానికి 1000 చదరపు గజాల నివాసం స్థలంతో పాటు 450 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్ స్థలం

ఎసైన్డ్ భూములకు, శివాయ్ జమేదార్స్, అభ్యంతరం లేని, అభ్యంతరం ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు చేస్తున్న వారికి కేటగిరీల వారీగా వేర్వేరు ప్యాకేజీలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

– ఒకవేళ పట్టా భూములు 1954 కి ముందు, ఆ తర్వాత ఎసైన్ చేసిన భూములు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితుల భూములకు మాత్రమే కౌలు చెల్లిస్తారు. మిగతా కేటగిరీల భూములకు ఎలాంటి కౌలు చెల్లించరు.

– మెట్ట భూములకు తొలి ఏడాదికి ఎకరానికి రూ.30 వేలు, జరీబు భూములకు రూ.50 వేల చొప్పున కౌలు చెల్లిస్తారు. రెండో ఏడాది నుంచి ముందు ఏడాది ఇచ్చిన దాంట్లో ఏటా 10 శాతం అధికంగా చెల్లిస్తారు. అనధికారిక లేఅవుట్లలోని స్థలాలకు 65 శాతం పరిహారం గానీ, గరిష్టంగా 500 చదరపు గజాల భూమి గానీ పరిహారంగా ఇస్తారు. సీఆర్‌డీఏ/డీటీసీపీ లేదా వీజీటీఎం–ఉడా అనుమతితో వేసిన లేఅవుట్లతో పాటు గ్రామకంఠం, అగ్రహారం, అబాది, విలేజ్ సైట్‌లను తాజా భూ సేకరణ నుంచి మినహాయిస్తారు. బలహీనవర్గాల కోసం ఇళ్లు నిర్మించిన కాలనీలను, విస్తరించిన గ్రామ కంఠాలను మినహాయిస్తారు. అయితే భూసమీకరణ నిర్ణయం ప్రకటించే నాటికి ఉన్నవాటినే పరిగణనలోకి తీసుకుంటారు. భూములు తీసుకునే గ్రామాల్లోని వ్యవసాయ కూలీలు, భూమి లేని నిరుపేదలకు నెలకు రూ.5 వేల చొప్పున 10 సంవత్సరాల పాటు పింఛను ఇస్తారు.

# రాయచోటిలో స్లీపర్ సెల్స్...

కడప, జూలై 4,

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉగ్రవాదుల స్థావరాలపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీ అనే ఇద్దరు ఉగ్రవాదులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి పేలుడు పదార్థాలు, మూడు నగరాల మ్యాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు 'అలూమా' అనే సంస్థకు చెందినవారని, దేశంలో పేలుళ్లకు కుట్ర పన్నారని డీఐజీ తెలిపారు. ఈ కేసులో వారి కుటుంబ సభ్యుల పాత్రపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. అసలు ఈ ఉగ్రవాదుల వెనుక ఎవరున్నారు?అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉగ్రవాదుల స్థావరాల ఏర్పాటు అంశం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై తాజాగా కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కీలక సమాచారం వెల్లడించారు. పోలీసులు ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్నారని ఆయన తెలిపారు. తమిళనాడు ఐబీ పోలీసులు.. అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీ అనే ఇద్దరు ఉగ్రవాదులను రాయచోటిలో అరెస్టు చేశారు. 'అలూమా' అనే ఉగ్రవాద సంస్థకు చెందిన వీరు దేశంలోని మూడు నగరాల్లో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసుకి సంబంధించి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ.. రాయచోటిలో నిందితులకు సహకరిస్తున్న వారిపై విచారణ చేస్తున్నామని చెప్పారు. దాదాపు 50 ఐఈడీలు (పేలుడు పదార్థాలు) తయారు చేసేందుకు కావాల్సిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఐసిస్, అలూమా సంస్థలు ఒకే విధమైన ఆలోచనలతో పనిచేస్తాయని ఆయన అన్నారు. అలూమా అనేది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ఉగ్రవాద సంస్థ అని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు పోలీసులు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోందని డీఐజీ పేర్కొన్నారు. రాయచోటిలో కొత్త వారిని చేర్చుకుని, వారికి శిక్షణ ఇచ్చినట్లు ఇప్పటివరకు నిర్ధారణ కాలేదని ఆయన స్పష్టం చేశారు.పేలుడు పదార్థాలు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై విచారణ చేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కేసుపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు కూడా పనిచేస్తున్నాయి. '20 ఏళ్లయినా చట్టం నుంచి తప్పించుకోలేరనడానికి ఇది నిదర్శనం" అని డీఐజీ అన్నారు. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత దేశంలో ముష్కర మూకల భరతం పడుతోన్న దర్యాప్తు సంస్థలు.. పలు కుట్రలను భగ్నం చేస్తున్నారు.ఉగ్రవాదుల కుటుంబ సభ్యులకు పేలుడు పదార్థాల గురించి తెలుసా? లేదా? అనే విషయంపై అనుమానాలు ఉన్నాయని డీఐజీ తెలిపారు. వారికి తెలిసే చేశారా లేదా అనేది విచారణలో తెలుస్తుందని ఆయన అన్నారు. సాంకేతిక నైపుణ్యం కలిగిన ఈ ఉగ్రవాదులు రాయచోటిలో స్థిరపడిన తర్వాత.. 2013 బెంగళూరు మల్లేశ్వరంలో జరిగిన పేలుళ్లలో వీరి ప్రమేయం ఉందని ఆయన చెప్పారు. నిందితుల నుంచి పేలుడు పదార్థాలతో పాటు ఫ్యూయల్ ఆయిల్ కలిపిన అమ్మోనియం నైట్రేట్, గన్ పౌడర్‌లు, దేశంలోని మూడు ప్రధాన నగరాలు, రైల్వే నెట్‌వర్క్‌ల మ్యాప్‌లు దొరికాయని ఆయన వివరించారు.అబూబకర్ సిద్ధిఖీ భార్య షేక్ సైరాభాను, మహ్మద్ అలీ భార్య షేక్ షమీమ్‌లపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో వారిని కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసుకి సంబంధించి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# మళ్లీ వైసీపీ గూటికి విజయసాయి

నెల్లూరు, జూలై 4,

వైసీపీలోకి విజయసాయిరెడ్డి వస్తారా? అందుకు అవసరమైన చర్చలు సాగుతున్నాయా? జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసారా? విజయసాయిరెడ్డి సైతం మొగ్గు చూపారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల పార్టీ ముఖ్య నేత జగన్మోహన్ రెడ్డి వద్ద ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉందని.. విజయసాయి రెడ్డి లాంటి నేత ఉంటే బాగుంటుందని.. విజయసాయిరెడ్డిని పార్టీలోకి పెద్దమంటూ ఆయన ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. అయితే సాయి రెడ్డి వస్తే తనకు ఎటువంటి అభ్యంతరం లేదని జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. ఒకవేళ విజయసాయిరెడ్డి వైసీపీలోకి వస్తే అది సంచలన అంశంగా మారనుంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంతో విజయసాయి రెడ్డికి సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆ కుటుంబ ఆడిటర్ గా ఉండే విజయసాయిరెడ్డి జగన్మోహన్ రెడ్డికి దగ్గరయ్యారు. ఆయన పరిశ్రమలకు సంబంధించి అన్ని కార్యకలాపాలను చూసుకునేవారు. అందులో భాగంగానే జగన్ పై వచ్చిన అవినీతి కేసుల్లో కూడా విజయసాయిరెడ్డి నిందితుడిగా మారారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు 16 నెలల పాటు జైలు జీవితం కూడా అనుభవించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు, ఆ పార్టీ విస్తరణ, కేంద్ర పెద్దలతో సాన్నిహిత్యం, పార్టీని అధికారంలోకి తీసుకుని రావడం వెనుక విజయసాయిరెడ్డి కృషి ఉంది. అయితే 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత విజయసాయిరెడ్డి అనూహ్యంగా పార్టీకి గుడ్ బై చెప్పారు. అయినా సరే ఎక్కడా జగన్మోహన్ రెడ్డి పై వ్యతిరేకంగా మాట్లాడలేదు.వైయస్సార్ కాంగ్రెస్( పార్టీ సైతం విజయసాయి రెడ్డికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చింది. 2014లో 67 సీట్లతో గౌరవప్రదమైన ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. దీంతో తొలి రాజ్యసభ పదవిని దక్కించుకున్నారు విజయసాయిరెడ్డి. అది మొదలు కేంద్ర పెద్దలతో సాన్నిహిత్యం పెంచుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ తో పాటు జగన్మోహన్ రెడ్డి కోసం కేంద్ర పెద్దలకు సాగిలాలు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా విజయసాయిరెడ్డి ప్రాధాన్యం పెరిగింది. పార్టీతో పాటు ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించారు. అయితే అనూహ్యంగా సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర పెరిగి.. విజయసాయిరెడ్డి ప్రాధాన్యతను తగ్గించారు. ఒకానొక దశలో పార్టీకి గుడ్ బై చెబుతారన్న క్రమంలో



మళ్లీ దగ్గరకు తీసుకుని నెల్లూరు పార్లమెంట్ సీటు ఇచ్చారు. అయితే అక్కడ విజయసాయి రెడ్డికి ఓటమి ఎదురైంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చాలా రకాల కేసులు విజయసాయిరెడ్డికి ఎదురయ్యాయి. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్ చుట్టూ విజయసాయి రెడ్డికి వ్యతిరేకంగా కోటరి పెరిగింది. దీనిని తట్టుకోలేక పోయారు విజయసాయిరెడ్డి. ఒకవైపు కేసులు ఎదురు కావడం.. ఇంకోవైపు ప్రాధాన్యత తగ్గడంతో పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇకనుంచి ఏ పార్టీలో చేరనని.. వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు. కానీ తరచూ రాజకీయ వ్యాఖ్యానాలు చేస్తూ.. తనలో ఇంకా రాజకీయ ఆసక్తి తగ్గలేదని సంకేతాలు పంపారు.తొలుత విజయసాయిరెడ్డి బిజెపిలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. కానీ అటువంటిదేమీ జరగలేదు. అయితే వైసిపి హయాంలో జరిగిన కేసులకు సంబంధించి వాంగ్మూలం ఇచ్చారు ప్రత్యేక దర్యాప్తు బృందం ఎదుట. దీనిపై జగన్మోహన్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు కూడా. అయినా సరే విజయసాయిరెడ్డి జగన్ విషయంలో ఎటువంటి విమర్శలు చేయలేదు. అయితే ఇప్పుడు విజయసాయిరెడ్డిని పార్టీలోకి తెస్తే బాగుంటుందన్న సీనియర్ నేతల అభిప్రాయాన్ని జగన్ ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విజయసాయిరెడ్డి తో వైసీపీ కీలక నేత చర్చలు జరుపుతున్నారని.. త్వరలో ఆయన రావడం ఖాయమని వైసిపిలో ప్రచారం జరుగుతుంది. ఒకవేళ ఆయన కానీ వైసీపీలోకి వస్తే ఇదో సంచలన అంశంగా మారే అవకాశం ఉంది.

## తుంగభద్రకు భారీ వరద ఉధృతి 20 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

కర్నూలు

తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో అధికారులు 20 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. తుంగభద్ర నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 77 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 56 వేల క్యూసెక్కుల వరద జలాశయంలో చేరుతుండగా.. 20 గేట్ల ద్వారా అంతే మొత్తంలో నీటిని శ్రీశైలం జలాశయానికి విడుదల చేశారు.

## అసెంబ్లీ మీడియా సలహా మండలి అధ్యక్షుడుగా సీనియర్ జర్నలిస్టు ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

## నియామక ఉత్తర్వులను జారీ చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్

హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ మీడియా సలహా మండలి చైర్మన్ గా సీనియర్ జర్నలిస్టు, ద న్యూ ఇండియన్ ఎక్స్ప్రెస్ పొలిటికల్ ఎడిటర్ ఐరెడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం నాడు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఐ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి దాదాపు 16 సంవత్సరాలకు పైగా జర్నలిస్టుగా గతంలో ఆంధ్రజ్యోతి, సాక్షి, డెక్కన్ క్రానికల్ పత్రికల్లో వివిధ హోదాల్లో పని చేశారు. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంపై సంపూర్ణ అవగాహన కలిగిన శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం న్యూ ఇండియన్ ఎక్స్ప్రెస్ ఆంగ్ల పత్రికలో పొలిటికల్ ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. స్పీకర్ ఉత్తర్వుల ప్రకారం రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. తనను అసెంబ్లీ మీడియా సలహా మండలి అధ్యక్షుడిగా నియమించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గారికి, స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కి ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కాగా, 15 మందితో ఏర్పాటు చేసిన మీడియా సలహా మండలి లో చైర్మన్ గా ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో చైర్మన్ గా పోలోజు పరిపూర్ణాచారి, సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులైన అయితరాజు రంగారావు, బొడ్లపాటి పూర్ణచంద్రారావు, ఎల్ వెంకట్రాం రెడ్డి, పొలంపల్లి ఆంజనేయులు, ఎం పవన్ కుమార్, భీమనపల్లి అశోక్, బుర్ర ఆంజనేయులు గౌడ్, సురేఖ అబ్బూరి, మహమ్మద్ నయీమ్ వజాహత్, బసవపున్నయ్య , ప్రమోద్ కుమార్ చతుర్వేది, సుంచు అశోక్, బీహెచ్ఎంకే గాంధీ నియమితులయ్యారు.

## పెండింగ్ ప్రాజెక్టులను గాడిలో పెట్టే ప్రయత్నం

## ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష మంత్రి నిమ్మల రామానాయుడు

విజయవాడ

విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ఆయా ప్రాజెక్టుల సిఈలు,ఎస్ఈలు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ప్రాధాన్యత ఇవ్వాలని వచ్చేవారు ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్ష చేయబోతున్నారు. గత అయిదేళ్ళు ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర ప్రజలకు సాగు, తాగు నీరందించే లక్ష్యంతో పెండింగ్ ప్రాజెక్టులను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. 90శాతం పనులు పూర్తైన వంశధార స్టేజ్-2, ఫేజ్-2 మరియు తోటపల్లి బ్యారేజ్ పనులను గత ప్రభుత్వం గాలికొదిలేసింది.. వంశధార- నాగావళి మరియు నాగావళి-చంపావతి అనుసంధానం బ్యాలెన్స్ పనులపై సమీక్ష జరిపాం. హీరమండలం లిఫ్ట్, మద్దువలస స్టేజ్-2, జంజ్యావతి రిజర్వాయర్ పనులు వేగవంతం, జైకా నిధులతో నత్తనడకన సాగుతూ నిలిచిపోయిన ఆంధ్ర రిజర్వాయర్, రైవాడ, పెద్దంకలం, పెద్దగడ్డ, వట్టిగెడ్డ, పూర్తిచేయడానికి ఉన్న అవాంతరాలపై సమీక్ష చేసామని అన్నారు.

.

## స్టాక్ మార్కెట్ పేరిట కుచ్చుటోపి

భూపాలపల్లి

స్టాక్ ట్రేడింగ్ పేరిట రూ.12లక్షలు సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు.ఈ ఘటన భూపాలపల్లి పట్టణంలో చోటు చేసుకుంది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణాకాలనీకి చెందిన ఓ ఉద్యోగిని నాలుగు రోజుల క్రితం వాట్సాప్ ద్వారా స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ అడ్వ యిజర్లమని కావ్య, సంధ్య అనే మహిళలు సం ప్రదించారు. పెట్టుబడి ప్రణాళికలను వివ రిస్తూ మీరు కేవలం 15 రోజుల్లో 50శాతం లాభాలు పొందవచ్చని నమ్మించారు. దీంతో ఆశపడిన సదరు ఉద్యోగి మొదట రూ.లక్ష పెట్టుబడి పెట్టగా, దానికి లాభాలు వచ్చాయని సైబర్ నేరగాళ్లు పంపించారు. ఆ తరువాత బాధితుడు దశల వారీగా రూ.12లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. రెండు రోజుల తరువాత సైబర్ నేరగాళ్లు వాట్సాప్ నంబర్లు మార్చే శారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు భూపాలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచార ణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఏపీ కేంద్రంగా ఉగ్రకార్యాకలాపాలు

విజయవాడ, జూలై 4, (

భారత దేశంలో ఉగ్రవాదులు అంటే గుర్తుకు వచ్చేది జమ్మూ కశ్మీర్, తర్వాత రాజస్థాన్, పంజాబ్, ఢిల్లీ, ముంబై గుర్తొస్తాయి. కానీ, ప్రస్తుతం దేశమంతా ఉగ్రవాదులు విస్తరిస్తున్నారు. అయితే ఇంతకాలం ప్రశాంతం అనుకున్న ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా పట్టుబడుతున్న ఉగ్రవాదులు తెలుగువారు ఉలిక్కిపడేలా చేస్తున్నారు. ఈ ఘటనలతో ఆంధ్రప్రదేశ్ ఉగ్రవాదుల ఆశ్రయంగా మారిందా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మే నెలలో విజయనగరంలో ఇద్దరు ఉగ్రవాదులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. పేలుళ్లకు కుట్ర పన్నిన సమయంలో పక్కా సమాచారంతో ఇద్దరిని అరెస్టు చేశారు. దీంతో ప్రశాంతంగా ఉండే విజయనగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇక తాజాగా రాయలసీమలోని అన్నమయ్య జిల్లాలో మరో ఇద్దరు ఉగ్రవాదులు పట్టుపడ్డారు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లో కలకలం రేపింది. 30 ఏళ్లుగా పరారీలో ఉన్న ఇద్దరు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు, అబూబక్కర్ సిద్దీక్(60), మొహమ్మద్ అలీ అలియాస్ యూనుస్ (కేరళలోని మేళపలయం), తమిళనాడు యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్), ఆంధ్రప్రదేశ్ పోలీసుల సహకారంతో జూన్ 30న అరెస్టయ్యారు. వీరు 1995లో చెన్నైలో హిందూ మున్నాని కార్యాలయంలో బాంబు పేలుడు, నాగూరులో పార్సిల్ బాంబు దాడి, 1999లో చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూరు, కేరళలో ఏడు చోట్ల బాంబు దాడులు, 2011లో ఎల్.కే. అద్వానీ రథయాత్ర సమయంలో పైపు బాంబు దాడి కుట్రతో సహా అనేక ఉగ్రవాద కార్యకలాపాల్లో నిందితులుగా ఉన్నారు.అబూబక్కర్ సిద్దీక్, మొహమ్మద్ అలీ అలియాస్ యూనుస్ రాయచోటిలో మారువేషంలో జీవనం సాగిస్తున్నారు. సిద్దీక్ స్థానియ యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే అందరితో కలిసిపోయాడు. స్థానికులతో పరిచయాలు పెంచుకున్నాడు. చీరల వ్యాపారం చేస్తున్నాడు. మహ్మద్ అలీ మరో చిరు వ్యాపారం చేస్తున్నాడు. స్థానికులు వీరి గురించి తెలియకుండా సహకారం అందిస్తూ వచ్చారు.చెన్నై ఇంటెలిజెన్స్ బ్యూరో, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రెండు నెలల పాటు వీరిపై నిఘా పెట్టాయి. స్థానిక పోలీసుల సహాయంతో వీరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు తర్వాత వీరిని తమిళనాడుకు తరలించారు, అక్కడ మరింత దర్యాప్తు జరుగుతోంది. ఈ ఘటన స్థానికుల్లో భయాందోళన కలిగించింది. ఇంతకాలం ఉగ్రవాదులు తమ మధ్య సాధారణంగా తిరుగుతూ ఉండటం షాక్‌కు గురిచేసిందిఆంధ్రప్రదేశ్ ఉగ్రవాదులకు ఆశ్రయంగా మారుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాయచోటి వంటి చిన్న పట్టణాల్లో ఉగ్రవాదులు మారువేషంలో దాక్కున్న సంఘటనలు బయటపడటంతో జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్‌లో గతంలోను పలుమార్లు ఉగ్రవాదులు పట్టుబడ్డారు. 2007లో హైదరాబాద్‌లోని మక్కా మసీదు వద్ద జరిగిన బాంబు పేలుళ్ల, 2013లో దిల్‌సుఖ్‌నగర్ బాంబు దాడులలో భారతీయ ముజాహిదీన్ (ఐఎమ్) వంటి సంస్థలతో సంబంధం ఉన్న ఉగ్రవాదులు పట్టుబడ్డారు. ఈ ఘటనలలో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు ఉగ్రవాదులకు తాత్కాలిక ఆశ్రయంగా ఉపయోగపడినట్లు దర్యాప్తులో తేలింది. 2014?16 మధ్య, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి ఇస్లామిక్ స్టేట్‌తో సంబంధాలున్న కొందరు వ్యక్తులు గుర్తించబడ్డారు. ఎన్ఐఏ. దర్యాప్తులో గుంటూరు, నెల్లూరు వంటి ప్రాంతాలలో ఐఎస్ రిక్రూట్‌మెంట్ కార్యకలాపాలకు సంబంధించిన కొందరు అనుమానితులు అరెస్టయ్యారు. మదనపల్లి, రాజమండ్రిలో కూడా ఉగ్రవాదులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన ఉగ్రవాది గతంలో మదనపల్లికి చెందిన యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. చాలాకాలం తర్వాత అతడిని ఎన్ఐఏ గుర్తించింది. ఎల్‌కే.అధ్వానీ హత్యకు యత్నించిన ఉగ్రవాదులను 2013లో రాజమండ్రిలో పోలీసులు అరెస్టు చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు ప్రధానంగా జమ్మూ కాశ్మీర్ లేదా ఇతర ఉత్తర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉన్నప్పటికీ విజయనగరం, రాయచోటి వంటి సంఘటనలు రాష్ట్రంలో నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

## కష్టాల్లో మామిడి రైతులు రైతుల వెతలు తీర్చలేని చంద్రబాబు భూమన

తిరుపతి: రాష్ట్రంలో మామిడి రైతులు కష్టాలు అన్నీఇన్ని కావు. సరైన ధరలేక అవస్థలు పడుతున్నారు. రాయలసీమ లో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఉమ్మడి జిల్లా వైకాపా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కూటమి భుజాలపై ఉన్న మామిడి రైతులను ఆదుకునే పరిస్థితి లేదు. కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబు, మామిడి రైతుల వేతలను తీర్చే ప్రయత్నం చేయలేదు. ఆయన సమయాన్ని మొత్తం జగన్ ను విమర్శించమే పనిగా చంద్రబాబు పెట్టుకున్నారు. కర్ణాటకలో జేడీఎస్ అధినేత కుమారస్వామి మామిడి రాయితీలను ఆదుకోవాలని లేఖ రాస్తే వెంటనే కేంద్రం స్పందించినదని అన్నారు.

ఇక్కడ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ . పవన్ దేనిపైన మాట్లాడడం లేదు.ఆయన స్పందించడం మానేశారు. 9వ తేదీ వైయస్ జగన్ వస్తానంటే, ఆయన పై చంద్రబాబు చిందులు వేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యం కంటే ఎక్కువగా రైతులకు నష్టం వచ్చింది. ప్రకటించిన మద్దతు ధర, అతితక్కువ. ఆ డబ్బులు కూడా ఇంత వరకు ఇవ్వలేదు. కర్ణాటకలో 2,50,000 టన్నుల మామిడిని కేంద్రం కొనుగోలు చేసింది. అక్కడ వారికి ఎంపీలు కూడా తక్కువే. మా తాట తీస్తామని చెబుతున్నారు. 2047 కి రాష్ట్ర స్వరూపాన్ని మారుస్తాను అంటున్నారు.. వికటఅట్టహాసం చేస్తున్నారే తప్ప, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. వైసీపీ నేతలను జైలుకు పంపాలని చంద్రబాబు ఉబలాట పడుతున్నారు. జగన్ ఒక ఆదర్శ రాజకీయ నాయకుని, రాజకీయాన్ని అంతం చేయాలని చూడడం ఏమిటి.హింస, మోసం, వెన్ను పోటు, వంచన తో రాజకీయాలు చేసిన చంద్రబాబు, మా నాయకుని గురించి మాట్లాడుతున్నారు.. అహంకారపు రాజకీయాలు, వంచన రాజకీయ వ్యవహారాలపై జగన్ పోరాటం. జగన్ పర్యటనకు ఏన్ని అడ్డంకులు సృష్టించినా, బంగారు పాళ్యం వస్తారని అన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం రెండు లారీలు ఢీ - ముగ్గురి సజీవ దహనం

మహబూబాబాద్

మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజి వద్ద ఈరోజు తెల్లవారు జామున 4గంటల సమయంలో ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొనడంతో రెండు లారీలలో మంటలు అలుముకున్నాయి రెండు లారిలలో ఉన్న ముగ్గురు మంటలలో సజీవ దహనం అయ్యారు. సమాచారం తెలుసుకున్న మరిపెడ పోలీస్ అధికారులు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

# జగన్‌తోనే వంశీనా...

విజయవాడ, జూలై 4,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వల్లభనేని వంశీ జైలు నుంచి బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. సుమారు 138 రోజుల అనంతరం ఆయనకు జైలు నుంచి విముక్తి లభించింది. ఆయనపై నమోదైన 11 కేసులకు సంబంధించి.. బెయిల్ లభించింది. దీంతో నిన్ననే ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. జైలు బయట మాజీ మంత్రి పేర్ని నాని, వైసీపీ ఎమ్మెల్సీ తలశీల రఘురాం ఆత్మీయంగా స్వాగతం పలికారు. భారీ కాన్వాయ్ నడుమ విజయవాడలోని నివాసానికి చేరుకున్నారు వల్లభనేని వంశీ మోహన్. మరోవైపు ఈరోజు వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డిని కలుసుకున్నారు వంశీ. ఆయన వెంట భార్య పంకజశ్రీ కూడా ఉన్నారు. ఈరోజు తాడేపల్లి లోని జగన్ నివాసానికి వచ్చి కలిశారు. ఈ సందర్భంగా జైలు జీవితం, తాజా పరిణామాలపై ఆయనతో మాట్లాడారు.2019 ఎన్నికల్లో టిడిపి( నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ మోహన్ అనూహ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అలా వెళ్లిన నాటి నుంచి చంద్రబాబుతో పాటు లోకేష్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. నిత్యం అనుచిత వ్యాఖ్యలతో రాజకీయ సంచలనాలకు కేంద్ర బిందువు అయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొద్ది రోజులపాటు గ్యాప్ వచ్చింది. నియోజకవర్గానికి దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో వల్లభనేని వంశీ మోహన్ గతంలో చేసిన వ్యాఖ్యలపై వరుసగా కేసులు నమోదయ్యాయి. దీంతో పోలీసులు ఫిబ్రవరి 17న వల్లభనేని వంశీ మోహన్ ను అరెస్టు చేశారు. ఆయన అరెస్టు జరిగిన తర్వాత జగన్మోహన్ రెడ్డి నేరుగా జైలుకు వెళ్లి పరామర్శించారు. ఇప్పుడు విడుదల కావడంతో అధినేత జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.వరుసగా కేసులు నమోదు కావడం. దాదాపు 5 నెలల పాటు జైలు జీవితం గడపడంతో మధ్యలో అనారోగ్యానికి గురయ్యారు వల్లభనేని వంశీ మోహన్. కోర్టులకు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్న ప్రతిసారి ఆయనపై.. మరో రకమైన కేసులు నమోదు చేసేవారు. అయితే చివరకు అన్ని కేసుల్లోనూ బెయిల్ రావడంతో నిన్ననే విజయవాడ జైలు నుంచి విడుదలయ్యారు వంశీ. దీంతో అధినేత వైయున్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కష్టకాలంలో అండగా నిలిచినందుకు వంశీ దంపతులు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీలో క్రియాశీలకంగా కావాలని జగన్మోహన్ రెడ్డి ఈ సందర్భంగా వల్లభనేని వంశీ మోహన్ కు సూచించినట్లు సమాచారం.

=================


**యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్**

(భారత ప్రభుత్వ సంస్థ)

తుమ్మలపల్లె, పి.ఓ.: యం.సి.పల్లె, వేముల మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 516 349.

website : www.uraniumcorp.in

ప్రకటన నెం : UCIL-04/2025

**వాక్ ఇన్ ఇంటర్వ్యూ**

అణుశక్తి శాఖ పరిపాలనా నియంత్రణలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ UCIL, ప్రారంభంలో 01 (ఒక) సంవత్సరం కాలానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్‌ను నియమించాలని భావిస్తోంది మరియు అవసరం మరియు అనుకూలతను బట్టి ఒక సంవత్సరం పొడిగింపు కోసం యాజమాన్యం దీనిని సమీక్షించవచ్చు. అర్హత ప్రమాణాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:–

| అర్హతలు & అనుభవం | పోస్టుల సంఖ్య | 21-07-2025 నాటికి అనుభవం | ఏకీకృత నెలవారీ వేతనం | 21.07.2025 నాటికి వయోపరిమితి | గమనిక |
|---|---|---|---|---|---|
| భారత వైద్య మండలిచే గుర్తింపు పొందిన MBBS మరియు ప్రఖ్యాత ఆసుపత్రిలో కనీసం రెండు సంవత్సరాల సంబంధిత అనుభవం.<br>సంబంధిత రంగంలో PG డిగ్రీ అదనపు ప్రయోజనం.<br>AFIH అర్హత ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. | 02 (అన్ రిజర్వ్‌డ్) పురుషులు-01 & స్త్రీలు-01 (తాత్కాలికమైన) | అనుభవం 02 సం॥లు & అంతకంటే ఎక్కువ కానీ 05 సం॥ల కంటే తక్కువ | నెలకు రూ. 76,000/- | 65 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారికి సడలింపు ఇవ్వబడుతుంది. | ఖాళీల సంఖ్య తాత్కాలికంగా ఉంటుంది మరియు కంపెనీ అవసరాలకు అనుగుణంగా పెంచవచ్చు |
| | | అనుభవం 05 సం॥లు & అంతకంటే ఎక్కువ కానీ 09 సం॥లు కంటే తక్కువ | నెలకు రూ. 95,000/- | | |
| | | అనుభవం 09 సం॥లు & అంతకంటే ఎక్కువ | నెలకు రూ.1,14,000/- | | |

అర్హత ప్రమాణాలు కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు 21.07.2025 (సోమవారం) ఉదయం 09.30 గంటలకు పైన పేర్కొన్న చిరునామాలోని UCIL తుమ్మలపల్లె యూనిట్‌లోని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో వ్యక్తిగత ఇంటర్వ్యూ కోసం హాజరుకావలెను. అభ్యర్థులు ఇటీవలి పాస్‌పోర్ట్ సైజు ఫోటోగ్రాఫ్, వారి అర్హతలు, అనుభవం మొదలైన వాటికి మద్దతుగా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు & టెస్టిమోనియల్స్ మరియు నవీకరించబడిన బయోడేటాతో పాటు అన్ని సంబంధిత పత్రాల ఫోటోకాపీలను తీసుకురావాలి. తెలుగు భాషా పరిజ్ఞానం తప్పనిసరి. ఇంటర్వ్యూకు హాజరు కావడానికి TA/DA చెల్లించబడదు. UCIL హౌసింగ్ కాలనీ–TMPLలో వసతి కల్పించబడవచ్చు, లభ్యతను బట్టి ఛార్జ్ చేయదగిన ప్రాతిపదికన. ప్రకటన & దరఖాస్తు ఫార్మాట్ మా అధికారిక వెబ్‌సైట్ : www.uraniumcorp.inలో కూడా అందుబాటులో ఉన్నాయి.

CBC48134/12/0015/2526

# టూరిస్ట్ స్పాట్ కు కర్రెగట్టు

రాయ్ పూర్, జూలై 4,

ఊటీని సందర్శించడానికి దేశవ్యాప్తంగా పర్యాటకులు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా కూడా సందర్శకులు వస్తూ ఉంటారు. అయితే తెలంగాణ వాసులు ఇకపై వేసవికాలంలోనే కాదు.. ఏ కాలంలో కూడా ఊటీ వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఊటీని అందుబాటులోకి తీసుకురానుంది. తెలంగాణలో ఉన్న కర్రెగుట్టల ప్రాంతాన్ని కేంద్రం పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తయినట్టు తెలుస్తోంది. ఇటీవల ఈ ప్రాంతంలో మావోయిస్టులను కేంద్రం ఎరివేసింది. చాలా రోజులపాటు కేంద్ర బలగాలు ఈ ప్రాంతంలో తిష్ట వేశాయి. మావోయిస్టులను భారీ సంఖ్యలో హతమార్చాయి. మంటూ వేసవిలో మావోయిస్టుల ఏరివేతను అత్యంత విజయవంతంగా చేపట్టాయి. దీంతో ఈ ప్రాంతం మావోయిస్టుల నుంచి కేంద్ర బలగాల చేతిలోకి వచ్చింది. ఇక్కడ కొండలు, చెట్లు, జలపాతాలు అద్భుతంగా ఉన్న నేపథ్యంలో.. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆ దిశగా ప్రణాళికలను రూపొందించినట్టు సమాచారం. కర్రెగుట్టల ప్రాంతంలో వాతావరణం అద్భుతంగా ఉంటుంది. ఒకరకంగా ఇది ఊటీ లాగానే ఉంటుంది. ఊటికి మించిన గుహలు ఎక్కడ ఉన్నాయి. ఇక జలపాతాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అడవులయితే అత్యంత దట్టంగా ఉంటాయి. ఇక్కడ వాతావరణం వేసవిలో కూడా అద్భుతంగా ఉంటుంది. అందువల్లే ఈ ప్రాంతాన్ని తెలంగాణ ఊటీ లాగా మార్చాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది.. దీనికి సంబంధించి కేంద్ర హోం శాఖ మంత్రి కూడా సంకేతాలు ఇచ్చినట్టు సమాచారం. అయితే ఈ ప్రాంతం దట్టమైన అడవి మధ్యలో ఉన్న నేపథ్యంలో పర్యాటకులకు భద్రత కల్పించే బాధ్యత కూడా కేంద్రం తీసుకుంటుందని తెలుస్తోంది. ఇక్కడ అతిపెద్ద సాయుధ బలగాల శిక్షణ కేంద్రాన్ని నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది..ఇక్కడి వాతావరణం విభిన్నంగా ఉండడం.. మండువేసవిలోనూ చల్లగా ఉండడంవల్ల.. పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కేంద్ర భావిస్తున్నట్లు తెలుస్తోంది.. ఇక్కడ భారీగా రహదారులు నిర్మించాలని.. పర్యాటకులకు అనుకూలంగా ఉండే విధంగా హోటల్స్, రిసార్టులు నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఇతర హంగులు కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది.. ఒకప్పుడు ఈ ప్రాంతం మావోయిస్టులకు పెట్టని కోట కాబట్టి ప్రతి ఐదు కిలోమీటర్ల కు ఒకటి చొప్పున ఫార్వర్డ్ ఆపరేషన్ బేస్ నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ ప్రాంతంలో స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు కూడా భద్రత కల్పిస్తాయని సమాచారం. మరికొద్ది రోజుల్లో ఈ ప్రాంతం అభివృద్ధికి సంబంధించి కేంద్రం స్పష్టమైన ఆదేశాలు ఇస్తుందని తెలుస్తోంది.

# మొబైల్ పేలి వ్యక్తికి తీవ్ర గాయాలు

రంగారెడ్డి

ప్యాంట్ జేబులో ఉన్న మొబైల్ పేలడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలైన ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీనివాస్ అనే యువకుడు మొబైల్ ఫోన్ ను జేబులో పెట్టుకొని నదుకేజుకుంటూ వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. పేలుడుతో శ్రీనివాస్ తొడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఓవర్ హీట్ కారణంగా పేలినట్లు పోలీసులు భావిస్తున్నారు.

# పరిగిలో వన మహోత్సవం

పరిగి

వికారాబాద్ జిల్లా పరిగి వన మహోత్సవంలో భాగంగా , పరిగి మున్సిపల్ పరిధిలో 45 వేల మొక్కలు నాటుదామని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పరిగి లోని ఓ కాలనీలోని పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య మాట్లాడుతూ మున్సిపల్ లో మొక్కలు నాటేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలు కూడా ప్రతి ఇంటి ముందు కనీసం 6 మొక్కలు పెంచాలని సూచించారు. ఈ వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాడుల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

మేడ్చల్ అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ లోని కందుకూరు మండలం ముప్పల గ్రామానికి చెందిన రాంబాబు తో ప్రశాంతి (22) వివాహం సంవత్సరం కిందటే జరిగింది .వీరికి ఐదు నెలల పాప ఉంది. రాంబాబు వృత్తి రీత్యా మేస్త్రీ పని చేస్తూ ఉండేవాడు. నెల రోజుల కిందట మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్లు అద్దెకు దిగారు. శుక్రవారం ఉదయం బంధువులు రాంబాబుకి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బంధువులు ఇంటికి వెళ్లి చూసేసరికి అప్పటికే ప్రశాంతి మృతి చెందింది. ఐదు నెలల పాప ఏడుస్తూ కనిపించింది. భర్త రాంబాబు ఇంట్లో లేకపోవడంతో హత్య చేసి పారిపోయాడని బంధువులు ఆరోపిస్తున్నారు. సంఘటన స్థలానికి మేడ్చల్ పోలీసులు చేరుకొని వివరాలను సేకరిస్తున్నారు

# ఖమ్మం నగరంలో ఫుడ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

ఖమ్మం ఖమ్మం నగరంలో రాష్ట్ర ఫుడ్ కంట్రోలర్, టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు జరిపారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ జ్యోతిర్మయి అధ్వర్యంలో జీపీ రెడ్డీ స్వీట్స్, పీఎస్కే స్పైసెస్ పై అధికారుల తనిఖీలు చేపట్టారు. స్వీట్స్ పై ఎక్స్పైరీ డేట్స్ లేవని యాజమాన్యం పై టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆగ్రహం వ్యక్తం చేసారు.

# అందుబాటులోకి రైల్వే వన్ యాప్

విజయవాడ, జూలై4,

రైలు ప్రయాణికుల కోసం రైల్వే శాఖ మరో యాప్ ను తీసుకువస్తోంది. ఇది సమగ్రమైన యాప్ అని, రైల్వేలకు సంబంధించిన అన్ని సేవలను ఇందులో పొందవచ్చని చెబుతోంది. దీని పేరు 'రైల్ వన్'. ఈ యాప్ ద్వారా టికెట్ బుకింగ్స్ నుంచి ఫుడ్ ఆర్డర్ ల వరకు వివిధ సేవలు పొందవచ్చు.భారతీయ రైల్వే జూలై 1, మంగళవారం రైలు ప్రయాణీకుల అన్ని సేవలనను అందించే ప్రత్యేకమైన వన్-స్టాప్ సొల్యూషన్ యాప్ 'రైల్ వన్' ను ప్రారంభించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కొత్త సాఫ్ట్ వేర్ అప్లికేషన్ రైల్ వన్ ను ప్రారంభించారు. ఇది భారతీయ రైల్వేల కొరకు కీలక సమాచార వ్యవస్థలను అభివృద్ధి చేస్తుంది. అమలు చేస్తుంది. నిర్వహిస్తుంది.ఆండ్రాయిడ్, ఐఫోన్ యూజర్లకు అందుబాటులో రైల్వేకు సంబంధించిన అన్ని సందేహాలు, ప్రయాణికుల అవసరాలకు వన్ స్టాప్ ప్లాట్ ఫామ్ గా ఉపయోగపడేలా ఈ కొత్త 'రైల్ వన్' యాప్ ను రూపొందించారు. బహుళ సేవలను ఒకే ఇంటర్ ఫేస్ లోకి అనుసంధానించడం ద్వారా ప్రయాణీకుల సౌకర్యాన్ని పెంచడం కూడా దీని లక్ష్యం.రైల్ వన్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ మరియు ఐఫోన్ వినియోగదారులకు అందుబాటులో ఉంది. ఆండ్రాయిడ్ కస్టమర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఫోన్ కస్టమర్లు ఐఓఎస్ యాప్ స్టోర్ నుండి ఈ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. యాప్ హోలిస్టిక్ ప్యాకేజీని అందిస్తుంది. ఈ యాప్ లో సరుకు రవాణా రైలు సర్వీసు ఎంక్వైరీలకు సంబంధించిన ఫీచర్లు కూడా ఉన్నాయి. "ఇది అన్ని సేవలను ఒకే చోట కలిగి ఉండటమే కాకుండా సేవల మధ్య ఇంటిగ్రేటెడ్ కనెక్టివిటీని అందిస్తుంది, వినియోగదారులకు భారతీయ రైల్వే సేవల యొక్క సమగ్ర ప్యాకేజీని ఇస్తుంది" అని మంత్రిత్వ శాఖ తెలిపింది. రైల్ వన్ ఒకే సైన్-ఆన్ సదుపాయాన్ని కూడా కలిగి ఉంది, ఇది వినియోగదారులు బహుళ పాస్ వర్డ్ లను గుర్తుంచుకునే భారాన్ని తగ్గిస్తుందిబుకింగ్స్ కోసం ఇప్పటికే రైల్ కనెక్ట్ లేదా యూటీఎస్ మొబైల్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్న వ్యక్తులు అదే క్రెడెన్షియల్స్ ను ఉపయోగించడానికి ఈ యాప్ అనుమతిస్తుంది. వారు తమ ప్రస్తుత యూజర్ నేమ్ మరియు పాస్ వర్డ్ ఉపయోగించి రైల్ వన్ లోకి లాగిన్ కావచ్చు. యాప్ అందించే సేవల జాబితా రిజర్వ్డ్ మరియు అన్ రిజర్వ్ డ్ టికెట్ల బుకింగ్ ప్లాట్ ఫాం టికెట్ల బుకింగ్ రైళ్ల గురించి ఆరా తీయడం పిఎన్ ఆర్ స్థితిని తనిఖీ చేయడం ప్రయాణ ప్రణాళికలో సహాయపడుతుంది రైల్ మదద్ సేవలను సులభంగా యాక్సెస్ చేసుకోవచ్చు. మీ రైలులో ఆహారాన్ని ఆర్డర్ చేయవచ్చు.భారతీయ రైల్వే ప్రయాణికులు ప్రస్తుతం టికెట్ల బుకింగ్ కోసం రైల్ కనెక్ట్, ఆహారాన్ని ఆర్డర్ చేయడానికి ఐఆర్సిటిసి ఇ-క్యాటరింగ్, ఫీడ్బ్యాక్ అందించడానికి రైల్ మదద్, అన్రిజర్వ్డ్ టికెట్ల కొనుగోలు కోసం యుటిఎస్ మరియు రైలు కదలికలను పర్యవేక్షించడానికి నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ వంటి యాప్ల ద్వారా వివిధ సేవలను పొందుతున్నారు. రైల్ వన్ ద్వారా ఇవన్నీ ఒకే యాప్ మాధ్యమం ద్వారా పొందవచ్చు.

=============

# అమెరికా విషయంలో ఆచితూచి అడుగులు

న్యూఢిల్లీ, జూలై 4, (

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500% పన్నులు విధిస్తామన్న అమెరికా బెదిరింపులపై కేంద్ర మంత్ర జైశంకర్ స్పందించారు. ఈ అంశం భారత్ ప్రయోజనాలపై ప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన భద్రత విషయంలో భారత్ తన నిర్ణయం తీసుకుంటుందని, అమెరికా చర్యలను గమనిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడంపై అమెరికా ఆంక్షలు విధిస్తే భారత్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.ఆంక్షలు కొనసాగుతున్నా రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామనే అమెరికా బెదిరింపులపై భారత విదేశాంగా శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. వాషింగ్టన్ డీసీలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తున్న దేశాలపై అమెరికా విధించబోయే 500 శాతం దిగుమతి సుంకాలపై ఆందోళనలను వ్యక్తం చేశారు. అమెరికా కాంగ్రెస్ సభ్యుడు లిండ్సే గ్రాహమ్ ప్రవేశపెట్టిన కొత్త బిల్లును దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించిన బిల్లు అమెరికా కాంగ్రెస్ చర్య అయితే అది భారత ప్రయోజనాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున మేం దానిని గమనించాల్సిందే" అని జైశంకర్ పేర్కొన్నారు.ఇంధన భద్రతల విషయంలో భారత్‌కు ఉన్న ప్రయోజనాలను మేము ఆయనకు (గ్రాహమ్) స్పష్టంగా వివరించాం... ఈ సమస్య ఎదురైనప్పుడు తగిన విధంగా స్పందిస్తాం" అని ఆయన అన్నారు. అమెరికా రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ఇటీవల ఏబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ:. "రష్యా నుంచి ఉత్పత్తులు కొంటూ ఉక్రెయిన్‌కు సహాయం చేయకుంటే అప్పుడు మీ ఉత్పత్తులపై 500 శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తాం" అని చెప్పారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ బిల్లును ఆమోదించినట్లు గ్రాహమ్ వెల్లడించారు. ఈ బిల్లుకు ఇప్పటికే 84 మంది సెనేటర్లు సంతకం చేశారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగుతున్న వేళ ట్రంప్ బెదిరింపులకు దిగారు.ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలైన తర్వాత.. ఆ దేశంపై అమెరికా, పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో రష్యా చమురుకు డిమాండ్ తగ్గిపోవడంతో తక్కువ ధరకే విక్రయించడానికి రష్యా ముందుకొచ్చింది. ఈ చమురును రాయితీపై భారత్ దిగుమతి చేసుకుంటోంది. మే 2025 నాటికి, రోజుకి 1.96 మిలియన్ బ్యారెల్ల రష్యా చమురును భారత్ దిగుమతి చేసుకుంది. ఈ మార్పుతో రష్యా చమురు, భారత మొత్తం ముడి చమురు దిగుమతుల్లో 1 శాతం నుంచి 44 శాతానికి పెరిగింది. ఇది అమెరికాకు అత్యంత ఆందోళనకర విషయం కావచ్చు.కాగా, దీనిపై విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందిస్తూ.. "భారత్-అమెరికా సంబంధాల విషయంలో మేమే నిర్ణయం తీసుకుంటాం.. పాకిస్థాన్ కాదు" అని పేర్కొంటూ ఇటీవల భారత్ పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాగా, ఈ బిల్లు అమెరికా పార్లమెంటులో మ దారి తీసే అవకాశమున్నా, భారత్ మాత్రం తన జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రతల విషయంలో స్పష్టమైన దృక్కోణాన్ని చూపించింది. అమెరికా సరైన దౌత్యపరమైన మార్గాన్ని ఎంచుకుంటుందా? లేక వాణిజ్య యుద్ధానికి దిగుతుందా? అనేది త్వరలో తేలనుంది.

# కేటీఆర్ ను బుక్ చేసిన అర్వింద్ కుమార్

హైదరాబాద్, జూలై 4,

నార్మల్ కేసు కాదు.. ఆ ఒక్క రేసుతో.. సర్కారు కోట్లు లాస్ అయింది. అందుకే.. కేస్ అయింది. స్టేట్ మొత్తం ఇంత డిస్కషన్ నడుస్తోంది. లొట్టపీస్ కేసు అని కేటీఆర్ ఎంత మొత్తుకున్నా.. ఏసీబీ మాత్రం పీస్ పీస్‌గా కేస్‌ని ఒలిచి.. ఒలిచి విచారిస్తోంది. ఇప్పటికే.. ఫార్ములా ఈ-కారు రేసులో కేటీఆర్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేసింది ఏసీబీ. కేటీఆర్ స్టేట్ మెంట్ ఆధారంగా అరవింద్ కుమార్ విచారణ కొనసాగుతోంది. హెచ్ ఎండీఏ అకౌంట్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా రూ. 55 కోట్ల నిధుల మళ్లించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆయన చెప్పిన విషయాల ఆధారంగానే.. ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ని కూడా ప్రశ్నించింది ఏసీబీ. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఏసీబీ విచారణ చేసింది. 6గంటలపాటు ఆయనను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించి మూడోసారి ఆయన విచారణకు వచ్చారు. ఫార్ములా వ కార్ రేస్ కేసులో నిధుల బదలాయింపులో అరవింద్ కుమార్ కీలక పాత్ర పోషించారని ఏసీబీ గుర్తించింది. గతంలో కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఏసీబీ ఆయనపై ప్రశ్నలు కురిపించినట్టు తెలుస్తోంది. అరవింద్ కుమార్ హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా పనిచేస్తూ నిధులను మళ్లించినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. కేబినెట్ అనుమతి లేకుండా నిధులను బదలాయించినందుకు ఏసీబీ కేసు నమోదు చేసింది. కేటీఆర్ ఆదేశాలతోనే తాను ఫార్ములా-ఈ రేస్ కోసం నిధులు విడుదల చేశానని చెప్పారు ఐఏఎస్ అర్వింద్ కుమార్. ఖాతా నుంచి.. కంపెనీకి నిధుల మళ్లింపులో.. తన ప్రమేయం లేదన్నారు. కేటీఆర్.. స్వయంగా వాట్సాప్ ద్వారా కి నిధులు విడుదల చేయాలని ఆదేశించారన్నారు అర్వింద్ కుమార్. ఇందులో.. తనకెలాంటి వ్యక్తిగత స్వార్థం లేదన్నారు. బిజినెస్ రూల్స్, ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని.. తాను కేటీఆర్‌కు చెప్పానని.. అయినప్పటికీ.. కంపెనీకి వెంటనే నిధులు విడుదల చేయాలని.. మిగతా విషయాలు తాను చూసుకుంటానని చెప్పారని.. అర్వింద్ కుమార్ వెల్లడించారు. మొత్తం.. 45 కోట్ల 71 లక్షల రూపాయల్ని.. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ద్వారా.. బ్రిటన్ పౌండ్స్ రూపంలో చెల్లించామన్నారు.. ఈ ఫార్ములా-ఈ రేస్ కేసులో.. అర్వింద్ కుమార్, కేటీఆర్ దోబూచులాట ఆడుతున్నట్లు కనిపిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. కేటీఆర్ ఏమో ఈ వ్యవహారంలో అర్వింద్ పేరు చెబుతున్నారు. ఆయనేమో.. కేటీఆర్ పేరు చెబుతున్నారు. దాంతో.. ఈ ఫార్ములా పంచాయతీ ఇప్పట్లో తెగుతుందా? అనే డౌట్ కొడుతోంది. అసలు.. ఫార్ములా-ఈ రేసు కేసులో ఏం జరిగింది? కేటీఆర్ ఆదేశాల మేరకే ఇదంతా జరిగిందా? లేక.. కేటీఆర్ చెబుతున్నట్లు ఇది అర్వింద్ కుమార్ డెసిషనేనా?

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

హైదరాబాద్, జూలై 4

తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులకు మరో ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసేందుకు టీజీపీఎస్సీ సమాయత్తమవుతోంది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో దాదాపు 24 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల (డిప్యూటీ ఈఓ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు 110 అధ్యాపకులు, 8 పీడీ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి త్వరలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు విద్యాశాఖ ఇప్పటికే టీజీపీఎస్సీకి అందించింది. నిజానికి, పాఠశాల విద్యాశాఖ పరిధిలో డిప్యూటీ ఈఓలు, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలు, ఎస్సీఈఆర్టీలోని అధ్యాపకులు, సీనియర్ అధ్యాపకులతోపాటు మొత్తం 134 పోస్టులను టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ 2022లోనే అనుమతి ఇచ్చింది.ఇందులో 24 డిప్యూటీ ఈఓ, 110 అధ్యాపక, సీనియర్ అధ్యాపక పోస్టులు ఉన్నాయి. ఈ 134 పోస్టులతో పాటు తాజాగా దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల్లో 8 ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టులు భర్తీ చేసేందుకు కమిషన్‌కు ప్రతిపాదనలు అందాయి. మొత్తంగా 142 పోస్టులకు త్వరలోనే 5 వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.ఉమ్మడి తెలంగాణ పరిధిలో మొత్తం 72 డిప్యూటీ ఈఓ పోస్టులు ఉండేవి. ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు ఒకటి చొప్పున గతంలో కేటాయించారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో రెవెన్యూ డివిజన్లు రెండే ఉన్నప్పటికీ.. జనాభా, పాఠశాలలు సంఖ్య ఎక్కువగా ఉన్నాయి. దీంతో హైదరాబాద్ ఒక్క జిల్లాకే ఏకంగా 12 పోస్టులు రానున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో రెవెన్యూ డివిజన్లు పెరిగాయి. దీంతో 28 పోస్టులను మంజూరు చేయాలని 2 రోజుల క్రితం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం 33 జిల్లాలకు కలిపి కేవలం 12 డీఈఓ పోస్టులే ఉన్నాయి. అదనంగా మరో 21 పోస్టులను మంజూరు చేయాలనీ ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా త్వరలోనే 28 డిప్యూటీ ఈఓ, 21 డీఈఓ పోస్టుల భర్తీకి ప్రకటన రానుంది

# గులాబీలో చీలక ఆనవాళ్లు..

హైదరాబాద్, జూలై 4,

బీఆర్ఎస్ లో చీలిక స్పష్టంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ లో కేసీఆర్ తర్వాత కేటీఆర్ నాయకత్వాన్ని తాను అంగీకరించే ప్రశ్నే లేదని కల్వకుంట్ల కవిత స్పష్టం చేస్తున్నారు. ఓ టీవీ చానల్ కు ఇచ్చిన పాడ్ కాస్ట్‌లో తన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నిర్మాణంలో తన పాత్ర ఉందని.. ఇక ముందు కూడా ఉంటుందని.. బీఆర్ఎస్ పార్టీ తనదని కవిత వ్యాఖ్యానించారు. కవిత చేసిన వ్యాఖ్యలు ఆమె రాజకీయ పయనం విషయంలో ఎంత స్పష్టంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తనను బీఆర్ఎస్ పార్టీకి దూరం చేసే కుట్ర జరుగుతోందని కవిత అంటున్నారు. బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా ఉంటున్న తన అనుచరుల్ని పార్టీ ఆఫీసులోకి రానివ్వడం లేదన్నారు. కవిత మనుషులకు తెలంగాణ భవన్ లో పనేమిటని ప్రశ్నిస్తున్నారని ఆమె అంటున్నారు. పార్టీలో ప్రస్తుతం తనను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆమె నేరుగానే చెబుతున్నారు. కొత్త పార్టీ ఆలోచనల్లేవు అని బలంగా చెప్పారు కానీ.. బీఆర్ఎస్ పార్టీ తనదేనని అంటున్నారు. పార్టీలో తనకెదురైనా.. ఎదురవుతున్న పరిస్థితులు.. తండ్రి కేసీఆర్ కూడా పట్టించుకోవడం లేదని కవిత పరోక్షంగా చెప్పారు. కేటీఆర్‌తో తనకు మాటలు లేవన్న విషయాన్ని అంగీకరించారు. పార్టీ విషయాలను ఇంటర్నల్‌గా మాట్లాడాలని కేటీఆర్ అంటున్నారని..తాను ఇంటర్నల్ గా మాట్లాడినవన్నీ బయటకు వస్తున్నాయన్నారు. తాను రాసిన లేఖ బయటకు ఎలా వచ్చిందని కవిత .. నేరుగా కేటీఆర్‌ను ప్రశ్నించారు. తనను పార్టీకి దూరం చేసేందుకు ఓ శక్తి బలంగా ప్రయత్నిస్తోందని కవిత అనుమానాలు వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలపై తనపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారం, ట్రోల్స్ గురించి తండ్రి కేసీఆర్‌కు చెప్పానని.. ఈ ట్రోలింగ్ ను ఆపాలని కఠిన చర్యలు తీసుకోవాలని కోరానన్నారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కవిత చెబుతున్నారు. ఫోన్ ట్యాప్ విషయంలో తన సన్నిహితులకు సిట్ అధికారులు ఫోన్లు చేసి.. వాంగ్మూలం ఇవ్వాలని కోరారన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటుంది కానీ దానికి తన తండ్రి కేసీఆర్ కు సంబంధం ఉందని అనుకోవడం లేదని.. ఆయన గొప్పవారన్నారు. సమయమే అన్నింటికీ జవాబు చెబుతుందన్నారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్న వ్యాఖ్యలపైనా పరోక్షంగా ఆ దెయ్యాలు ఎవరో చెప్పుకొచ్చారు. నాయకత్వ రేసులో తాను ఉంటానని కవిత స్పష్టంగా చెబుతున్నారు. కేసీఆర్ తర్వాత కేటీఆరే నాయకుడని ఇప్పటి వరకూ క్యాడర్ అనుకుంటున్నారు. కానీ కవిత మాత్రం తాను కూడా పోటీ పడతానని అంటున్నారు. జాగృతిని బలోపేతం చేయడం వెనుక అదే వ్యూహం ఉందని భావిస్తున్నారు. కవిత పట్టుదల చూస్తుంటే.. బీఆర్ఎస్ లో రానున్న రోజుల్లో పరిస్థితులు అంత సానుకూలంగా ఉండే పరిస్థితులు లేవని భావిస్తున్నారు

# బీహార్ ఘట్ బంధన్ తో మజ్లీస్ బంధం

పాట్నా, జూలై 4,

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రాకుండా నిరోధించడమే లక్ష్యంగా తమ పార్టీ బీహార్‌లోని ప్రతిపక్ష మహాఫుటబంధన్ నాయకులను సంప్రదించిందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం తెలిపారు. తమ రాష్ట్ర పార్టీ చీఫ్ అఖ్తరుల్ ఇమాన్, కాంగ్రెస్, ఆర్జేడీ, ఇతరులతో కూడిన మహాఘట్బంధన్ నాయకులను సంప్రదించారని, బీజేపీ, దాని మిత్రదేశాలకు వ్యతిరేకంగా పోరాడటానికి ఆసక్తిని వ్యక్తం చేశారని ఒవైసీ అన్నారు. ''మా రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్, మహాఘట్బంధన్‌లోని కొంతమంది నాయకులతో మాట్లాడారు, బీహార్‌లో బిజెపి లేదా ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రావాలని మేం కోరుకోవడం లేదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు.ఇప్పుడు బీహార్‌లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రావాలా? వద్దా? అనేది ఈ రాజకీయ పార్టీలపైనే ఆధారపడి ఉంది" అని ఒవైసీ తెలిపారు. బీహార్‌లోని సీమాంచల్ ప్రాంతంలో బలమైన ఉనికిని కలిగి ఉన్న ఎంఐఎం 2022లో దాని ఐదుగురు ఎమ్మెల్యేలలో నలుగురులో చేరడంతో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. తమ పార్టీ సీమాంచల్ నుంచే కాకుండా బయట కూడా అభ్యర్థులను నిలబెడుతుందని ఒవైసీ అన్నారు. "వారు (మహాఘట్‌బంధన్) తమతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా లేకుంటే, తాము ప్రతిచోటా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.." అని ఆయన అన్నారు. అంతకుముందు బీహార్‌లో ఓటర్ల జాబితాల "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్"ను వ్యతిరేకిస్తూ ఒవైసీ భారత ఎన్నికల సంఘానికి లేఖ రాశారు."ఇది చట్టబద్ధంగా ప్రశ్నార్థకమైన చర్య అని, ఇది రాబోయే ఎన్నికలలో నిజమైన ఓటర్లకు స్వరం లేకుండా చేస్తుంది" అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. "ఓటరు జాబితాలో నమోదు కావడానికి, ప్రతి పౌరుడు ఇప్పుడు వారు ఎప్పుడు, ఎక్కడ జన్మించారో నిరూపించే పత్రాలను మాత్రమే కాకుండా, వారి తల్లిదండ్రులు ఎప్పుడు, ఎక్కడ జన్మించారో కూడా చూపించాల్సి ఉంటుంది. ఉత్తమ అంచనాలు కూడా జననాలలో మూడింట ఒక వంతు మాత్రమే నమోదు అయ్యాయని చెబుతున్నాయి. చాలా ప్రభుత్వ పత్రాలు లోపాలతో నిండి ఉన్నాయి" అని ఆయన ఎక్స్‌లో తెలిపారు. అలాంటి ప్రక్రియ నిర్వహించడం వల్ల పేదలు ఓటర్ల జాబితా నుండి తొలగించబడతారని, ఇది వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని కూడా ఆయన వాదించారు.

## సాగర్ కు పోటెత్తిన వరద నీరు

నల్గోండ కృష్ణ బేసిన్ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల నిండుకుండలా మారి వరదంతా శ్రీశైలం ప్రాజెక్టు ఇన్ ఫ్లో రూపంలో దూసుకొస్తుంది. ఇక.. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం 52 వేల క్యూసెక్కుల వరదనీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలో.. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కుల నీటిని.. ఖమ్మం జిల్లా తాగునీటి కోసం పాలేరు జలాశయానికి ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. మొదటగా వెయ్యి క్యూసెక్కులను విడుదల చేయగా.. క్రమేపి 3 వేల క్యూసెక్కుల వరకు పెంచనున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగాను.. ప్రస్తుతం 521.90 అడుగులకు చేరుకుంది. అలాగే.. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసీ లకు గానూ.. ప్రజెంట్ 152.7628 టిఎంసీ లుగా ఉంది. ఏఎంఆర్పీ, ఎస్ఎల్బీసీ ద్వారా హైదరాబాద్ మహానగరానికి నిరంతరాయంగా 900 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది..

## సోమందేపల్లి కేజీబీవీ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్?. 20 మంది విద్యార్థులకు అస్వస్థత

శ్రీ సత్యసాయి శ్రీ సత్య సాయి జిల్లా సోమందేపల్లి మండలం పాపిరెడ్డి పల్లి లో ఉన్న కేజీబీవీ హాస్టల్ నందు ఈరోజు ఉదయం ఫుడ్ పాయిజన్ తో 20 మంది విద్యార్థినిలు అస్వస్థత గురయ్యారు, రాత్రి ఎప్పటిలాగానే సాంబార్ అన్నం, మజ్జిగతో భోజనం చేశామని ఉదయం నుండి విద్యార్థులకు కడుపునొప్పి విరోచనాలు జ్వరాలు రావడంతో హాస్టల్ వార్డెన్ కు తెలియజేశామని విద్యార్థులు అన్నారు. విషయం తెలిసిన వెంటనే సోమందేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్యులు హాస్టల్ నందు విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరికి ఎటువంటి అపాయం జరిగే అవకాశం లేదని తెలియజేశారు. స్థానిక జాయింట్ కలెక్టర్, డీఎంహెచ్వో దగ్గరుండి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## అల్లూరికి సీఎం చంద్రబాబు నివాళులు

అమరావతి అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## మద్యం పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మినూరు జులై 4

పట్టణంలో విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం వ్యాపారాన్ని అరికట్టాలని, మద్యం పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం(పి.వై.ఎల్) డివిజన్ కన్వీనర్ ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని ఎక్సైజ్ సిఐ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.వై.ఎల్ డివిజన్ కన్వీనర్ ఎస్.మునెప్ప మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణ పరిధిలో ఉన్న మద్యం దుకాణాల యాజమాన్యాలు సమయపాలన పాటించడం లేదని అన్నారు. డబ్బే ధ్యేయంగా వ్యాపారం కొనసాగిస్తూ, ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. అనధికారకంగా బెల్ట్ షాపుల రూపంలో పట్టణంలో చాలామంది దుకాణాలలో ఉదయం 5 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు మద్యాన్ని అమ్ముతున్నారని తెలియజేశారు. మరికొన్నిచోట్ల మద్యం షాపుల వారే పక్కనే ఉన్న చిరువ్యాపారస్తుల ద్వారా మద్యం బాటిళ్లను అధిక ధరలకు ప్రజలకు అమ్ముతున్నారని అన్నారు.మద్యం గొలుసు వ్యాపారం జరుపుతున్న వారిపై నేటి వరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు. అంతేకాకుండా కర్ణాటక మద్యం బాటిళ్లను విచ్చలవిడిగా టెట్రా ప్యాక్ లు రూపంలో అమ్ముతున్నారని తెలిపారు. ప్రధానంగా సోగునూరు రోడ్డు నందు మద్యం వ్యాపారస్తుల ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్నట్లు తెలిపారు. అలాగే పెద్ద బావి దగ్గర ఉన్న వైన్ షాప్ ద్వారా కూడా అప్పుడప్పుడు అల్లర్లు జరగడం వలన కాలనీ మహిళలు ,చిన్నారులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కావున అధికారులు తక్షణమే స్పందించి బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై, మద్యం రూపంలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు ఇబ్బంది పడుతున్న చోట్ల వైన్ షాపులను తొలగించాలని మరో చోటుకు మార్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ నాయకులు రాజు,మధు,బుజ్జన్న,వీరంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణ

సికింద్రాబాద్ఉజ్జయిని మహంకాళి అమ్మవారి కి మొదటి బోనాన్ని అత్తిలి కుటుంబం నుండి సమర్పించారు.. అమ్మవారి బోనాల జాతరను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మొదటి బోనం అత్తిలి కుటుంబం నుండి సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.. అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాంగోపాల్ పేట్ నుండి ఆలయం వరకు తొలి బోనం ను జోగిని శ్యామల తీసుకొచ్చారు.. సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బోనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు... డబ్బు సందేళ్ల మధ్య బోనం సమర్పణ కొనసాగింది.. జోగిని శ్యామల బోనంతో అమ్మవారిని స్మరించుకుంటూ నృత్యాలు చేస్తూ భక్తి పరవశంతో ఆలయానికి చేరుకున్నారు..

# చంద్రబాబే.. అందరికి బూచి...

హైదరాబాద్, జూలై 4,(

తెలంగాణ పాలిటిక్స్‌కి చంద్రబాబు బూచి పట్టుకున్నట్టు అనిపిస్తుంది జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే. ఆ పార్టీ ఈ పార్టీ అని కాకుండా తెలంగాణకు సంబంధించిన నేతలు చంద్రబాబును ఒక సాకుగా చూపిస్తూ తమ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని వరుసగా స్టేట్‌మెంట్స్ ఇస్తూ వస్తున్నారు. పైకి మామూలు కామెంట్స్‌లా కనిపిస్తున్నా నిజానికి వీటి వెనక ఆయా పార్టీల పెద్ద వ్యూహమే కనిపిస్తోంది అంటున్నారు ఎనలిస్ట్‌లు.తెలంగాణకు చెందిన పాలమూరు రంగారెడ్డి ప్రాజక్ట్‌కు 45 టీఎంసీల నీటి కేటాయింపుపై అభ్యంతరం చెబుతున్న ఏపీ మరోవైపు బనకచర్ల కట్టుకుంటామని చెప్పడమేంటని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేంద్రంతో భాగస్వామిగా ఉన్నంత మాత్రాన తెలంగాణకు చంద్రబాబు అన్యాయం చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎంత వరకైనా పోరాడతామని రేవంత్ రెడ్డి సహా మంత్రులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వివరించే ప్రయత్నం చేశారు. ఒకవైపు బనకచర్లతో తెలంగాణకు ఎలాంటి నష్టం జరుగదు, కేవలం వరద సమయంలో గోదావరి మిగులు జలాలను మాత్రమే వాడుకుంటామని చంద్రబాబు చెబుతున్నా తెలంగాణ సీయం మాత్రం పదేపదే బనకచర్లపై అభ్యంతరాలు చెబుతున్నారు.బీఆర్ఎస్ వాదన మరోలా ఉంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ వారు ఏపీ సీఎం చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు గోదావరి నీటిని ఏపీకి దోచుకెళ్ళి పోవాలని చూస్తున్నా రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి లాంటి వాళ్ళు ఘాటుగా స్పందిస్తున్నారు. అంతే కాకుండా ఇటీవల బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా రామచందర్‌రావు ఎన్నిక వెనుక చంద్రబాబు ప్రభావం ఉందని ఃఖీా సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారం చేస్తున్నాయి. డీకే అరుణ, ఈటెల రాజేందర్, రాజా సింగ్ లాంటి వాళ్ళను పక్కనబెట్టి చంద్రబాబు అనుకూలుడైన రామచందర్‌రావుకి ఆ పదవి ఎలా ఇస్తారంటూ ప్రచారం జరుగుతోంది. నిజానికి చంద్రబాబు రామచంద్రరావు మధ్య అలాంటి సాన్నిహిత్యం ఉన్నట్టు కనిపించదు.బిజెపి కూడా తెలంగాణలో చంద్రబాబు ముద్ర పడకుండా ఉండడం కోసం తీవ్ర విమర్శలు చేస్తూ వస్తోంది. నాలుగేళ్లు గడిస్తే చంద్రబాబు ఇంట్లోంచి లేవలేడని అలాంటప్పుడు ఆయన ప్రభావం తమపై ఎందుకు ఉంటుందని బిజెపి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి గట్టిగా విమర్శించారు. తమ పార్టీకి అధ్యక్షుడ్ని నియమించాలంటే చంద్రబాబు సాయం తీసుకోవాల్సిన అవసరం లేదని తమ అధిష్టానానికి లేదని కిషన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు వాళ్లు చెబుతూ వస్తున్నారు. తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారు : తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డితెలంగాణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని కాంట్రాక్టులు ప్రాజెక్టులు అన్నీ వాళ్ళ చేతుల్లోనే ఉన్నాయని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆరోపించడం తాజాగా సంచలనమైంది. మంచిగా చెబితే వాళ్ళు మాట వినరని అలాంటి వాళ్లకు నల్లా కనెక్షన్లు, కరెంట్ కనెక్షన్‌లూ కట్ చేయాలని తీవ్రమైన విమర్శలు చేశారాయన.విచిత్రంగా పార్టీలకు అతీతంగా అందరూ చంద్రబాబుని తెలంగాణలో టార్గెట్ చేయడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. దీని వెనుక తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్ళీ పైకి తీసుకువచ్చి ఓటర్ పోలరైజేషన్ చేయడం కోసం జరుగుతున్న ఒక ప్రయత్నంగా ఎనలిస్ట్‌లు చెబుతున్నారు. త్వరలో తెలంగాణలో జిహెచ్ఎంసి లాంటి ఎన్నికలు జరగబోతున్నాయి. అక్కడ సెటిలర్ల ఓట్లు పార్టీల వారీగా చీలిపోయినా తెలంగాణ ఓటింగ్ మాత్రం తమకే దక్కాలని అన్ని పార్టీలు కోరుకుంటున్నాయి. ఇటీవల చంద్రబాబు ఇచ్చిన కొన్ని ఇంటర్వ్యూల్లో తెలంగాణలో పోటీ చేసే అంశంపైన దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. దానితో అలర్ట్ అయిన తెలంగాణ పొలిటికల్ పార్టీలు ముందుగానే తెలంగాణ ఓటర్లను తమవైపు ఆకర్షించడం కోసం రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. అందుకే జరుగుతున్న ప్రతి రాజకీయ పరిణామాన్ని చంద్రబాబుతో ముడిపెట్టి లబ్ధి పొందాలని తెలంగాణలోని పొలిటికల్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఇంకెన్ని మలుపులకు దారి తీస్తాయో చూడాలి.

## మరిమడ్ల ఏకలవ్య స్కూలు అభివృద్ధి పనులు ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

వేములవాడ

వేములవాడ నియోజకవర్గం మరిమడ్ల ఏకలవ్య స్కూల్ లో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేసారు.

ఎంపీ నిధులతో సోలార్ ప్లాంట్లు, డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేయిస్తానని సంజయ్ హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ సభ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాంగ్రెస్ సభ పేరును “సామాజిక అన్యాయ సమర భేరీ”గా మార్చుకోండి. ఏం ఉద్దరించారని సభ పెడుతున్నారు? 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీకైనా ప్రధాని పదవిచ్చారా? అర్ధశతాబ్ద కాంగ్రెస్ పాలనలో ఏనాడైనా బీసీని సీఎం చేశారా అని ప్రశ్నించారు.

దళిత, బడుగు, బలహీనవర్గాలకు వేలు కలిగే 6 గ్యారంటీలను కూడా అమలు చేయలేకపోయారే? జనాభాలో సగమున్న బీసీలకు కేబినెట్ లో ఎన్ని మంత్రి పదవులిచ్చారు ? పొన్నం ప్రభాకర్ కు మంత్రి పదవిస్తే బీసీల గొంతు విన్పిస్తున్నారు. బీసీలకు మరిన్ని మంత్రి పదవులు ఎందుకు ఇవ్వలేదు. ఏ ముఖం పెట్టుకుని సమర భేరీ నిర్వహిస్తున్నారు ? ప్రజలకు ఏఐసీసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమాధానం చెప్పాలి. అడిగిన దానికంటే అదనంగా యూరియా ఇచ్చినా కేంద్రాన్ని బదనాం చేస్తారా? లోకల్ బాడీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీవైపు చూస్తుంటే ఓర్వలేకే యూరియా కొరత పేరుతో డ్రామాలు అడుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అధికారులు తప్పు దోవ పట్టిస్తున్నారు. అదనపు యూరియా ఇచ్చే విషయాన్ని కేంద్రం సానుకూలంగా పరిశీలిస్తోంది. ఇకనైనా వాస్తవాలు ప్రజల ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని అన్నారు.

==============================

# కొండా పెత్తనం కోసమేనా

వరంగల్ , జూలై 4,

కొండా కుటుంబం పంచాయతీ వరంగల్ లో కొనసాగుతూనే ఉంది. గత కొద్ది రోజులుగా వరంగల్ లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలకు, కొండా కుటుంబానికి మధ్య పొసగడం లేదు. డైరెక్ట్ వార్ కు దిగారు. దీంతో వరంగల్ లో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో చులకనగా మారిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. కొండా మురళి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన నేతలపై చేసిన కామెంట్స్ కలకలం రేపాయి. పార్టీకి రాజీనామా చేయకుండా వచ్చి పెత్తనం చేస్తున్నారని, గతంలో వీరి వల్ల అనేక మంది అధికారాన్ని కోల్పోయారని కూడా వ్యాఖ్యానించారు. ఈ పంచాయతి కాంగ్రెస్ క్రమశిక్షణ ముందుకు వచ్చింది. క్రమశిక్షణ కమిటీ ఎదుటకు హాజరయిన కొండా మురళి లేఖ రాయడం మరో సంచలనానికి కారణమయింది. ముందే టిక్కెట్లు ప్రకటించుకున్నారా? మళ్లీ వ్యాఖ్యలతో... దీంతో వరంగల్ లోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమై పార్టీ నాయకత్వానికి లేఖ రాశారు. కొండా మురళి వల్ల పార్టీ పరిస్థితి మరింత దిగజారుతుందని చెప్పారు. సొంత పార్టీ నేతలపై కొండా మురళి చేసిన విమర్శలను కూడా వీడియోలు, పత్రిక క్లిప్పింగ్ లను సమర్పించారు. కొండా మురళి పై చర్యలు తీసుకోవాలని కరారు. బస్వరాజు సారయ్య ఏకంగా కొండా మురళిపై పార్టీ హైకమాండ్ కు లేఖ రాశారు. మరోవైపు తాను గత ఎన్నికల్లో పదహారు ఎకరాలు అమ్మి 70 కోట్ల రూపాయలు ఖర్చు చేశానని కొండా మురళి చేసిన వ్యాఖ్యలు కూడా కలకలం రేపాయి. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ తో పాటు పార్టీ హైకమాండ్ కు కూడా కొందరు ఫిర్యాదు చేయడానికి రెడీ అవుతున్నారు. కొండా మురళి దంపతులు పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ను కలిశారు. తాను బీసీ వర్గానికి చెందిన నాయకుడినని, తాను వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో గెలిపించుకుని వస్తానని కొండా మురళి తర్వాత మీడియా ఎదుట వ్యాఖ్యానించారు. తాను ఎవరికీ భయపడబోనని, తనపై కొందరు కావాలని కుట్ర చేస్తున్నారన్న కొండా మురళి పార్టీ హైకమాండ్ నిర్ణయం తనకు శిరోధార్యం అంటూనే తన కుమార్తె పరకాల టిక్కెట్ ను కోరుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. అది ఆమె వ్యక్తిగతమని అన్నారు. ఈ నెల 5వ తేదీ లోపు కొండా మురళిపై చర్యలు తీసుకోకుంటే తాము హైకమాండ్ దృష్టికి తీసుకెళతామని వరంగల్ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద కొండా ఎపిసోడ్ కొనసాగుతూనే ఉన్నట్లుంది.

మళ్లీ కాంట్రవర్సీ

వరంగల్ కు చెందిన కొండా మురళి ఫ్యామిలీ ఎక్కడ ఉన్నప్పటికీ కాంట్రవర్సీకి కేరాఫ్ గా ఉంది. కొండా సురేఖ మంత్రి పదవిలో ఉంటూ కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల అనేక సందర్భాల్లో కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వివాదంగా మారాయి. టాలీవుడ్ హీరోల కుటుంబం పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నాడు పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టాయి. అదే సమయంలో తర్వాత మంత్రులుగా ఉన్న వాళ్లు లంచాలు తీసుకోనిదే ఏ పనిచేయరని చేసిన వ్యాఖ్యలు కూడా సొంత పార్టీలో నేతలకు కన్నెర్రకు కారణమయ్యాయి. ఇక తాజాగా కొండా మురళి చేసిన వ్యాఖ్యలతో మరోసారి కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపింది. సొంత పార్టీ నేతలనే కొండా మురళి లక్ష్యంగా చేసుకుని మాట్లాడారుకొండా మురళి వరంగల్ లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సిగ్గుంటే పార్టీ మారినప్పుడు పదవులకు రాజీనామాలు చేయాలని చేసిన వ్యాఖ్యలు సూటిగా తగిలిన నేతలు రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘకాలంగా మంత్రిగా పనిచేశానని చెప్పుకునే నేతలు వారు గతంలో పనిచేసిన పార్టీలను భ్రష్టు పట్టించారన్నారు. నాడు తెలుగుదేశం లో చంద్రబాబు నాయుడిని, తర్వాత బీఆర్ఎస్ లో కేసీఆర్ ఓటమికి కారణమయ్యారని కొండా మురళి కడియం శ్రీహరిని ఉద్దేశించి అన్నారని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి దీనిని కూడా ఆగం చేస్తున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు కడియం శ్రీహరితో పాటు రేవూరి ప్రకాశ్ రెడ్డి, బస్వరాజు సారయ్య వంటి వారు కొండా మురళి వ్యాఖ్యలకు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వీరంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యం సన్నిహితులే. మూడు టిక్కెట్లు తమకు అంటూ... ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి కూడా కొండా మురళి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ల ముసిలోడు పరకాలకు వచ్చాడని, దరిద్రమైన నాయకుడని, నా రెండు కాళ్లు పట్టుకుని గెలిపించమని అడిగితే తాను సాయం చేశానని కొండా మురళి అన్నారు. అంతటితో ఆగకుండా వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తన కూతురు సుస్మిత ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని, తాను కూడా ఎమ్మెల్సీ అవుతానని, కొండా సురేఖ కూడా వరంగల్ తూర్పు నుంచి పోటీ చేస్తారని కొండా మురళి తనకు తానే టిక్కెట్లను డిక్లేర్ చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. దీంతో ఈరోజు కొండా మురళి తమపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కడియం శ్రీహరి, నాయని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశమై హైకమాండ్ కు ఫిర్యాదు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. మొత్తం మీద మరోసారి కొండా కుటుంబం ట్రబుల్ లో పడిందనే చెప్పాలి

# కేసీఆర్ హెల్త్ స్టేబుల్

హైదరాబాద్, జూలై 4, (న్యూస్ పల్స్)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నట్టుండి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో యశోద ఆసుపత్రిలో చేరారు. ఆయనకు జ్వరం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, సోడియం స్థాయిలు తగ్గడం వంటి సమస్యలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నప్పటికీ, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర అస్వస్థతతో గురువారం సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యుల బృందం ఒక అధికారిక హెల్త్ బులిటెన్‌ను విడుదల చేసింది. బులిటెన్ ప్రకారం.. కేసీఆర్ తీవ్ర జ్వరంతో ఆసుపత్రికి వచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం.. ఆయనకు రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా పెరిగాయని (హై బ్లడ్ షుగర్), అలాగే సోడియం స్థాయిలు గణనీయంగా పడిపోయాయని (తక్కువ సోడియం లెవెల్స్) నిర్ధారించారువైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసీఆర్‌కు నిర్వహించిన మిగిలిన అన్ని వైద్య పరీక్షల నివేదికలు సాధారణంగానే ఉన్నాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ, డయాబెటిస్‌ను నియంత్రణలోకి తీసుకురావడానికి.. శరీరంలోని సోడియం స్థాయిలను సమతుల్యం చేయడానికి ఆయనను క్లోజ్ అబ్జర్వేషన్‌లో ఉంచి, నిరంతరం చికిత్స అందిస్తున్నారు. ఆయన వయసు, గతంలో ఎదుర్కొన్న తుంటి గాయం వంటి ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని, వైద్యులు అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేసీఆర్ వెంట ఆయన సతీమణి శోభ, కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్ రావు, అలాగే సంతోష్ రావు వంటి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లారు.కేసీఆర్ అస్వస్థత వార్త తెలిసిన వెంటనే.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఆయన సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు, అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కేసీఆర్ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌కు అత్యుత్తమ చికిత్స అందించాలని సీఎం రేవంత్ రెడ్డి వైద్యులకు సూచించారు. ఆయన త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అంతేకాకుండా.. కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరారు.గత ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి కేసీఆర్ ప్రజా జీవితంలో అంతగా చురుకుగా కనిపించడం లేదు. ఆయన గతంలో ప్రదర్శించిన దూకుడు, ఉత్సాహం ప్రస్తుతం తగ్గింది. ఇటీవల వరంగల్‌లో జరిగిన పార్టీ బహిరంగ సభలోనూ ఆయన ప్రసంగం పార్టీ శ్రేణుల్లో మునుపటి ఉత్సాహాన్ని నింపలేకపోయింది. ఇటీవల జరిగిన పరిణామాలు ఆయనను ఎన్నో ఇబ్బందులకు గురిచేశాయి.కేసీఆర్ డ్రీమ్ ప్రాజెక్టుగా భావించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై వస్తున్న తీవ్ర అవినీతి ఆరోపణలు, ప్రాజెక్టులోని కొన్ని భాగాలకు ఇటీవల సంభవించిన నష్టం వంటి అంశాలు ఆయనకు మరింత మానసిక భారాన్ని చేకూర్చాయి. దీనిపై న్యాయ విచారణలు జరుగుతుండటం, ప్రజల్లో దీనిపై పెరిగిన వ్యతిరేకత ఆయన ప్రతిష్టను దెబ్బతీశాయి. గతంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు కూడా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు హాజరయ్యారు.ఈ పరిణామాలు, అధికారం కోల్పోయిన తర్వాత ఎదురయ్యే సవాళ్లు, కేసుల భయం, పార్టీని తిరిగి నిలబెట్టుకోవాల్సిన బాధ్యత, గత ప్రభుత్వ ఆర్థిక విధానాలపై వస్తున్న విమర్శలు వంటివన్నీ కేసీఆర్ ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆయన త్వరగా కోలుకోవాలని తన పార్టీ కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారు.

## ఘనంగా వంగవీటి రంగా జయంతి

నరసాపురంవంగవీటి మోహన్ రంగా 78వ జయంతి సందర్భంగా నర్సాపురం పట్టణంలోని కోటిపల్లి వారి సెంటర్లో జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా రంగా విగ్రహానికి పూలమాల వేసి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంగవీటి మోహన్రంగా ఆయన జీవితం అంతా సమాజానికి అంకితం చేశారని. ఆయన జైల్లో ఉండి ప్రజాప్రతినిధిగా ఎన్నిక కావడం జరిగిందని. చాలా తక్కువ సమయం శాసనసభ్యునిగా పదవి చేయడం జరిగిందని. వంగవీటి మోహన్రంగా చనిపోయి సుమారు 30 సంవత్సరాలు దాటిన ఈనాటికి కూడా వంగవీటి మోహన్ రంగాని ఎవరో మర్చిపోవటం లేదంటే ఆయన చేసినటువంటి ప్రజా ఉద్యమాలు ప్రజా కార్యక్రమాలు ఆయన చేసినటువంటి సహాయ సహకారాలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు .వంగవీటి మోహన్రరంగగా బియ్యంకుడు జక్కం బాబ్జి తదితర నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి:

సిద్దిపేట

సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్. ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య సుదీర్ఘ కాలంగా ప్రజాసేవలో నిమగ్నమై, చేసిన దేశసేవ, పరిపాలన పటిమ, నిష్కలంకమైన రాజకీయ జీవితాన్ని గడిపారని కొనియాడారు. రాజకీయాల్లో ఉన్నతమైన నైతిక విలువలకు కాపాడుకుంటూ ఆయన సేవా తత్వంతో ప్రజలల్లో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంలో 16 సార్లు ఆర్థిక శాఖ మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టి అరుదైన ఘనత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, సూపరిండెంట్లు వెంకటేశ్వరరావు, ఫయాజుద్దీన్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, పోలీస్ అధికారులు మరియు కమిషనర్ కార్యాలయ సిబ్బంది పాల్గొని పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు.

## నేడు మైదుకూరు నియోజకవర్గ వై.యస్.ఆర్.సి.పి విస్తృతస్థాయి సమావేశం క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ శెట్టిపల్లి రఘురాం రెడ్డి

మైదుకూరు బ్రహ్మంగారిమఠం

మైదుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శనివారం ఉదయం 9 గంటలకు మైదుకూరులోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విస్తృత స్థాయి సమావేశంలో బాబు షూరిటీ –మోసం గ్యారంటీ మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్ పోస్టర్ను విడుదల చేసే కార్యక్రమం ఉందని ఆయన తెలిపారు. కాబట్టి ఈ సమావేశానికి తప్పనిసరిగా నియోజకవర్గంలోని దువ్వూరు ,చాపాడు ,కాజీపేట, మైదుకూరు ,బ్రహ్మంగారిమఠం మండలాల నుంచి తప్పనిసరిగా సర్పంచులు ,ఎంపీటీసీలు, జడ్పిటిసిలు మాజీ సభ్యులు ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు ఇతర నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ విధిగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు

## ఖర్గే పర్యట నేపథ్యంలో గాంధీ భవన్ వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు కలకలం

హైదరాబాద్ జూలై 4

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్‌లో పర్యట నేపథ్యంలో గాంధీ భవన్ వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు కలకలం సృష్టించాయి. జై బాపు.. హింసే మా ఆయుధం, జై భీం.. ఎస్సీ, ఎస్టీలే మా లక్ష్యం, జై సంవిధాన్.. రాజ్యంగం అంటే మాకు లెక్కే లేదు.. వంటి స్లోగన్లతో కూడిన ఫ్లెక్సీలు, పోస్టర్లను గాంధీ భవన్‌తోపాటు ఎల్బీ స్టేడియం, సోమాజిగూడ, నగరంలోని పలు చోట్ల గుర్తుతెలియని వ్యక్తులు ఏర్పాటు చేశారు. దేశంలో రాజ్యాంగ పరిరక్షణే మా ధ్యేయం.. తెలంగాణలో కాంగ్రెస్ రాక్షస క్రీడ చేస్తోంది, ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవించడం లేదంటూ వాటిలో పేర్కొన్నారు. ఈ పోస్టర్లు, ఫెక్సీలు వాహనదారులను విశేషంగా ఆకర్షించాయి. వాహనాలు ఆపి మరీ వాటిని చదివారు. పలువురు వాటిని తమ సెల్‌ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారాయి.

## కవితకు క్షమాపణ చెప్పే అవసరం లేదు: ఫిరోజ్ ఖాన్

సికింద్రాబాద్‌సికింద్రాబాద్ మహిళా కమిషన్ చైర్మన్ నేరేళ్ల శారద ముందు విచారణకు కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ హాజరయ్యారు. మహిళల పట్ల నాకు గౌరవముంది, వారిని అగౌరవపరిచే విధంగా ఉద్దేశ్య పూర్వకంగా ఎట్టి పరిస్థితుల్లోనూ మాట్లాడను. ఏం పికుతారు అనేది చెడు మాట కాదు. దీనికి హిందీలోకి ట్రాన్స్ లేట్ చేసి చూస్తే క్యా ఉకాడతా అని అర్థం. కవితకు కానీ ఇతరులకు కానీ క్షమాపణ చెప్పే అవసరం లేదని అన్నారు. ఇక ముందు మాట్లాడే ముందు ఏక వచనంతో కాకుండా గారు, జీ అనె పదాలు వాడడానికి ప్రయత్నిస్తా. ఫ్లో వచ్చినప్పుడు ఏమి చేయాలేను. ఇప్పటివరకు వందల ఉపన్యాసాలు ఇచ్చాను ఎప్పుడు పిర్యాదు చేయలేదు. ఫ్లో లో వచ్చిన మాటలను మనసు మీదకు తీసుకోవద్దని సూచించానని అన్నారు.

## లోకేష్‌గారూ హాస్టల్స్‌పై గట్టిగా ఫోకస్ చేయాలి

తిరుపతి, జూలై 4 వసతి గృహంలో పరిస్థితులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మధ్య హోంమంత్రి అనిత పర్యటనలోనే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు మరో హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఇక్కడ పరిస్థితులు మెరుగు పరిచేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో బాలికల బీసీ హాస్టల్‌లో టిఫిన్‌గా ఉప్మా తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాళ్లు టిఫన్ తింటున్న టైంలోనే అందులో జెర్రి ఉన్నట్టు విద్యార్థులు గుర్తించారు. దీంతో మిగతా విద్యార్థులు అప్రమత్తమై ఆ ఫుడ్ తినకుండా వదిలేశారు. అప్పటికే తిన్న విద్యార్థులు ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. చెర్రి పడిన ఉప్మా తిని అస్వస్థతకు గురైన విద్యార్థులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఫ్రిజ్ ఎందుకు పేలుతుంది..

హైదరాబాద్, జూలై 4

హైదరాబాద్‌లోని సనత్‌నగర్ రాజానగర్ ప్రాంతంలో గురువారం ఫ్రిజ్ పేలిన ఘటన కలకలం రేపింది. ఓ ఇంట్లో ఉన్న రిఫ్రిజిరేటర్ అకస్మాత్తుగా పెద్ద శబ్దంతో పేలిపోవడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ప్రాణాపాయం జరగలేదు. కానీ ఈ ఘటన మనందరికీ ఒక స్పష్టమైన హెచ్చరిక. మన ఇళ్లలో రోజూ నిత్యవసరాల కోసం వాడే ఫ్రిజ్ కూడా ప్రమాదానికి దారి తీయగలదన్న విషయాన్ని ఇది రుజువు చేసింది. భారీ శబ్దం.. ఈ ఘటనలో ఇంటి సభ్యులు తెల్లవారుజామున ఫ్రిజ్ నుంచి గట్టిగా పేలుడు శబ్దం విన్నారని చెప్పారు. వెంటనే అక్కడ మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన వారు వెంటనే ఇంటి నుంచి బయటికి పరుగులు తీశారు. ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందగానే ఫైర్ టెండర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశాయి. ప్రాథమికంగా అధికారులు ఈ పేలుడు ఫ్రిజ్‌లోని కంప్రెసర్ వల్ల జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. పూర్తి కారణాలు తెలియజేయడానికి దర్యాప్తు కొనసాగుతోంది. ఎలా పేలుతుంది? ఇక్కడ అసలు ప్రశ్న ఎమిటంటే ఫ్రిజ్ ఎలా పేలుతుంది? రిఫ్రిజిరేటర్ అనే పరికరం మనకు రోజూ ఉపయోగపడుతుంటుంది. అది శబ్దం చేయదు, ప్రమాదకరంగా కూడా కనిపించదు. కానీ పక్కాగా ఉపయోగించకపోతే.. అది కూడా ముప్పుగా మారవచ్చు. ముఖ్యంగా కంప్రెసర్ సమస్యలు, గ్యాస్ లీక్, వోల్టేజ్ ఫ్లక్చుయేషన్స్ వల్ల ఫ్రిజ్‌లో పేలుడు సంభవించే అవకాశముంది. కంప్రెసర్ ఓవర్‌హీట్ అయినప్పుడు లేదా గ్యాస్ అధికంగా జమైపోయినప్పుడు, ఏ చిన్న షార్ట్‌సర్క్యూట్ లేదా స్పార్క్ కూడా ప్రమాదానికి దారి తీయగలదు. ఇలా చేస్తే సేఫ్.. ఇలాంటి ప్రమాదాలు నివారించాలంటే కొన్ని భద్రతా చర్యలు తప్పనిసరి. ముందుగా, నాణ్యమైన బ్రాండ్‌కి చెందిన ఫ్రిజ్‌ను మాత్రమే కొనుగోలు చేయాలి. చీప్ బ్రాండ్లు, నకిలీ వస్తువులు లోపభూయిష్టంగా తయారవుతాయి. ఫ్రిజ్‌కు ప్రత్యేకంగా ఒకే ప్లగ్ పాయింట్ కల్పించాలి. మల్టీ ప్లగ్‌లలో టీవీ, వాషింగ్ మెషీన్, మైక్రోవేవ్ వంటివి కలిపి వాడటం ప్రమాదకరం. వోల్టేజ్ సమస్యలు ఉండే ప్రదేశాల్లో స్టాబిలైజర్ వాడటం ఉత్తమం. అదనంగా, ఫ్రిజ్ వెనక భాగం వేడిగా అనిపిస్తే, గ్యాస్ వాసన వస్తే లేదా ఎలక్ట్రిక్ స్పార్కింగ్ వంటివి కనిపిస్తే వెంటనే టెక్నీషియన్‌ను సంప్రదించాలి. ఇంకొంత మంది ఫ్రిజ్‌ను పగటి సమయంలో ఓపెన్ చేస్తూ, రాత్రిళు పూర్తిగా మూసివేస్తూ ఉండటం చూశాం. కానీ దీని వల్ల కంప్రెషర్ నిరంతరం పని చేస్తూ వేడిని ఉత్పత్తి చేస్తుంది. అది ఓవర్ లోడ్ అవడం వల్ల పేలుడు సంభవించే అవకాశం ఉంది. అలాగే ఫ్రిజ్‌లో పదార్థాలను నింపడం వల్ల గాలి ప్రసరణ జరగకపోవడం వల్ల కూడ ఫ్రిజ్ ఓవర్ హీట్ అవుతుంది. ఎప్పటికప్పుడు క్లీనింగ్, సర్వీసింగ్ చేయడం మంచిది. ఈ ఘటనలో మంటలు త్వరగా అదుపులోకి రావడంతో నష్టం తక్కువగా ఉంది. కానీ ఇదే మరొక ఇంట్లో జరిగితే పరిస్థితి భిన్నంగా ఉండేది. ప్రతి ఇంట్లో రిఫ్రిజిరేటర్ ఒక తప్పనిసరి పరికరమైపోయిన ఈ రోజుల్లో, దీన్ని ఎలా వాడాలో తెలుసుకోవడం అత్యవసరం. ఇంట్లో ఉండే చల్లదనం కలిగించే పరికరం.. చెలరేగే మంటలకు కారణమవుతుందా? అనే అనుమానం ఎంత తీవ్రంగా ఉంటుందో.. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అది నిజంగా జరిగే ప్రమాదం. ఫ్రిజ్ వాడకంలో నిర్లక్ష్యం ప్రాణాలకు హానికరమయ్యే ప్రమాదం ఉన్నందున, కుటుంబ సభ్యుల రక్షణ కోసం మేము తీసుకునే ముందు జాగ్రత్తలే మన భద్రతకు బలమైన గోడ. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. చిన్న ఘటనలు, పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. అందుకే అప్రమత్తతే అసలైన రక్ష

## మానవత్వం చాటుకున్న నారాయణ స్కూల్ అధినేత నారాయణరెడ్డి

కడప (బ్రహ్మంగారిమఠం)

తాళ్లపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడిన శివానందరెడ్డికి 50 వేలు ఆర్థిక సాయం నారాయణ స్కూల్ కరస్పాండెంట్ కొట్టే. నారాయణరెడ్డిఅందజేసి తన గొప్ప తనాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే గురువారం రాత్రి వేంపల్లి మండలం తాళ్లపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని బాసం గంగరాజు మృతి చెందగా బైక్ పై ఉన్న మరో వ్యక్తి శివానందరెడ్డి కి తీవ్ర గాయాలు కావడంతో కడపలోని ఓ ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వేఃపల్లెలో ఉన్న నారాయణ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ కరస్పాండెంట్ నారాయణరెడ్డి మంచి మనసుతో స్పందించి శివానందరెడ్డి తల్లి రవణమ్మ ను పిలిపించి తన కుమారుని వైద్యం ఖర్చులకు గాను తనవంతుగా 50 వేల రూపాయలు నగదును ఆమెకు అందించారు. అలాగే అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు గురు సుబ్బమ్మ 10000 రూ, సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయురాలు మరో 30 వేలు జమ చేసి శివానందరెడ్డి తల్లికి సుమారుగా లక్ష రూపాయల వరకు అందజేశారు. గతంలో శివానందరెడ్డి నారాయణ పాఠశాలలో పి ఈ టి మాస్టర్ గా పనిచేశారని ఆయన అందించిన సేవలను గుర్తించి త్వరగా కోలుకోవాలని కరస్పాండెంట్ నారాయణరెడ్డి మరియు కోటిరెడ్డి, అధ్యాపక సిబ్బంది ఆకాంక్షించారు. వేంపల్లి లో ఉన్న నారాయణ పాఠశాల యాజమాన్యంతో పాటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయ స్పందించి ఈ విధంగా ఆర్థిక సహాయాన్ని అందజేయడం పట్ల పట్టణంలోని పలువురు ప్రజలు మేధావులు వారిని వారి సిబ్బందిని అభినందిస్తున్నారు.

## శాకాంబరాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి

బ్రహ్మం గారి మఠం

శాకంబలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు ఆషాడ మాసం సుఖ సందర్భంగా వారాహి నవరాత్రులలో భాగంగా శుక్రవారం బ్రహ్మంగారిమఠంలోని అమ్మవారి శాలలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి వివిధ రకాలైన కూరగాయలతో శాఖాంబరి అలంకారంలో అలంకరించారు ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు పట్టణంలోని ఆర్యవైశ్యుల కాకుండా కందిమల్లాయపల్లె కొత్తూరు వీరనారాయణపురం వీరబ్రహ్మేంద్ర నగర్ ప్రాంతాల నుంచే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల నుండి మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తాకాంబ్రాలంకారంలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కి కాయ కర్పూరం చెల్లించి ప్రత్యేక పూజలు చేయించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు ఈ కార్యక్రమం అమ్మవారి శాల చైర్మన్ బన్నూరు కృష్ణమూర్తి దంపతులు ముందుండి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు అంతేకాకుండా ఆషాడమాసంలో జరుగుతున్న మొదటి కార్యక్రమం కాబట్టి వాసవి కన్యకా పరమేశ్వరుని శాకాంబరాలంకారంలో అలంకరించి ఉండటంతో అమ్మవారిని దర్శించినందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలి రావడం విశేషం అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తాదులకు తీర్థప్రసాదాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అల్పాహారాలను కూడా పంపిణీ చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ ముచ్చర్ల శేషయ్య సురేష్ బాబు సురేష్ సిద్దయ్య ఇతర ఆర్యవైశ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

==============================

## దేశ వ్యతిరేక కంటెంట్ పోస్ట్ చేస్తే బ్లాక్! కఠిన చర్యలు: త్వరలో కేంద్రం కొత్త పాలసీ

న్యూఢిల్లీ జూలై 4 (

సోషల్ మీడియాలో సంఘ విద్రోహ శక్తులు, దేశానికి వ్యతిరేకంగా విద్వేషాన్ని వ్యాప్తి చేసే వారిపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోనుంది. ఇకనుంచి సోషల్ మీడియాలో దేశ వ్యతిరేక వీడియోలు, లేదా విషయాలను పోస్ట్ చేసే వారు ఇకపై తప్పించుకోలేరు. తాజా సమాచారం ప్రకారం, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇలాంటి కంటెంట్ ను అడ్డుకునేందుకు ఒక నూతన విధానాన్ని తీసుకురావడానికి సిద్ధమవుతోంది. దేశ వ్యతిరేక కార్యకలాపాలు చేసే సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేస్తారు. అదే విధంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. పహల్గాంలో ఉగ్రదాడి తరువాత కేంద్రం అప్రమత్తమైంది. మన మధ్యే ఉంటూ దేశానికి నష్టం కలిగించే వారిపై ఫోకస్ చేస్తోంది. మన దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాతో పాటు అనేక వెబ్‌సైట్‌లలో టెక్స్ట్, వీడియో కంటెంట్ అప్‌లోడ్ అవుతుందని కేంద్ర హోంశాఖ గుర్తించింది. ఇలాంటి పనులు చేసే వారిపై త్వరలో చర్యలు తప్పవని తెలుస్తోంది. సోషల్ మీడియాకు సంబంధించి హోంశాఖ త్వరలో కొత్త పాలసీ రూపొందిస్తోంది. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, హోంశాఖ ఉన్నతాధికారులు పార్లమెంటరీ కమిటీకి ఈ విషయాన్ని తెలిపారు. దేశ వ్యతిరేక వ్యక్తులపై సోషల్ మీడియాలో నిఘా ఉంచడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని పార్లమెంటరీ కమిటీకి సమాచారం అందించారు. అలాంటి వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఖలిస్థాన్ వేర్పాటువాద ఉగ్రవాది గుర్పత్వంత్ సింగ్ పన్నూతో సహా చాలా మంది దేశ వ్యతిరేక వ్యక్తులు సోషల్ మీడియాలో చురుకుగా ఉన్నారు మరియు వారు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారు. కొత్త విధానం వచ్చిన తర్వాత, అలాంటి వ్యక్తులపై అదుపు చేయవచ్చు. అమెరికా ప్రభుత్వం, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో కూడా చర్చలు జరుపుతోంది. సోషల్ మీడియా కంపెనీలు తమ స్థాయిలో నిఘా ఉంచాలని, దేశానికి వ్యతిరేక విషయాలను, విద్వేషం చిమ్మేలా వారి ప్లాట్‌ఫారమ్‌లో అప్‌లోడ్ చేయకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. సిబిఐ, ఎన్ఐఏ, రాష్ట్ర పోలీసులు, అంతర్గత భద్రతకు సంబంధించిన ఇతర ఏజెన్సీలు భారత్ వ్యతిరేక శక్తుల ప్రయత్నాలను అడ్డుకునేందుకు అప్రమత్తం అయ్యాయి. దేశానికి వ్యతిరేకంగా, మతాల మధ్య విద్వేషం చిమ్మేలా కంటెంట్ పోస్ట్ చేస్తే వారి సోషల్ మీడియా అకౌంట్లు బ్లాక్ చేయడంతో పాటు వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటారు. పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి తరువాత కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి నాశనం చేశాయి భారత బలగాలు. అదే సమయంలో సోషల్ మీడియాలో అనేక దేశ వ్యతిరేక పోస్టులను కేంద్రం గుర్తించింది. పలు రాష్ట్రాల్లో యూట్యూబర్లను, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను అరెస్ట్ చేసి ఎన్ఐఏ దర్యాప్తు కొనసాగిస్తోంది. కొందరు యూట్యూబర్లు పాక్ నుంచి డబ్బు తీసుకుని వారికి అనుకూల సమాచారం, దేశానికి సంబంధించి సున్నితమైన సమాచారాన్ని షేర్ చేసినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో గుర్తించింది. వారికి పాక్ తో ఉన్న లింకులపై దర్యాప్తు కొనసాగుతోంది.

## కాకినాడలో సుపరిపాలనలో తొలి అడుగు

:కాకినాడ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు పేర్కొన్నారు.. కాకినాడ సిటీ నియోజకవర్గంలోని 44వ డివిజన్ సారదాదేవి గుడి ప్రాంతాల్లో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం విజయాలు వివరిస్తూ ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరబత్తుల రాజశేఖర్,టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

## ఘనంగా రోశయ్య జయంతి:

కరీంనగర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రోశయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పూలమాలవేసి నివాళులు అర్పించారు. దేశ చరిత్రలో ఏడుసార్లు వరుసగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రోశయ్య తమిళనాడు గవర్నర్ గా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా గొప్ప సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నరసరావుపేటలో టీడీపీ సుపరిపాలన తొలి అడుగు

పల్నాడు

నరసరావుపేటలో టీడీపీ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గోన్నారు.

పట్టణంలో 4,5 వార్డుల్లో నేతలు ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి నేతలు ప్రజలకు వివరించి చెప్పారు.

ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన గురించి ప్రజల వద్దకు వెళుతున్నాం. మా పాలనపై ప్రజలు పూర్తిగా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాబోయే కాలంలో అమరావతిని ప్రపంచంలోనే ఒక హబ్ గా మార్చాలని చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నామని అన్నారు.

## నంద్యాల టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

కర్నూలు, జూలై 4 (న్యూస్ పల్స్)

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆత్మకూరు పర్యటనలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి శ్రీశైలం నియోజకవర్గంలో పర్యటనకు వెళ్లగా చేదు అనుభవం ఎదురైంది. ఎమ్మెల్యేకు తెలియకుండా, సమాచారం ఇవ్వకుండా ఎలా పర్యటిస్తారని ఆయన అనుచరులు ఎంపీ శబరిని అడ్డుకున్నారు. దాంతో శ్రీశైలం నియోజకవర్గంలో ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీగా పరిస్థితి మారింది. ఆత్మకూరులోని మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అనుచరులు రాళ్లదాడికి పాల్పడినట్లు సమాచారం. రంగంలోకి దిగిన పోలీసులు టీడీపీ కార్యకర్తలను చెదరగొట్టి.. మాజీ మంత్రిని ప్రత్యేక వాహనంలో అక్కడి నుంచి మరో చోటుకి తరలించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి శుక్రవారం నాడు నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరులో పర్యటిస్తున్నారు. అయితే నియోజకవర్గానికి వచ్చే ముందు ఎమ్మెల్యేకు కనీసం సమాచారం అందించాలని, కార్యక్రమాలలో ఎమ్మెల్యే హాజరు కావాల్సి ఉంటుందని బుడ్డా రాజశేఖర్ రెడ్డి అనుచరులు బైరెడ్డి శబరిని గట్టిగా నిలదీశారు. లోక్‌సభ ఎంపీగా నంద్యాల నియోజకవర్గంలో ఎక్కడికైనా తాను వెళ్తానని, పర్యటించే హక్కు తనకు ఉందని బైరెడ్డి శబరి అన్నారు. ఈ క్రమంలో ఎంపీ అనుచరులు, ఎమ్మెల్యే అనుచరుల మధ్య నెలకొన్న వాగ్వాదం ఉద్రిక్తతకు దారితీసింది. అయితే పరిస్థితి చేయిదాటుతుండటంతో పోలీసులు జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో బైరెడ్డి శబరి అక్కడి నుంచి వెనుదిరిగారు. పార్టీ ఎమ్మెల్యేలు వర్సెస్ నంద్యాల ఎమ్మెల్యే..గతంలో నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా చేసిన బైరెడ్డి శబరి ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. నంద్యాల ఎంపీ సీటును దక్కించుకున్న ఆమె లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. కానీ ఆమెకు సొంత పార్టీలోనే సహకారం లభించడం లేదు. నంద్యాల లోక్‌సభ పరిధిలో 7 నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఈ లోక్‌సభ పరిధిలో నంద్యాల, పాణ్యం, బనగానపల్లె, శ్రీశైలం, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయి. కేవలం నంద్యాల ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఫరూక్ మాత్రమే ఎంపీ బైరెడ్డి శబరితో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. మిగతా ఏ నియోజకవర్గానికి వెళ్లినా పరిస్థితి ఎంపీ బైరెడ్డి శబరి వర్సెస్ పార్టీ ఎమ్మెల్యేలు అన్నట్లుగా తయారవుతోంది. అసలే ఎంపీ బైరెడ్డి శబరితో నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలకు పొసగడం లేదు. మరోవైపు తమ నియోజకవర్గంలో పర్యటనకు వస్తున్నట్లు ఎంపీ ముందస్తుగా సమాచారం ఇవ్వడంలేదని ఎమ్మెల్యేలు మరింత కోపంగా ఉన్నారు. ఎమ్మెల్యేలను ఎంపీ కలుపుకుని వెళ్లడం లేదని, ఆమె చర్యలను బట్టి తమ రియాక్షన్ ఉంటుందనేలా ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారు. సమాచారం ఇచ్చినా ఎమ్మెల్యేలు తాము వెళ్లకుండా, తమ అనుచరులు సైతం ఆ కార్యక్రమాలలో పాల్గొనకుండా చేయడంతో నంద్యాలలో టీడీపీలో విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. సీఎం చంద్రబాబు ఆదేశాలతో టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఏడాదిలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలను ప్రచారం చేస్తున్నారు.

# సంతృప్త స్థాయిలో ప్రజాస్పందనలు అందాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, జూలై 4(భారత శక్తి) : ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుండి స్పందన సానుకూలంగా, సంతృప్త స్థాయి పెరిగేలా ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల జిల్లా అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక కాలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్ హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు.. జిల్లాలో ప్రభుత్వ సేవలు సంతృప్త స్థాయిలో ప్రజలకు అందేలా అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం, అన్నా క్యాంటీన్ల నిర్వహణ, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఇంటి నుంచి చెత్తను తొలగించడం, గంజాయి మాదకద్రవ్యాల నిరోధం, డ్వాక్రా మహిళలకు జీవనోపాదులు కల్పించే అంశాలతో



పాటు మహిళలపై వేధింపులు, దాడులు అరికట్టడం వంటి పలు అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ సేవలు అందించడంలో ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లిప్తంగా వ్యవహరించకూడదని, ప్రజల కోసమే ప్రభుత్వ అధికారులుగా విధులు నిర్వహిస్తున్నామనే విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వెంకటపతి, సీపీవో హజరతయ్య, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమం



(భారత శక్తి (ప్రతినిధి) కామారెడ్డి, జులై 04: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్లో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కొనిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 2009 నుండి 2010 సంవత్సరం వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, తదనంతరం కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల గవర్నర్ గా పనిచేయడమే కాకుండా చాలా పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా పనిచేసి తన రాజకీయ అనుభవంతో ప్రజలకు విశేష సేవ చేశారని, ఆయన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చందర్ నాయక్, విక్టర్, రవికుమార్, టిజిఓ సెక్రటరీ సాయి రెడ్డి, టిఎన్జీవో అధ్యక్షులు వెంకట్ రెడ్డి, సభ్యులు, జిల్లా అధికారులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, కలెక్టరేట్ ఏవో సయ్యద్ మసూద్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ పార్టీ సిబ్బంది పాడుపడ్డ గృహాలు, పాడుపడ్డ భవనాల వద్ద రహస్యంగా గంజాయి విక్రయిస్తూ, గంజాయి సేవిస్తున్న వారిపై నిఘా





తిరుపతి జిల్లా ప్రతి నిధి, జూలై 04(భారత శక్తి): తిరుచునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాడుపడ్డ గృహాలు, పాడపడ్డ బంగ్లా వద్ద డోన్ కెమెరాతో బీట్ నిర్వహిస్తున్న సమయంలో నిన్న హొటల్ గ్రాండ్ రిడ్జ్ బ్యాక్ సైడ్ పాడుపడ్డ భవనం వద్ద నలుగురు యువకులు గంజాయి సేవిస్తున్న దృశ్యాలు డ్రోన్ కెమెరా కంటపడటంతో నలుగురిని అదుపులోకి తీసుకొని తిరుచానూరు పోలీస్ స్టేషన్ కు అప్పగించడం జరిగినది. ఈ నేపథ్యంలో మూడు రోజుల నుండి డ్రోన్ టీంతో పాటు, స్పెషల్ పార్టీ, ఈగల్ టీం పోలీసు సిబ్బంది.. హొటల్ గ్రాండ్ రిడ్జ్ బ్యాక్ సైడ్ పాడుపడ్డ భవనం వద్ద నిఘా పెట్టడం జరిగినది. నిఘాలో ఓ వ్యక్తి అదే పాడుపడ్డా భవనం మెట్లు పైన కూర్చున్నట్లు గా డ్రోన్ కెమెరాకు కనిపించడంతో వేంటనే స్పెషల్ టీం సిబ్బంది భవనం చుట్టుముట్టి అతనిని పట్టుకోవడం జరిగినది. అతని వద్ద ఎనిమిది గంజాయి ప్యాకెట్స్ ను స్వాధీనం చేసుకుని తిరుచానూరు పోలీసు వారికి అప్ప చెప్పడం జరిగినది. తిరుచానూరు పోలీసు వారు విచారించగా.. అతను తమిళనాడు రాష్టానికి చెందిన వ్యక్తి గా గుర్తించారు. అంతే కాకుండా అతని పై గతంలో తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో గంజాయి కేసులో అరెస్ట్ చేసినట్లు పాత రికార్డ్ ఉన్నట్లుగా గుర్తించడమైనది. తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరమ్మ గృహాలలో నివాసం ఉంటూ గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసు వారు విచారణ లో తేలినది. హొటల్ గ్రాండ్ రిడ్జ్ సమీపంలో ఉన్న పాడుబడ్డ భవనం ను స్థావరంగా చేసుకుని కొంతమంది యువకులు గంజాయి సేవిస్తున్నారు. పాడుబడ్డ భవనం కు వచ్చే వారందరికి 20 గ్రాముల చిన్న చిన్న ప్యాకెట్స్ తయారు చేసి విక్రయిస్తున్నట్లు విచారణ లో తేలిందన్నారు. గంజాయి ఎవరు ఎవరికి, ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారనేది విచారణలో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

# భూమి వివాదం కారణంగా తండ్రిని హత్య చేసిన కొడుకు.

## -నిందితుని అరెస్టు చేసిన మోతే పోలీసులు.

## -వివరాలను వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 04:సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నందు నిర్వహించిన మీడియా సమావేశంలో భూ వివాదంలో తండ్రిని హత్య చేసిన కొడుకు కేసు వివరాలను జిల్లా ఎస్పీ నర్సింహ వెల్లడించారు. ఈనెల 2వ తేదిన మోతే మండలం నాగయ్యగూడెం గ్రామానికి చెందిన నిమ్మరబోయిన వెంకన్న (60) అనే వ్యక్తి విభళాపురం గ్రామ శివారులో మామిళ్ళగూడెం వెళ్లే రోడ్డు మార్గంలో తీవ్రమైన రక్తపు గాయాలతో రోడ్డు పక్కన పడి ఉండగా సమాచారం పై మోతే పోలీసులు అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మరణించాడు. దీనిపై మృతుడు వెంకన్న కూతురు స్వరూప ఇచ్చిన ఫిర్యాదు పై మోతే పోలీసులు హత్య నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగినది. ఈ దర్యాప్తులో భాగంగా శుక్రవారం నమ్మదగిన సమాచారంపై ఉదయం 10 గంటల సమయంలో మామిళ్లగూడెం ఎక్స్ రోడ్డు వద్ద హత్యకు పాల్పడిన నిమ్మరబోయిన గంగయ్య(35) ను మోతే ఎస్సై యాదవేందర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకోవడం జరిగినది. నాగయ్యగుడెం గ్రామ శివారులో మృతునికి (నిమ్మరబోయిన వెంకన్న) 4.29 గుంటల భూమి సంబంధిత తగాదా విషయమై తండ్రి కుమారులకు మధ్య గత కొద్ది నెలలుగా వివాదం జరుగుతున్నదని ఇదే విషయమై 5 నెలల క్రితం పెద్ద మనుష్యులు సమక్ష్యంలో తీర్మానం ప్రకారం గా తల్లిదండ్రులకు 1 ఎకరం భూమి, కుమారులకు చెరొక $1\frac{1}{2}$ ఎకరం భూమి మరియ మా కూతురుకు 29 గుంటల వ్యవసాయ భూమి వాటాలు వేసి ఒక అగ్రిమెంట్ కూడా వ్రాసినారు. ఇట్టి భూమి పట్టాలు చేయలేదు. తరువాత మృతుడు వెంకన్న తన వాటాకు వచ్చిన 1 ఎకరం భూమిని తనకు అప్పులు అయినాయని అమ్ముకోవడంతో ఈ



విషయాలై తండ్రిపై కోపంతో అతని పై పగ పెంచుకుని అతనిని ఎలాగైనా చంపాలని అందుకొరకు అడును చూస్తూ ఎప్పుడు ఒంటరిగా దొరికితే అప్పుడు అతనిని చంపాలని నిందితుడు బైక్ పైన ఎప్పుడు గొడ్డలి పెట్టుకొని తిరుగుచున్నాను.

జూలై 02 మధ్యాన్నం నింధితుడు తన బైక్ పైన మోతె కు వెళ్ళి తిరిగి ఇంటికి వస్థూ మోతె గ్రామశివారులో ఉన్న పెట్రోల్ బంక్ లో పెట్రోల్ పోయించుకొని వస్తుండగా అదే సమయంలో మృతుడు సూర్యాపేట నుండి తన టీవీఎస్ మోపెడ్ నెం. టీఎస్ 29- ఎఫ్-4747 గల దానిపై నాగయ్య గూడెం కు వెళ్ళుచుండడం గమనించి గుర్తుపట్టకుండా నింధితుడు హెల్మెట్ ధరించి విభాలాపురం గ్రామ శివారులో వెంట తెచ్చుకున్న గొడ్డలితో దాడిచేసి నింధితుడు అక్కడి నుండి పాయిపోవడం జరిగినదని,నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించడం జరుగుతుందన్నారు. ఈ కేసును చేదించిన మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి ని, ఎస్సై యాదవేంధర్ రెడ్డి ని, మరియు పోలీస్ స్టేషన్ సిబ్బందిని కేసు పర్యవేక్షణ చేసిన డిఎస్పి శ్రీధర్ రెడ్డి లను ఎస్పీ నరసింహ అభినందించారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు:డి వై ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు మీసాల వీరబాబు

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై04:డి వై ఎఫ్ ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ మరియు నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన పిలుపు మేరకు ఉద్యోగాల సాధన కోసం శుక్రవారం హలో నిరుద్యోగి - సెక్రటేరియట్ ఛలో ముట్టడి" కార్యక్రమానికి వెళ్లనీయకుండా గురువారం అర్ధరాత్రి నుండి రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లాల వ్యాప్తంగా డి వై ఎఫ్ ఐ నాయకులను, కార్యకర్తల ఇళ్లకు వెళ్ళి అక్రమ అరెస్టులు చేసి నిర్బంధించడాని డి వై ఎఫ్ ఐ సూర్యాపేట జిల్లాఉపాధ్యక్షులు మీసాల వీరబాబు తీవ్రంగా ఖండించారు.

నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను,నిరుద్యోగ హామీలను అమలు చేయాలని నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని తలపెట్టిన చలో సెక్రటేరియట్ ముట్టడికార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం నాడు అక్రమంగా హుజూర్ నగర్ డివైఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా డి వై ఎఫ్ ఐ, నిరుద్యోగ జేఏసీ ఛలో సెక్రటేరియట్ డిమాండ్స్ అయిన1) కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన



యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి. 2)అన్ని ఉద్యోగాల ఖాళీల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ లను విడుదల చేయాలి. 3)నిరుద్యోగ భృతి నెలకు రూ. 4000 వేలు ఇవ్వాలి. 4)రాజీవ్ యువ వికాస్ స్కీమ్ ను వెంటనే అమలు చేయాలన్నారు పట్టణ కమిటీ ని ముందస్తు అరెస్టు చేయడం ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గొబ్బి రాము, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఇందిరాల నరేష్, పట్టణ ఉపాధ్యక్షులు రామాల అనిల్,కమిటీ సభ్యులు నక్కిన బోయిన శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన జిల్లా ఎస్పీ డా: జి. జానకి షర్మిల.



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూలై 04: నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి శ్రీ కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు యంత్రాంగం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల రోశయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా: జి.జానకి షర్మిల ఐపిఎస్ మాట్లాడుతూ రోశయ్య సుదీర్ఘ కాలంగా ప్రజాసేవలో నిమగ్నమై, చేసిన దేశసేవ, పరిపాలన పటిమ, నిష్కళంక రాజకీయ జీవితాన్ని స్మరించుకున్నారు. రాజకీయాల్లో ఉన్నతమైన నైతిక విలువలకు నిలయంగా నిలిచారని, ఆయన సేవా తత్వం, ప్రజలపట్లకలిగిన కట్టుబాటు ప్రతి అధికారికి ప్రేరణగా నిలవాలని ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారుల కోసం 50 వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తాం : ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 04: ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్)12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని




నిజామాబాద్ జిల్లా ఐవిఎఫ్ సేవాదళ్ అధ్యక్షులు ముస్తాల సాయి కృష్ణ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు మాట్లాడుతూ, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ 12 వ వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని 50 వేల యూనిట్ల రక్తాన్ని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం అందజేస్తామని, ఇప్పటివరకు తలసేమియా చిన్నారుల కోసం 3500 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో నమోదు కావడం జరిగిందని అన్నారు. రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేయడం జరిగిందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు, ప్రతినిధులు తోట రాజశేఖర్, రామకృష్ణ,ప్రణీష్,నరసయ్యలు పాల్గొన్నారు.

# రాహుల్ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ జూలై 4 ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్ రెడ్డికి నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీని పిలిపించి మరీ నిరుద్యోగులతో చాయ్ పే చర్చ పెట్టిన రేవంత్‌కు గద్దెనెక్కిన తరువాత జాబ్ క్యాలెండర్ అసలు గుర్తే లేదా..? చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాల్లో నిరుద్యోగులు హైదరాబాద్ రాకుండా ముందుగానే నిర్బంధించడమే దారుణమైతే, ఇవాళ సచివాలయానికి గోడు చెప్పుకునేందుకు వచ్చిన వారిని కూడా అరెస్టు చేయడం దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు. యూత్ డిక్లరేషన్ పేరిట ఢిల్లీ పెద్దలను పిలిపించి మరీ మోసం చేసిన రేవంత్ ఏడాదిన్నర కాలంలో పట్టుమని పదివేల ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం నిరుద్యోగులకు వెన్నుపోటు పొడవడమే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రక్రియ పూర్తి చేసిన 60 వేల ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి చేతులు దులుపుకున్న చేతకాని ముఖ్యమంత్రిని నిరుద్యోగులు ఎప్పటికీ క్షమించరు. ఓవైపు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు ఇంకెప్పుడు అని నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే, మరోవైపు నిరుద్యోగులు నోటిఫికేషన్లే వద్దంటున్నారని బుకాయించడం కాంగ్రెస్ సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనం అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రికి నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం. చలో సచివాలయం కార్యక్రమాన్ని చేపట్టిన నిరుద్యోగులను అక్రమంగా అరెస్టుచేసి వారి గొంతులు నొక్కలేరు. వెంటనే వారందరినీ బేషరతుగా విడుదల చేసి ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను ఇప్పటికైనా నిలబెట్టుకోవాలి. లేకపోతే రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించి రేవంత్ సర్కారు మెడలు వంచుతాం.. కాంగ్రెస్ సర్కారు చేసిన ద్రోహాన్ని గడపగడపకూ తీసుకెళ్లి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెడతాం అని కేటీఆర్ హెచ్చరించారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిగాచి బాధితులకు అండగా ఉంటుంది: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.






పటాన్చెరు, భారత శక్తి ప్రతినిధి, జులై 04: సిగాచి పరిశ్రమను సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిగాచి పరిశ్రమంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శు క్రవారం ఆయన పటాన్చెరువు మండలం, పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఫార్మా పరిశ్రమను సందర్శించారు. స్పెషల్ సెక్రటరీ రెవెన్యూ %డ% డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ,అరవింద్ కుమార్ , పరిశ్రమలు, కార్మిక శాఖ , స్పెషల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, అగ్నిమాపక శాఖ అధికారుల తో పరిశ్రమలో అగ్నిమాపక శాఖ, పొల్యూషన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది, పరిశ్రమల శాఖ సిబ్బంది,కంపెనీ ప్రతినిధులు ,పోలీసులు ,రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష జరిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, పరిశ్రమల భద్రతా ప్రమాణాలు, సేఫ్టీ మెకానిజం నిర్వహణపై సంబంధిత శాఖలతో ఆయన సమీక్షించారు. పరిశ్రమలో రియాక్టర్లు, డ్రైయర్లు, ఫైర్ ఫైట్ సిస్టం, ఉద్యోగుల రక్షణ మార్గాలు, ఇతర భద్రతా అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ... ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామన్నారు. ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు మృతుల వివరాలు మృతుల ఐడెంటిఫికేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల కోసం ఐలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతోమాట్లాడారు.ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా త్వరలో మృతుల కుటుంబాలకు క్షతగాత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సహాయ చర్యలు మరింత సమర్థవంతంగా సాగేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూలై4 :కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం కాజీపేట చౌరస్తా సర్కిల్ లో జూలై 9న దేశవ్యాప్తంగా జరుగనున్న సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో గోడపత్రికలను జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ,హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, మద్దేల ఎలేష్ మాట్లాడుతూ దేశంలోనే కార్మికులు దశాబ్ద కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రం బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మికుల హక్కుల చట్టాలను బడా పెట్టుబడుదారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికులను కట్టు బానిసలుగా చేయటాన్ని కార్మికులంతా వ్యతిరేకించాలని కార్మిక హక్కులు ఉపసంహరించుకునేంత వరకు ఐక్యమత్యంతో కార్మికులంతా పోరాడాలని సూచించారు.బిజెపి ప్రభుత్వం కేవలం ఈ దేశంలో ఉన్న సంపన్నులకు వారి ప్రయోజనాల కొరకే ఈ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఇప్పటికైనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 9, తేదీలో దేశంలో ఉన్న కార్మికులందరూ సమ్మెలో పాల్గొంటున్నారని ఈ సమ్మె ప్రభావం కేంద్ర ప్రభుత్వానికి తెలిసే విధంగా కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా వేలాది మంది సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎఐటీయుసి నాయకులు శంకర్ నాయక్,మునిగాల బిక్షపతి,రీల్ పూర్ణచందర్, ప్రవీణ్,వినోద్,భవణ నిర్మాణం కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

# సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారు కొనుగోలు ప్రయోజనమేనా?

సొంతంగా కారును కొనుగోలు చేసి దానిలో తమ దైనందిన కార్యక్రమాలకు వెళ్లడానికి చాలా మంది ఆసక్తి చూపుతారు. మరికొందరు ఏదో ఒక కారు అని కాకుండా విలాసవంతమైన కారును సొంతం చేసుకోవడానికి ఇష్టపడతారు. విలాసవంతమైన కారు కొనడం అనేది చాలామందికి ఒక కల. దీంతో చాలామంది సెకండ్ హాండ్ లగ్జరీ కారును కొనుగోలు చేసి తమ కలను నెరవేర్చుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్ల మార్కెట్ భారత్‌లో ఏటా 15-20% వృద్ధి చెందుతోంది. సగటున సంవత్సరానికి 60 వేలకు పైగా విక్రయాలు జరుగుతున్నాయి. వివిధ కార్ల కంపెనీలు కూడా సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్ల అమ్మకాల నిమిత్తం అనేక షోరూంలను తెరిచి బ్యాంకు లోన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నాయి. సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్లను కొనడం ప్రయోజనమేనా?చాలామంది కారు కొనుగోలు చేయడానికి సిద్ధమైనా దాని ధర చూసి ఆగిపోతారు. లగ్జరీ కారు అయితే ధర ఎక్కువే ఉంటుంది. అయితే, కొత్త కారు షోరూం నుంచి బయటకు వచ్చిన వెంటనే, దాని విలువ మార్కెట్లో తగ్గుతుంది. 6 నెలల నుంచి 1 సంవత్సరం వ్యవధిలో కారు 15-25 శాతం విలువను కోల్పోతుంది. వాహనం ఐదేళ్ల తర్వాత దాదాపు సగం విలువను కోల్పోతుంది. అదే విధంగా తరుగుదల రేటు ప్రతి సంవత్సరం గడిచేకొద్దీ పెరుగుతూనే ఉంటుంది. ఇది కొత్త కార్లను కొనుగోలు చేసిన యజమానులకు నష్టం అయినప్పటికీ, వారి నుంచి ఈ వాహనాలను కొనుగోలు చేసే వినియోగదారులకు లాభదాయకం.

# గ్రామ స్థాయి వరకు జన్ సురక్ష స్కీములను తీసుకువెళ్లండి: జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి.



వైయస్సార్ కడప,జూలై 4(భారత శక్తి): ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన మరియు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన,అటల్ పెన్షన్ యోజన పథకాలను గ్రామ స్థాయి వరకు తీసుకొని వెళ్లి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఇందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని ఈ అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఎల్ డి ఎం ను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సచివాలయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జన్ సురక్ష పథకాలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఈనెల ఒకటి నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కు సంబంధించి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్ సురక్ష పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన మరియు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్లి నమోదు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఇందుకు తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని ఎల్ డి ఎం ను ఆదేశించారు.ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా బ్యాంకు ఖాతాలు లేని కుటుంబాలను గుర్తించి, వారిచే బ్యాంకు ఖాతాలను తెరిపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ను జిల్లాస్థాయి నుండి గ్రామస్థాయి వరకు సమర్థవంతంగా నిర్వహించడంలో సంబంధిత శాఖలైన డిఆర్డిఏ, మెప్మా మరియు డ్వామా శాఖలను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ సమావేశాల నిర్వహణకు సంబంధించిన విషయాన్ని ముందుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. బ్యాంకులకు సంబంధించిన సమస్యలు ఉన్నవారితో పాటు బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఆసక్తి ఉన్నవారు అందరూ హాజరవుతారని తెలిపారు. ఈ కేవైసీ చేయనివారిని గుర్తించి ఈ కేవైసీ అప్డేషన్ ప్రక్రియను వేగంగా చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జన్ సురక్షా పథకాల గురించే కాకుండా ఆర్థిక అక్షరాస్యత పై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రస్తుత పరిస్థితులలో సైబర్ మోసాల పై ప్రజలకు అవగాహన కల్పించడం కూడా ముఖ్యమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో డిఆర్డిఏ, అర్బన్ పరిధిలో మెప్మా శాఖల ద్వారా ఎస్ హెచ్ జి మహిళలను భాగస్వాములను చేయడం ద్వారా ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు అవకాశం ఉందన్నారు.డ్వామా ద్వారా ఉపాధి కూలీలకు బ్యాంకు ఖాతాలు తెరవడం చేయాలన్నారు. పెన్షన్ ఖాతాలను బ్యాంకు ఖాతాలు తెరవడం చేయవచ్చునన్నారు.ఈ క్యాంపెయిన్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి బుధవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో భాగంగా జులై 23, 30, ఆగస్టు 6 తేదీలలో ప్రతి గ్రామస్థాయిలో సమావేశాల నిర్వహణ చేపట్టాలన్నారు. రెండవ విడత మూడవ విడతలో చేసే కార్యక్రమాలలో మొదటి విడతలో జిపి లలో లోటుపాట్లను సరిదిద్దుకొని పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పుడు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎం జనార్ధన, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు చంద్ర నాయక్, రవి చంద్ర బాబు,ఆర్ ఎం యూనియన్ బ్యాంక్ లక్ష్మీ తులసి, నాబార్డ్ డిడిఎం విజయ విహారి, ఆర్ ఎం ఎస్ బి ఐ కృష్ణ కిషోర్, వివిధ బ్యాంకు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐకి డేటా కంటే విలువైనది ఇదే.. మార్క్ జుకర్‌బర్గ్ అంచనా



ఏఐకి డేటా కంటే విలువైనది మరొకటి ఉందని మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ తెలిపారు. అదేంటి? ఎలా ఉపయోగపడుతుందో చూద్దాం..!ప్రముఖ టెక్ సంస్థ మెటా ఇటీవల లామా-3 ఏఐ మోడల్స్‌ను విడుదల చేసింది. వాటిని వాట్సప్, మెసెంజర్, ఇన్‌స్టాగ్రామ్‌కు అనుసంధానం చేసింది. ఈసందర్భంగా భవిష్యత్తులో కృత్రిమ మేధ (%ూతీఅటఱఎఱషఱ్ శ్రీ ×త్వశ్రీశ్రీఱస్త్రవఅషవ-ూ×%) పనితీరును నిర్దేశించబోయే అంశమేంటో సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ వెల్లడించారు. అది డేటా మాత్రం కాదని స్పష్టంచేశారు.“ఏఐ మోడల్‌లో డేటా కంటే ఫీడ్‌బ్యాక్ లూప్‌లు చాలా విలువైనవిగా మారతాయని నా నమ్మకం” అని జుకర్‌బర్గ్ వెల్లడించారు. ఏఐ మోడల్స్‌ను ట్రైన్ చేయడం, మెరుగుపర్చడం కోసం ఫీడ్‌బ్యాక్ లూప్‌లను ఉపయోగిస్తారు. ఇవి గత ఔట్‌పుట్‌ల ఆధారంగా పని చేస్తాయి. తప్పులు జరుగుతున్న సమయంలో ఏఐ మోడల్స్‌కు వాటిని గుర్తు చేసి, అవగాహన కల్పించే అల్గారిథమ్‌లనే లూప్స్‌గా వ్యవహరిస్తారు. పనితీరును మెరుగుపర్చుకోవడానికి కావాల్సిన డేటాను కూడా అవి అందిస్తాయి. ఏఐ మోడల్స్‌ను ఉపయోగించడం, వాటిలోని లోపాలను గుర్తించడం, ఫీడ్‌బ్యాక్ రూపంలో వాటిని అందించి మెరుగుపర్చడమనే ప్రక్రియ భవిష్యత్తులో చాలా విలువైనదిగా మారుతుందని జుకర్‌బర్గ్ వివరించారు.సింథటిక్ డేటా సైతం కీలకపాత్ర పోషిస్తుందని జుకర్‌బర్గ్ అన్నారు. వాస్తవ ప్రపంచంలో ఎదురయ్యే సమస్యల్ని గుర్తించి.. వాటిని పరిష్కరించేందుకు ఉన్న వివిధ పరిష్కార మార్గాలను అన్వేషిస్తారు. వాటిలో ఏది సత్ఫలితాలిస్తుందో కనిపెడతారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్నే సింథటిక్ డేటాగా వ్యవహరిస్తున్నారు. వాస్తవ రూపంలో ఆ సమస్య తలెత్తడం, దాన్ని పరిష్కరించడం జరగకపోయినప్పటికీ.. వాటిని ఊహించుకుని ముందే ఆయా పరిష్కారాలతో ఏఐ మోడల్స్‌కు శిక్షణ ఇవ్వడానికి ఈ సింథటిక్ డేటా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చాలా కంపెనీలు ఇప్పుడు దీన్ని అభివృద్ధి చేసే పనిలో ఉన్నాయి.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చూపిన స్ఫూర్తిని ప్రతి ఒక్కరు కొనసాగించాలి: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జులై 04: భూమికోసం,భుక్తి కోసం , వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి నెలకొరిగిన, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చూపిన స్ఫూర్తిని ప్రతి ఒక్కరు కొనసాగించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు.శుక్రవారం శ్రీ దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి సందర్భంగా పోతిరెడ్డి పల్లి చౌరస్తా కి సమీమలోవున్న దొడ్డి కొమురయ్య విగ్రహానికి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి లు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా గ్రంధాలయ చైర్మన్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ , జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్నీ అధికారికంగా నిర్వహించడం జరుగుతున్నాయని అన్నారు . తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరత్వాన్ని ఇచ్చి స్ఫూర్తినిచ్చిన వారే దొడ్డి కొమురయ్య అని అన్నారు. దొడ్డి కొమరయ్య స్ఫూర్తిని కొనసాగించాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తలచుకోగానే మొదటగా గుర్తు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అని, తెలంగాణలో భూస్వామ్యపాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అనిపేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభమడానికి భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణమన్నారు. వీరుల గాధలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలనే ఉద్దేశంతో వీరుల జయంతి, వర్ధంతిలను నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేల రాలిన తొలి అమరుడని, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని , ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. మహనీయుల ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి జగదీష్ ,వెనుకబడిన తరగతుల కులసంఘం నాయకుల అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, పుష్ప నగేష్ యాదవ్, బీరయ్య యాదవ్ ప్రభు గౌడ్ సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితర కుల నాయకులు పాల్గొన్నారు.

# అంచనాలు మించిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశీయ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 17.7% పెరిగి రూ.19.58 లక్షల కోట్లకు చేరాయని పన్ను విభాగం ఆదివారం వెల్లడించింది. బడ్జెట్‌లో సవరించిన అంచనాలను మించి పన్ను వసూళ్లు నమోదయ్యాయని పేర్కొంది. ఆదాయపు పన్ను, కార్పొరేట్ పన్నుల నికర వసూళ్లు బడ్జెట్ తొలి అంచనాల కంటే రూ.1.35 లక్షల కోట్లు (7.4%), సవరించిన అంచనాల కంటే రూ.13,000 కోట్లు (0.67%) అధికంగా నమోదైనట్లు తెలిపింది. ఫిబ్రవరి 1న సమర్పించిన తాత్కాలిక బడ్జెట్‌లో 2023-24 ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని ప్రభుత్వం రూ.19.45 లక్షల కోట్లకు సవరించింది. 2023-24లో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు (తాత్కాలిక) 18.48% పెరిగి రూ.23.37 లక్షల కోట్లకు చేరాయి. నికర వసూళ్లు (రిఫండ్లు మినహాయించాక) 17.7% వృద్ధితో రూ.19.58 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఆర్థిక వ్యవస్థలో ఉత్సాహాన్ని, వ్యక్తులు, కార్పొరేట్ల ఆదాయ స్థాయి పెరుగుదలను ఇది సూచిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.3.79 లక్షల కోట్ల రిఫండ్ అందించినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) తెలిపింది. 2022-23లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.16.64 లక్షల కోట్లుగా నమోదు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.18.23 లక్షల కోట్ల లక్ష్యాన్ని ప్రభుత్వం తొలుత నిర్దేశించుకుంది. తర్వాత రూ.19.45 లక్షల కోట్లకు సవరించింది. అంతకుమించి రూ.13,000 కోట్ల మేర అదనపు వసూళ్లు రావడం విశేషం.

స్థూల కార్పొరేట్ పన్ను వసూళ్లు (తాత్కాలిక) 13.06% పెరిగి రూ.11.32 లక్షల కోట్లకు చేరాయి. 2022-23లో ఇవి రూ.10 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో నికర




కార్పొరేట్ పన్ను వసూళ్లు (తాత్కాలిక) రూ.8.26 లక్షల కోట్ల నుంచి 10.26% పెరిగి రూ.9.11 లక్షల కోట్లకు చేరాయి.స్థూల వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు (సెక్యూరిటీల లావాదేవీ పన్నుతో కలిపి) రూ.9.67 లక్షల కోట్ల నుంచి 24.26% పెరిగి రూ.12.01 లక్షల కోట్లకు చేరాయి. నికర వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళు రూ.8.33 లక్షల కోట్ల నుంచి 25.23% పెరిగి రూ.10.44 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్‌లు రూ.3.09 లక్షల కోట్ల నుంచి 22.74% పెరిగి రూ.3.79 లక్షల కోట్లకు పెరిగాయి.పరోక్ష పన్ను వసూళ్లు కూడా సవరించిన అంచనా రూ.14.84 లక్షల కోట్ల కంటే అధికంగానే నమోదయ్యాయని, రికార్డు స్థాయిలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఇందుకు దోహదపడ్డాయని ప్రభుత్వాధికారి ఒకరు వెల్లడించారు. పరోక్ష పన్ను వసూళ్లు (కస్టమ్స్, కేంద్ర ఎక్సైజ్ సుంకాలతో కలిపి) గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల కంటే బాగా నమోదైనందుకు ఆనందంగా ఉందని సీబీఐసీ ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ క్షేత్ర స్థాయి అధికారులకు ఇటీవలే లేఖ రాశారు.

# ఆ క్యాచ్ నాలో ఆత్మవిశ్వాసం పెంచింది: శుభ్‌మన్ గిల్




ఇంగ్లాండ్‌పై డబుల్ సెంచరీ (269) చేసిన భారత కెప్టెన్ శుభమన్ గిల్ దాదాపు 65 ఓవర్లపాటు బ్యాటింగ్ చేశాడు. తొలిరోజు నుంచి రెండోరోజు మూడో సెషన్ ప్రారంభం వరకూ క్రీజ్‌లోనే గడిపాడు. ఇంగ్లాండ్ బ్యాటింగ్‌కు దిగిన తర్వాత రెండో ఓవర్‌లో గిల్ మైదానంలోకి వచ్చాడు. ఆకాశ్‌దీప్ బౌలింగ్‌లో ఓపెనర్ బెన్ డకెట్ ఇచ్చిన క్యాచ్‌ను గిల్ అద్భుతంగా ఒడిసిపట్టాడు. తొలి టెస్టులో భారత ఫీల్డర్లు ఆరేడు క్యాచ్‌లను వదిలేసిన సంగతి తెలిసిందే. ఈసారి మాత్రం మూడు క్యాచ్‌లను సూపర్‌గా పట్టారు. రెండోరోజు మ్యాచ్ ముగిసిన అనంతరం గిల్ ఫీల్డింగ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

"గత కొన్ని రోజులుగా నేను స్లిప్‌లో క్యాచ్‌లను ప్రాక్టీస్ కూడా చేయలేదు. ఈ టెస్టు మొదలైన తర్వాత బ్యాటింగ్ కోసం క్రీజ్‌లోనే ఉండిపోయా. మూడో ఓవర్‌లోనే క్యాచ్ పట్టడం భలేగా అనిపించింది. ఫీల్డింగ్ ఎంత ముఖ్యమో మాకు తెలుసు. దీనిపై మేం సుదీర్ఘంగా చర్చించుకున్నాం. గత మ్యాచ్‌లో వేం సగం మాత్రవే నాణ్యమైన ప్రదర్శన చేశాం. కొన్ని క్యాచ్‌లను వదిలేయడం చాలా నష్టం చేసింది. లేకపోతే పరిస్థితి భిన్నంగా ఉండేది" అని గిల్ వెల్లడించాడు.

అప్పట్నుంచే బ్యాటింగ్‌పై దృష్టిపెట్టా..

"టెస్టుల్లో సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడాలంటే మాత్రం చాలా కృషి చేయాలి. ఈ సిరీస్‌కు ముందునుంచే నేను దానిపై సాధన చేశా. ఐపీఎల్ ముగింపు నుంచే దృష్టిసారించా. టెస్టు క్రికెట్ ఆడేముందు అది చాలా అవసరం. ఇప్పటివరకు నా కష్టానికి సరైన ఫలితమే వచ్చిందనుకుంటున్నా. మున్ముందు ఇదేతరహాలో ఆడేందుకు ప్రయత్నిస్తానే ఉంటా. ఫీల్డింగ్‌లోనూ క్యాచ్‌ను అందుకోవడంతో నా ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది" అని భారత సారథి వ్యాఖ్యానించాడు.


ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భారత్ 587 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 77 పరుగులకే మూడు వికెట్లను కోల్పోయింది. ఇందులో స్లిప్‌లోనూ మూడు క్యాచ్‌లను పట్టుకోవడం విశేషం. గిల్, కరుణ్‌నాయర్ ఏమాత్రం ఇబ్బందిపడకుండా అందుకోగా.. కేఎల్ రాహుల్ కాస్త ఇబ్బందిపడినట్లు అనిపించినా రెండో ప్రయత్నంలో పట్టేశాడు. ఇందులో రెండు వికెట్లు ఆకాశ్‌దీప్ తీయగా.. సిరాజ్ ఒక వికెట్ పడగొట్టాడు.

# బంగ్లాదేశ్ పర్యటన కష్టమే.. బీసీసీఐకి అనుమతివ్వని కేంద్రం

: ఆగస్టులో బంగ్లాదేశ్‌తో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడేందుకు భారత్ పర్యటించాల్సి ఉంది. అయితే, బంగ్లాలో అనిశ్చిత రాజకీయ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో టీమ్‌ఇండియా అక్కడికి వెళ్లడం కష్టమేనని సమాచారం. ఈ విషయంలో బీసీసీఐకి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. ఆగస్టు 17 నుంచి వన్డే సిరీస్ జరగాలి. కానీ, అక్కడ స్థానిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండటంతో ఆటగాళ్ల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని కేంద్రం స్పష్టంచేసినట్లు కథనాలు వస్తున్నాయి. కేంద్రం నుంచి అనుమతి వస్తేనే జట్టును పంపిస్తామని ఇప్పటికే బీసీసీఐ వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే.

త్వరలోనే సంయుక్త ప్రకటన

మరోవైపు భారత్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు తామెప్పుడూ సిద్ధమేనని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) తెలిపింది. ఇప్పుడు కాకపోయినా మరోసారి అవకాశం కల్పించాలని కోరుతోంది. ఈ క్రమంలో భారత ప్రభుత్వం నుంచి అనుమతి లేని నేపథ్యంలో.. త్వరలోనే బీసీసీఐ, బీసీబీ సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. సిరీస్‌లను వాయిదా వేయడమా లేదా రద్దు చేయడమా? అనేది అప్పుడే నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. పాకిస్థాన్‌తో మ్యాచుల మాదిరిగా తటస్థ వేదికల్లో నిర్వహిస్తారా? అనేది కూడా ఓ ఆప్షన్‌గా ఉందనేది క్రికెట్ వర్గాల నుంచి వినిపిస్తోన్న మాట.




అమ్మకాలను నిలిపేసిన బంగ్లా బోర్డు

టీమ్‌ఇండియాతో మ్యాచులంటే ఎంత క్రేజ్ ఉంటుందో అందరికీ తెలిసిందే. దీనిని ఆదాయంగా మార్చుకొనేందుకు ప్రతి దేశం ఎదురుచూస్తుంటుంది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టులో భారత్‌తో మ్యాచుల నేపథ్యంలో సిరీస్ మీడియా హక్కుల అమ్మకంతో భారీగా ఆదాయం ఆర్జించాలని బీసీబీ భావించింది. జులై 7, జులై 10న బిడ్డింగ్ నిర్వహించాలని తొలుత ఏర్పాట్లు చేసింది. ఇప్పుడు టీమ్‌ఇండియా పర్యటన వాయిదా పడే అవకాశాలు ఉండటంతో మీడియా హక్కుల అమ్మకాలనూ నిలిపేస్తూ నిర్ణయం తీసుకుంది. జులై 2025 నుంచి జూన్ 2027 మధ్య రెండేళ్ల కాలానికి మొదట మీడియా హక్కులను అమ్మాలని ప్రణాళికలను సిద్ధం చేసింది. పాకిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ (జులై 17 నుంచి జులై 25 వరకు) నుంచే అమల్లోకి తీసుకురావాలని అనుకుంది. ఆ ప్రణాళికలన్నింటినీ పక్కన పెట్టేయడం గమనార్హం.

# ఇంగ్లాండ్ మాజీ మొదలెట్టాడు.. భారత్‌పై అక్కసు




భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తుందని అనిపిస్తే చాలు.. ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్లు తమ అక్కసు వెళ్లగక్కేందుకు సిద్ధంగా ఉంటారు. గత ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో టీమ్‌ఇండియా ఒకే వేదికపై ఆడిన సంగతి తెలిసిందే. ఛాంపియన్‌గా నిలిచేందుకు ఇదే కారణమంటూ ఇంగ్లాండ్ మాజీలు ఆక్షేపించారు. ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతోన్న రెండో టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు (587) చేయడం.. ఇంగ్లాండ్ త్వరగా మూడు వికెట్లను కోల్పోవడం వారికి కంటగింపుగా మారింది. దీంతో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్, కామెంటేటర్ డేవిడ్ లాయిడ్ తన నోటికి పని చెప్పడం గమనార్హం. రెండో రోజు ఆటలో భారత ప్లేయర్లు తరచూ బ్రేక్‌లు తీసుకోవడంపై అసహనం వ్యక్తంచేశాడు. మరీ ముఖ్యంగా రవీంద్ర జడేజాను టార్గెట్ చేసినట్లుగా వ్యాఖ్యానించాడు.

"రెండో రోజు ఆట ప్రారంభమైన 15 నిమిషాలకే జడేజా ఆటను ఆపాడు. డ్రింక్స్‌తోపాటు మాత్రలు వేసుకున్నాడు. మళ్లీ 40 నిమిషాల తర్వాత మరోసారి బ్రేక్ తీసుకున్నాడు. అక్కడ అంపైర్లు నిస్సహాయంగా నిలబడ్డారు. అందుకే, కొన్ని ఓవర్లు కోల్పోవడం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. తప్పకుండా అధికారులు దీనిపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి. ఐసీసీ నుంచి మార్గదర్శకాలు రావాలి. ఏ బ్యాటరైనా గాయపడితే అతడికి బదులు మరొకరు క్రీజ్‌లోకి రావాలి. ఆట కొనసాగుతూనే ఉండాలి. అంతేకానీ, గడ్డి పెరిగిందని చూసేందుకు మా సహచరులు ఇక్కడికి 85 యూరోలు (దాదాపు 10 వేలు) పెట్టి రాలేదు" అని వ్యాఖ్యానించాడు.

జడేజాలా నేనూ చేసేవాడిని..

'డేంజర్ జోన్' వైపు వెళ్లడంపై ఇప్పటికే రవీంద్ర జడేజా స్పందించాడు. తానేమీ అప్పుడు బౌలింగ్ చేయడం లేదని.. తన దృష్టంతా బ్యాటింగ్ పైనే ఉందని తెలిపాడు. అయినా సరే లాయిడ్ మాత్రం దానికి మరో అర్థం జోడించి వ్యాఖ్యానించడం గమనార్హం. "రవీంద్ర జడేజా ఉదయం చేసిన డ్రామా చూసేందుకు భలేగా అనిపించింది. భారత జట్టులో ఎంతో అనుభవమైన క్రికెటర్ అతడు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ సమయంలో జడేజా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. జడేజా బ్యాటింగ్ చేసే సమయంలో ప్రతి బంతిని ఎదుర్కొన్న తర్వాత పిచ్‌పై బ్యాట్‌ను కొట్టాడు. తన పాదంతో రుద్దాడు. ఇది చాలా డ్రై పిచ్. మున్ముందు మ్యాచ్‌లో స్పిన్ కీలకపాత్ర పోషించే అవకాశం లేకపోలేదు. వెల్‌డన్ రవి.. నేను కూడా అలాగే చేసేవాడిని" అని లాయిడ్ వ్యాఖ్యానించాడు.

# అదరగొట్టిన బౌల్ట్, పూరన్, మోనాంక్.. లాస్ ఏంజెలెస్‌పై న్యూయార్క్ విజయం




: మేజర్ లీగ్ క్రికెట్‌లో లాస్ ఏంజెలెస్ నైట్‌రైడర్స్‌పై ఎంఐ న్యూయార్క్ ఘన విజయం సాధించింది. ఇప్పటికే ఇరుజట్ల ప్లేఆఫ్స్ రేసు అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. ఈ క్రమంలో న్యూయార్క్ వరుసగా నాలుగు ఓటముల తర్వాత గెలవడం గమనార్హం. తొలుత బ్యాటింగ్ చేసిన లాస్ ఏంజెలెస్ 20 ఓవర్లలో 154/8 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో న్యూయార్క్ 17.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే నష్టపోయి 155 పరుగులు చేసింది. ఓపెనర్ మోనాంక్ పటేల్ (56), నికోలస్ పూరన్ (62నాటౌట్) హాఫ్ సెంచరీలతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. క్వింటన్ డికాక్ (11) విఫలం కాగా.. కీరన్ పొలార్డ్ (6 బంతుల్లో 14నాటౌట్) వేగంగా ఆడేశాడు. నైట్‌రైడర్స్ బౌలర్లు సునీల్ నరైన్, ఆండ్రూ రస్సెల్ చెరో వికెట్ తీశారు.

విజృంభించిన బౌల్ట్

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లాస్ ఏంజెలెస్‌కు తొలిబంతే షాక్ తగిలింది. ఓపెనర్ చంద్ (0)ను ట్రెంట్ బౌల్ట్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆండ్రూ ఫ్లెచర్ (11), రసెల్ (15) కాసేపు ఉన్నా దూకుడుగా ఆడలేకపోయారు. వీరిద్దరిని కూడా బౌల్ట్ ఔట్ చేయడం గమనార్హం. అదీనూ బౌల్డ్ రూపంలోనే పెవిలియన్‌కు చేర్చాడు. సైఫ్ బదార్ (7), రోవ్‌మన్ పావెల్ (5), హోల్డర్ (4), మాథ్యూ ట్రాంప్ (10) విఫలమయ్యారు. అయితే, లాస్ ఏంజెలెస్ స్కోరు 150ం రావడానికి ప్రధాన కారణం షెఫానె రూథర్‌ఫోర్డ్ (86: 44 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు). ఓవైపు వికెట్లు పడుతున్నా రూథర్‌ఫోర్డ్ మాత్రం తన దూకుడును కొనసాగించాడు. 19వ ఓవర్ తొలి బంతికి బౌల్ట్ బౌలింగ్‌లో ఎనిమిదో వికెట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. ఆఖర్లో వ్యాన్ (8నాటౌట్) ఆడటంతో స్కోరు 150ం దాటింది. రూథర్‌ఫోర్డ్ చివరివరకూ ఉంటే కనీసం 170 పరుగులైనా చేసే అవకాశం ఉండేది. ట్రెంట్ బౌల్ట్ (4/17)కు తోడుగా పొలార్డ్ 2.. ఇషాన్ అదిల్, కెంజిగె చెరో వికెట్ తీశారు.

# జకోవిచ్ జోరు

లండన్: కెరీర్లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ దిశగా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ (సెర్బియా) మరో అడుగు ముందుకేశాడు. వింబుల్డన్ తొలి రౌండ్లో కష్టపడి గెలిచిన ఈ ఆరో సీడ్ ఆటగాడు.. రెండో రౌండ్లో అలవోకగా నెగ్గాడు. గురువారం పురుషుల సింగిల్స్‌లో జకోవిచ్ 6-3, 6-2, 6-0తో డానియల్ ఇవాన్స్ (బ్రిటన్)ను వరుస సెట్లలో ఓడించాడు. తొలి రెండు సెట్లలో కాస్త పోరాడిన ఇవాన్స్.. మూడో సెట్లో జకోవిచ్ ధాటికి పూర్తిగా తేలిపోయాడు. మ్యాచ్‌లో ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన నొవాక్.. తేలిగ్గా మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. వింబుల్డన్‌లో నొవాక్‌కు ఇది 99వ విజయం. దిమిత్రోవ్ (బల్గేరియా), డిమినార్ (ఆస్ట్రేలియా), మిన్సిచ్ (చెక్) ముందంజ వేశారు. 19వ సీడ్ దిమిత్రోవ్ 7-5, 4-6, 7-5, 7-5తో మౌటెట్ (ఫ్రాన్స్)పై.. పదకొండో సీడ్ డిమినార్ 4-6, 6-2, 6-4, 6-0తో కజాక్స్ (ఫ్రాన్స్)పై గెలిచారు. 15వ సీడ్ మిన్సిచ్ 6-4, 3-6, 6-4, 7-6 (7-4)తో గిరాన్ (అమెరికా)పై విజయం సాధించాడు. డేవిడోవిచ్ (స్పెయిన్), స్ట్రాఫ్ (జర్మనీ), కెమనోవిచ్ (సెర్బియా), రెండర్‌నిచ్ (ఫ్రాన్స్), కొబాలి (ఇటలీ), మునార్ (స్పెయిన్) రెండో రౌండ్ దాటారు.

ఆండ్రీవా దూకుడు

రష్యా అమ్మాయి మిరా ఆండ్రీవా మూడో రౌండ్లోకి ప్రవేశించింది. గురువారం మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో ఏడో సీడ్ ఆండ్రీవా 6-1, 7-6 (7-4)తో లూసియా బ్రొంజెటి (ఇటలీ)ని ఓడించింది. ఈ పోరులో ఆండ్రీవా ఆరంభం నుంచి దూకుడుగా ఆడింది. తొలి సెట్లో కేవలం ఒక్క గేమ్ మాత్రమే చేజార్చుకుని సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్లో ఆరంభంలో లూసియా అదరగొట్టింది. ఆరో గేమ్‌లో ఆండ్రీవా సర్వీస్ బ్రేక్ చేసి ఆపై 5-2తో సెట్ గెలిచే అవకాశాన్ని సంపాదించింది. ఈ దశలో పుంజుకున్న ఆండ్రీవా.. 5-5తో స్కోరు సమం చేసింది.

# సిరీస్ కొట్టేయాలని..

లండన్: ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్న భారత మహిళల జట్టు అరుదైన ఘనతపై గురిపెట్టింది. ఇంగ్లాండ్‌పై తొలిసారి సిరీస్ సాధించే అవకాశం హర్మన్‌ప్రీత్ బృందం ముందుంది. శుక్రవారమే మూడో టీ20. అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా రెండింట్లో నెగ్గిన భారత్ 2-0 ఆధిక్యంలో ఉంది. 2006లో డెర్బీలో జరిగిన ఏకైక మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై గెలిచిన భారత్.. అప్పట్నుంచి ఇప్పటి వరకు ఇంటా, బయటా ఆ జట్టుపై టీ20 సిరీస్ నెగ్గలేదు. ఇటు బ్యాటింగ్.. అటు బౌలింగ్‌లో మంచి ఫామ్‌లో ఉన్న భారత్‌కు ఇంగ్లాండ్‌పై సిరీస్ గెలిచేందుకు ఇదో సువర్ణావకాశం.



గాయం కారణంగా ఇంగ్లాండ్ కెప్టెన్ స్కైవర్ బ్రంట్ శుక్రవారం మ్యాచ్‌కు దూరమవడం భారత్‌కు మరో సానుకూలాంశం. బ్రంట్ గైర్హాజరీలో టామీ బ్యూమాంట్ జట్టుకు సారథ్యం వహించనుంది.

# రామ్‌చరణ్ అంటే నాకెంతో ఇష్టం..: బాలీవుడ్ నటి



‘ఆపరేషన్ వాలెంటైన్’తో తెలుగువారికి పరిచయమైన బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులు చేస్తున్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. రామ్‌చరణ్‌ను తాను ఎంతగానో అభిమానిస్తున్నట్లు చెప్పారు. “చరణ్ అంటే నాకెంతో ఇష్టం. డ్యాన్స్ అద్భుతంగా ఉంటుంది. ఎప్పటి నుంచో ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని అనుకుంటున్నా. నా తదుపరి తెలుగు సినిమా ఆయనతోనే ఉండాలి’’ అని కోరుకుంటున్నట్లు చెప్పారు.

‘బడే మియా ఛోటే మియా’ కోసం వయసులో తనకంటే 30 ఏళ్లు పెద్దవాడైన అక్షయ్ కుమార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ఆమె స్పందించారు. “ఈ విషయంపై ప్రతి ఒక్కరికీ విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. వయసులో పెద్దవారైన పలువురు స్టార్ హీరోలతో కలిసి నటించడానికి నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎందుకంటే, స్టార్స్‌తో స్క్రీన్ షేర్ చేసుకున్నప్పుడు ఎక్కువ మంది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించవచ్చు. అక్షయ్ కుమార్ సూపర్ స్టార్. ఆయనతో వర్క్ చేయడాన్ని నేనెంతగానో ఎంజాయ్ చేశా. ఎంతోమంది ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలనుకుంటారు. కొంతమందికి మాత్రమే ఆ అవకాశం లభిస్తుంది. తమ చిత్రాల్లోకి నటీనటులుగా ఎవరిని తీసుకోవాలనేది పూర్తిగా దర్శకుల నిర్ణయం. కాబట్టి దాని గురించి నేను పెద్దగా మాట్లాడాలనుకోవడం లేదు. అగ్ర నటులతోనే కాకుండా యువ హీరోల చిత్రాల్లోనూ నటించాలనుకుంటున్నా” అని ఆమె తెలిపారు.

2017లో మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్నారు మానుషి చిల్లర్. అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన ‘సామ్రాట్ పృథ్వీరాజ్’తో ఆమె తెరంగేట్రం చేశారు. ‘ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ’, ‘ఆపరేషన్ వాలెంటైన్’ చిత్రాల్లో నటించారు. సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన ‘కబీర్ సింగ్’లో హీరోయిన్‌గా తొలుత తనకే అవకాశం వచ్చిందని.. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ వదులుకున్నట్లు తెలిపారు.

# ‘టైగర్’తో సవాల్ ఎదుర్కొన్నా



ప్రియాంక చోప్రా

“ప్రేక్షకుల మనసుల్ని హత్తుకునేలా ఒక పాత్రకు సంబంధించిన భావోద్వేగాలను గళంలో వినిపించడం ఎంతో సవాలుతో కూడిన పని’’ అంటోంది కథానాయిక ప్రియాంక చోప్రా. హాలీవుడ్, బాలీవుడ్‌లో తన నటనా ప్రతిభను నిరూపించుకున్న ఈమె.. త్వరలో విడుదల కానున్న ‘టైగర్’ అనే డాక్యుమెంటరీలో అంబా అనే ఆడపులి పాత్రకు తన గొంతు అరువిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ ప్రాజెక్టు గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలియజేసిందావె. ‘‘ప్రకృతికి సంబంధించిన సినిమాలకు నేను పెద్ద అభిమానిని. మనదేశం నుంచి వస్తున్న ‘టైగర్’ అనే కథను నా గొంతుతో ప్రేక్షకులకు దగ్గరవ్వడం గొప్ప అవకాశంగా భావిస్తున్నా. నేను ఒక నటిగా ఆడియో విజువల్ మాధ్యమానికి అలవాటు పడ్డాను. కానీ.. ఇప్పుడు కేవలం నా వాయిస్‌తోనే భావోద్వేగాలను పండించగలగాలి. తొలిసారి ఓ సరికొత్త పాత్రతో రాబోతున్నాను. నిజంగా ఇది సవాలుతో కూడిన పని. గళాన్ని అందించాలనే నా కోరిక ‘టైగర్’తో నెరవేరింద’’ని చెప్పుకొచ్చింది ప్రియాంక. ఒక పులి ఎనిమిదేళ్ల జీవితం ఆధారంగా రాబోతున్న ‘టైగర్’ ఈ నెల 22న రానుంది.

# క్రమశిక్షణలో ఎన్టీఆర్ కాఠిన్యం



చేసే పనిని దైవంగా భావించి, అందరికీ ఆదర్శంగా నిలిచిన మహా నటుడు నందమూరి తారక రామారావు. పనిపట్ల ఆయనకు ఉండే అంకితభావం చాలా తక్కువ మందికి ఉంటుందంటే ఆశ్చర్యం లేదు. ఉదయం 6గంటలకు షూటింగ్ అంటే, 5.45గంటలకే మేకప్ వేసుకుని మరీ వచ్చే నటుడు మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు. క్రమశిక్షణ, సమయపాలనలో ఆయనను చూసి ప్రతి నటుడు భయపడాల్సిందే.

1966లో ఎన్టీఆర్ ‘శ్రీకృష్ణ పాండవీయం’ తీశారు. ఆయనే దర్శకుడు. కె.ఆర్.విజయ నాయిక. ఆమె అప్పుడప్పుడే తెలుగు సినిమాల్లో నటిస్తున్నారు. షూటింగ్ జరుగుతున్న రోజుల్లో, కె.ఆర్.విజయ సెట్టుకి ఆలస్యంగా రావడమే కాకుండా, సమాచారం లేకుండా రెండు రోజులు షూటింగ్‌కు రాలేదు. దాంతో ఎన్.టి.ఆర్. అగ్గిపిడుగు అయిపోయారు. క్రమశిక్షణ, నిష్ఠ పాటించే ఆయన సహించలేక, ఆమె వల్ల తనకి ఇంత నష్టం కలిగిందని, ఇది చెల్లించకపోతే తన చిత్రం నుంచి తీసేస్తానని, అప్పుడు మరింత నష్టం కలుగుతుందనీ కోర్టుకి వెళ్లారు. ఎన్టీఆర్ కఠినమైన క్రమశిక్షణ సంగతి తెలియని విజయ, దెబ్బకి దిగివచ్చారు. వెంటనే రాజీపడి, తన వల్ల కలిగిన నష్టాన్ని చెల్లించి, అపరాధానికి క్షమాపణ కోరి సినిమాలో కొనసాగారు. అప్పటి నుంచి ఆమె ఒక్కసారి కూడా సెట్టుకు ఆలస్యంగా రాలేదు.. ఏనాడూ మళ్లీ షూటింగ్ మానలేదు.

# రజనీ చిత్రంలో నాగ్?



లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. రజనీ 171వ సినిమా ఇది. సోమవారం పేరుని ప్రకటిస్తున్నారు. ‘తంగమ్’, ‘రాణా’ తదితర పేర్లు ప్రచారంలో ఉన్నాయి. మరోవైపు ఇందులో నటిస్తున్న తారల గురించీ ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఇదొక మల్టీస్టారర్ సినిమా తరహాలో తెరకెక్కబోతోందని, ఇందులో తెలుగు కథానాయకుడు నాగార్జున ఓ కీలక పాత్రని పోషిస్తున్నారని తమిళ సినీవర్గాలు మాట్లాడుకుంటున్నాయి. ఇటీవలే లోకేశ్ కనగరాజ్ హైదరాబాద్‌కి వచ్చి నాగార్జునతో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అలాగే ఇందులో రజనీకాంత్‌కి కూతురు పాత్ర కోసం శ్రుతిహాసన్ ఎంపికైనట్టు తెలుస్తోంది. త్వరలోనే ఈ విషయాలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. నాగార్జున ఇప్పటికే ధనుష్‌తో కలిసి, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ‘కుబేర’ చిత్రంలో నటిస్తున్నారు.

# పద్దెనిమిదేళ్ల తర్వాత జోడీగా..




జ్యోతిక, సూర్య

ఆఫ్‌స్క్రీన్, ఆన్‌స్క్రీన్‌లో హిట్ జోడీ అయిన సూర్య, జ్యోతిక తమిళంలో ‘పూవెల్లం కేట్టుప్పార్’ మొదలుకొని ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించి, మెప్పించారు. మళ్లీ వీరిద్దరిని తెరపై ఎప్పుడెప్పుడు జంటగా చూస్తామా అని ఎదురు చూస్తున్న సినీప్రియులకు ఓ తీపి కబురు వినిపించారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఓ ప్రాజెక్టు రాబోతున్నట్లు సమాచారం. ‘‘బెంగుళూరు డేస్’ ఫేమ్ అంజలి మేనన్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఇందులో సూర్య, జ్యోతిక జంటగా నటించనున్నారు. ప్రస్తుతం ఈ విషయముపై వీరిద్దరితో చర్చలు జరుపుతోంది చిత్రబృందం. త్వరలో దీనికి సంబంధించిన విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నార’ని సన్నిహితవర్గాలు తెలిపాయి. దాదాపు 18 ఏళ్ల తరవాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న ఈ సినిమా ఎలా ఉండబోతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు.

‘సూర్య 44’ కొత్త ముచ్చట్లు..

త్వరలో ‘కంగువా’తో తెరపైకి రావడానికి సిద్ధమవుతున్న సూర్య.. ఇటీవలే దర్శకుడు కార్తీక్ సుబ్బరాజుతో తన 44వ చిత్రాన్ని ప్రకటించారు. దీని చిత్రీకరణను జూన్‌లో మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త విషయాల్ని ప్రకటించారు. ‘సైంధవ్’ ఫేమ్ సంతోష్ నారాయణన్ ఈ సినిమా సంగీత దర్శకుడిగా పనిచేయబోతున్నట్లు తెలిపింది చిత్రబృందం. పీరియాడిక్ వార్ అండ్ లవ్ నేపథ్యంలో దీన్ని తీర్చిద్దుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాతికి ఈ సినిమా విడుదల కానుంది.

# దావుద్ పార్టీలో డ్యాన్స్.. అక్షయ్‌కుమార్ సతీమణి ఏమన్నారంటే..?



ముంబయి: రచయిత, కాలమిస్ట్‌గా పలు అంశాలపై తన అభిప్రాయాన్ని బయటపెడుతుంటారు నటి ట్వింకిల్ ఖన్నా. తాజాగా ఆమె ఫేక్‌న్యూస్‌పై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. టెక్నాలజీని ఆధారంగా చేసుకుని కొంతమంది అవాస్తవాలు వైరల్ చేస్తున్నారని చెప్పారు. దాదాపు పదేళ్ల క్రితం తనపై వచ్చిన ఓ సంచలన వార్త గురించీ ఆమె మాట్లాడారు.

“కరోనా సమయంలో ఎన్నో ఫేక్ వార్తలను మనం చూశాం. ఇటీవల జరిగిన రెజ్లర్ల నిరసనలో వినేశ్, సంగీత ఫొగాట్ నవ్వుతూ ఉన్నట్లు మార్ఫింగ్ ఫొటోలూ వచ్చాయి. పలు విధాలుగా టెక్నాలజీని ఉపయోగించుకుని అవాస్తవ కథనాలు సృష్టిస్తున్నారు. గతంలో నా పైనా ఇలాంటి ప్రచారాలు జరిగాయి. అండర్ వరల్డ్ డాన్ దావుద్ ఇబ్రహీం పార్టీలో డ్యాన్స్ చేసినట్లు అప్పట్లో టీవీలో వార్తలు వచ్చాయి. వాటిని చూసి నా పిల్లలు కూడా నవ్వుకున్నారు. నేను డ్యాన్స్ చేస్తే ఎలా ఉంటుందో నా కుటుంబానికి బాగా తెలుసు. అందుకే వాళ్లు వాటిని నమ్మలేదు. దావుద్ కావాలనుకుంటే నాకంటే గొప్ప డ్యాన్సర్స్‌ను పెట్టుకుంటారనే విషయాన్ని టీవీ ఛానల్స్ గ్రహించి ఉంటే బాగుండేది” అని ఆమె అన్నారు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణించిన సమయంలో ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయని.. వాట్సప్, ఇతర సోషల్‌మీడియా పేజీల్లో వచ్చిన పోస్టులు చూసి..

# ‘రామాయణ’లో నటి దీపికా చిఖాలియా..

: రామానంద్ సాగర్ రూపొందించిన ‘రామాయణ్’ సీరియల్‌లో సీతగా నటించి, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు అలనాటి నటి దీపికా చిఖాలియా ( ఇండస్ట్రీలో ఎప్పుడు రామయణం ప్రస్తావన వచ్చినా ఈ సీరియల్‌లోని నటీనటులు గుర్తొస్తారు. తాజాగా బాలీవుడ్ ‘రామాయణ’ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం దీపికను సంప్రదించారంటూ వార్తలు మొదలయ్యాయి. వీటిపై ఆమె స్పందించారు.

ఓ ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడుతూ.. “ఆ చిత్ర బృందంలోని వారెవరూ నన్ను సంప్రదించలేదు. వాళ్లకు నన్ను సంప్రదించడానికి, నాతో మాట్లాడడానికి ఎలాంటి ఇబ్బంది లేదనుకుంటున్నాను. ఒక్కసారి రామాయణంలో సీతగా నటించిన తర్వాత.. ఆ కథలో వేరే పాత్రలేవీ పోషించలేను. చేయగలనో, లేదో కూడా కచ్చితంగా చెప్పలేను. మహాభారతం, శివపురాణంలో ఏదైనా అవకాశం వస్తే ఆలోచిస్తాను” అని తెలిపారు.

# ఫంగస్ ప్రమాదం

ఇన్‌ఫెక్షన్లు అనగానే ముందుగా వైరస్, బ్యాక్టీరియానే గుర్తుకొస్తుంటాయి. ఫంగస్ కూడా తక్కువేమీ కాదు. నిజానికి చాలారకాల ఫంగస్‌లు హానేమీ చేయవు. పుట్టగొడుగుల వంటి వాటిని తింటుంటాం కూడా. కానీ కొన్నిరకాల ఫంగస్‌లు చర్మ సమస్యలు, ఊపిరితిత్తి ఇన్‌ఫెక్షన్ల వంటి జబ్బులకు దారితీస్తాయి. తీవ్రమైతే ప్రాణాపాయానికి కారణమవుతాయి కూడా.

ఫంగస్ సర్వాంతర్యామి అనుకోవచ్చు. సాధారణంగా ఇది నేల, చెట్ల మీద జీవిస్తుంటుంది. కానీ ఇళ్లల్లోనూ మనుగడ సాగించగలదు. ఇతర క్రిముల మాదిరిగా గాల్లోనూ తేలియాడొచ్చు. ఆ మాటకొస్తే మనం రోజూ ఫంగస్‌లను శ్వాస ద్వారా పీల్చుకుంటుంటాం కూడా. అయితే ఇతర క్రిములతో పోలిస్తే వీటితో ఇన్‌ఫెక్షన్లు తలెత్తటం తక్కువ. ఒకవేళ వచ్చినా చాలావరకూ అంత తీవ్రం కావు. తామర.. పాదం మీద దురద, పొక్కులను కలగజేసే అథ్లెట్స్ ఫుట్ వంటివి ఇలాంటి సమస్యలే. అలాగని అన్నీ మామూలువే కావు. కొన్ని ప్రాణాంతకంగానూ పరిణమించొచ్చు.



ముఖ్యంగా ఊపిరితిత్తులు, రక్తం, మెదడులోకి విస్తరించే ఫంగస్‌లు చాలా ప్రమాదకరం. కొవిడ్ సమయంలో బ్లాక్ ఫంగస్ ఎంత హాని కలిగించిందో తెలిసిందే.

ఎవరికైనా రావొచ్చు

ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు ఎవరికైనా రావొచ్చు. అయితే రోగనిరోధకశక్తి తగ్గినవారికి వీటి ముప్పు ఎక్కువ. హెచ్ఐవీ/ఎయిడ్స్ గలవారికి, అవయవాలు మార్పిడి చేయించుకున్నవారికి, క్యాన్సర్ చికిత్స తీసుకునేవారికి, కొన్ని చికిత్సల కోసం ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండేవారికి, ఏదైనా సమస్య కోసం మూలకణాల మార్పిడి చేయించుకున్నవారికి, రోగనిరోధకశక్తిని అణచిపెట్టే మందులు వేసుకునేవారికి, మధుమేహం గలవారికి ఎక్కువగా వచ్చే అవకాశముంది. వీరికి ఇన్‌ఫెక్షన్ల తీవ్రత కూడా అధికమే.

గుర్తించటం కష్టమే

శరీరం లోపల ఉన్న ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌ను గుర్తించటం అంత తేలిక కాదు. చాలా లక్షణాలు వైరస్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లనూ పోలి ఉంటాయి. అందువల్ల వీటిని విడదీసి చూడటం కష్టమైన పనే. తీవ్రమైన ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌లో జ్వరం, దగ్గు, శ్వాస సరిగా ఆడకపోవటం, చలి, తలనొప్పి, ఛాతీ నొప్పి, బాగా అలసిపోవటం వంటి లక్షణాలు కనిపి స్తుంటాయి. వీటిని బట్టి డాక్టర్లు ఒక అంచనాకు వస్తారు. ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌గా అనుమానిస్తే రక్తం లేదా మూత్ర పరీక్ష చేయిస్తారు. ఊపిరితిత్తుల ఎక్స్‌రే, స్కాన్ కూడా చేయాల్సి రావొచ్చు. అయినా కూడా అన్నిసార్లూ ఫంగల్ ఇన్‌ఫెక్షన్ బయట పడకపోవచ్చు. వైరస్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లకు చేసే చికిత్సలతో ఫలితం కనిపించకపోతే ఫంగల్ ఇన్‌ఫెక్షన్ అయ్యిండొచ్చని అనుమానించటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.


మందుల కొరతే ఇబ్బంది

ప్రస్తుతం తీవ్రమైన ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల చికిత్సకు కొన్ని యాంటీఫంగల్ మందులే అందుబాటులో ఉన్నాయి. వీటితో చాలా దుష్ప్రభావాలూ పొంచి ఉంటాయి. ఎందుకంటే ఫంగల్ కణాలు దాదాపుగా మనుషుల కణాల మాదిరిగానే ఉంటాయి. దీంతో యాంటీఫంగల్ మందులకు వీటి మధ్య తేడాను కనుక్కోవటం కష్టమవుతుంది. ఫంగస్‌ను చంపే క్రమంలో మన కణాల మీదా దాడి చేస్తాయి. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఇప్పుడు తక్కువ దుష్ప్రభావాలు కలగజేసే కొత్తరకం యాంటీఫంగల్ మందులను రూపొందించటం మీద పరిశోధకులు దృష్టి సారించారు.

బ్యాక్టీరియా సాయంతో

చాలారకాల బ్యాక్టీరియా సహజంగా ఫంగస్‌ను చంపే రసాయనాలను విడుదల చేస్తుంటాయి. అందుకే జంతువుల్లో నివసించే బ్యాక్టీరియా నుంచి పుట్టుకొచ్చే రసాయనాల మీద పరిశోధకులు పరీక్షలు నిర్వహిస్తున్నారు. అన్ని జంతువుల్లోనూ మేలు చేసే బ్యాక్టీరియా ఉంటుంది. వీటి నుంచి వచ్చే రసాయనాలు జంతువులకు హాని చేయకపోతే మనుషులకూ కీడు చేయవు కదా. ఇదే కొత్త యాంటీఫంగల్ మందుల రూపకల్పనలో ఆశలు కల్పిస్తోంది. యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ పరిశోధకులు ఇటీవల సముద్రంలో నివసించే సీ స్కిర్ట్ జీవుల్లో కనిపించే టర్బిన్‌మిసిన్ అనే రసాయనాన్ని గుర్తించారు. ఇది ప్రస్తుత చికిత్సలకు లొంగని చాలా రకాల ఫంగస్‌లను చంపుతున్నట్టు తేలింది. అదీ మానవ కణాలకు ఎలాంటి హాని కలిగించకుండా. యాంటీఫంగల్ మందులు ఎంతకాలం ప్రభావం చూపుతాయో అర్థం చేసుకోవటానికి పరిశోధకులు అధునాతన పరిజ్ఞానాల సాయమూ తీసుకుంటున్నారు. ఇలా మందులు సురక్షితంగా, మరింత ఎక్కువ ప్రభావవంతంగా పనిచేసేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు అంతగా మందులు అందుబాటులో లేని ప్రస్తుత తరుణంలో ఇది మంచి అవకాశంగా కనిపిస్తోంది. వీలైనంత త్వరగా ఫంగస్ పని పట్టేందుకు వీలు కల్పించనుంది.

# క్యాన్సర్ చికిత్సకు పేగు బ్యాక్టీరియా ఉత్తేజం



క్యాన్సర్ చికిత్సలో ఇమ్యునోథెరపీ రోజురోజుకీ ప్రాచుర్యం పొందుతోంది. ఇది రోగనిరోధక కణాలను కణితుల మీద దాడి చేసేలా పురికొల్పుతుంది. ఈ చికిత్సలో వాడే ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్‌హిబిటార్ మందులు టి కణాలను ప్రశాంతంగా ఉంచే సహజ మార్గాలను సడలించటం ద్వారా రోగనిరోధక శక్తిని ఉత్తేజితం చేస్తాయి. అయితే ఇమ్యునోథెరపీతో సుమారు ప్రతి ఐదుగురిలో ఒకరికే ఫలితం కనిపిస్తుంటుంది. ఎందుకంటే కొన్ని కణితులు రోగనిరోధక కణాలను అణచి వేస్తుంటాయి. మందుల సామర్థ్యాన్ని తగ్గించేస్తుంటాయి. ఇలాంటి ఇబ్బందిని తొలగించటానికి, చికిత్సకు స్పందించనివారికి ఇమ్యునోథెరపీ ఉపయోగపడేలా తీర్చిదిద్దటంలో వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు ముందడుగు వేశారు. ఎలుకల పేగుల్లో ఉండే రుమినోకాకస్ నావస్ అనే బ్యాక్టీరియా ఇమ్యునోథెరపీ ప్రభావాన్ని ఇనుమడింప జేస్తున్నట్టు గుర్తించారు. క్యాన్సర్ కణాల మీద దాడి చేసేలా శరీర రోగనిరోధక వ్యవస్థను సమీకరించటంలో ఈ బ్యాక్టీరియా ముఖ్య పాత్ర పోషిస్తోందని అధ్యయనానికి నేతృత్వం వహించిన మార్క్రో కొలానా చెబుతున్నారు. ఇమ్యునోథెరపీ మందుల సామర్థ్యాన్ని పెంచే ప్రొబయాటిక్స్‌ను రూపొందించటానికిది తోడ్పడగలదని, ఫలితంగా మరింత ఎక్కువ మంది క్యాన్సర్ బాధితులకు ప్రయోజనం చేకూరగలదని ఆశిస్తున్నారు.

# మెదడును కాపాడుకోండి

కూల్‌డ్రింకులు, చిప్స్, కుకీస్ వంటి అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ అతిగా తీసుకుంటున్నారా? అయితే మరోసారి ఆలోచించుకోండి. వీటితో మతిమరుపు, ఆలోచన సామర్థ్యం తగ్గటం, పక్షవాతం



ముప్పు పెరుగుతున్నట్టు బయటపడింది. ఈ సమస్యలకు అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ కారణమవుతున్నట్టు రుజువు కాలేదు గానీ వీటి మధ్య సంబంధం ఉంటున్నట్టు మాత్రం వెల్లడైంది. మెదడు ఆరోగ్యంలో ఆహారం కీలకపాత్ర పోషిస్తుంది. అయితే ముఖ్యమైన ఆహార మార్పులేంటనేది కచ్చితంగా తెలియదు. ఈ నేపథ్యంలో 45 ఏళ్లు పైబడ్డవారిలో మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్ పరిశోధకులు ఒక అధ్యయనం నిర్వహించారు. కూల్‌డ్రింకులు, చిప్స్ వంటివి తక్కువగా తిన్నవారితో పోలిస్తే వీటిని ఎక్కువగా తిన్నవారికి మెదడు సమస్యల ముప్పు పెరుగుతున్నట్టు గుర్తించారు. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో చక్కెర, ఉప్పు, కొవ్వు ఎక్కువగా.. ప్రొటీన్, పీచు తక్కువగా ఉంటాయి. ఇవి రకరకాల మార్గాల్లో మెదడుకు చేటు చేస్తుండొచ్చని భావిస్తున్నారు.

# కంటి ఇన్ఫెక్షన్‌కు సీటీ స్కాన్ అవసరమా?

మా బాబు వయసు ఆరు సంవత్సరాలు. ఒక కన్ను నుంచి కొంచెం నీరు కారి ఎర్రగా మారితే పీడియాట్రిక్ ఫిజీషియన్‌కు చూపించాం. రెండు రోజుల్లోనే కళ్లు ఉబ్బడం, పూర్తిగా తెరుచుకోని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ వెళ్తే యాంటిబయాటిక్స్ రాసిచ్చారు. ఇప్పటికి ఐదారు రోజులు అవుతున్నది. మళ్లీ వెళ్తే సీటీ స్కాన్ చేయాలని అంటున్నారు. ఈ పరిస్థితులు బిడ్డ చూపును ఏమైనా దెబ్బతీస్తాయా? కంటి ఇన్ఫెక్షన్ ఏదైనా ప్రమాదానికి సంకేతమా? ఆందోళనగా ఉంది సలహా ఇవ్వండి.

ఓ పాఠకురాలు



మామూలుగా కంటి లోపల తెల్లగుడ్డు భాగం ఎర్రగా మారడం, చీము రావడం, కన్ను అంటుకట్టుకుపోవడం, కళ్ల చుట్టూ ఎక్కువ వాపు లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే దాన్ని 'కన్‌జన్‌క్టివైటిస్' అంటాం. కన్ను చుట్టూరా ఉన్న భాగం బాగా మూసుకుపోయి, ఉబ్బుగా ఉంటే సెల్యులైటిస్ అంటాం. మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీ బాబుకు 'సెల్యులైటిస్ కండిషన్' అనిపిస్తున్నది. మీ బిడ్డ 'ఆర్బిటాల్ సెల్యులైటిస్'తో బాధ పడుతున్నట్టు తెలుస్తున్నది. కన్ను చుట్టూ ఉన్న కణజాలంలో ఇన్ఫెక్షన్ రావడం, చీము పట్టుకొని ఉండటం ఈ సమస్య ప్రధాన లక్షణం. కనుగుడ్డు కనిపించి, కన్ను సరిగ్గానే కదులుతుంటే.. 'ప్రీ సెప్టల్ సెల్యులైటిస్' అంటాం. దీన్ని కంటి ముందుభాగంలో ఉన్న కణజాలపు ఇన్ఫెక్షన్‌గా గుర్తిస్తాం. అదే కంటి వెనుక భాగంలో అయితే 'పోస్ట్ సెప్టల్ సెల్యులైటిస్'గా చెప్తాం. ఇన్ఫెక్షన్ కంటి వెనకాల ఉంటే అది బ్రెయిన్‌కు పాకే ప్రమాదం ఉంటుంది. అలా ఉందా? లేదా? అనే విషయం నిర్ధారణ చేసుకోవడానికే డాక్టర్ సీటీ స్కాన్ చేయాలని చెప్తున్నట్టున్నారు. కంటి వెనుక ఉన్న చీమును వీలైనంత త్వరగా తీయాల్సిన అవసరం ఉంటుంది. ఆలస్యం చేయకుండా మళ్లీ డాక్టర్‌ను సంప్రదించండి.

# రక్త క్యాన్సర్‌పై బ్రహ్మాస్త్రం ఎముక మూలుగ మార్పిడి

జీవన్మరణ సమస్యగా పరిణమించిన క్యాన్సర్లకు తగిన చికిత్స పొందడం రోగులకు పెద్ద పరీక్షే. కీమోథెరపీ, రేడియేషన్, ఇమ్యునోథెరపీ, బయలాజికల్ ఏజెంట్స్ లాంటివి రక్త క్యాన్సర్ల చికిత్స తొలిదశల్లో ప్రామాణికమైనవి. అయితే, కొంతమందిలో మాత్రం ఇవి శాశ్వతమైన ఉపశమనం కలిగించలేకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఎముక మూలుగ (అస్థిమజ్జ) మార్పిడి (బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్-బీఎంటీ) తగిన ఎంపికగా నిలుస్తుంది. విషమించిన రక్త క్యాన్సర్ల విషయంలో ఎముక మూలుగ మార్పిడి విజయవంతమైన చికిత్సగా అవతరించింది.



బీఎంటీ చికిత్సలో భాగంగా రోగి రక్తంలోకి ఆరోగ్యకరమైన మూలకణాలను ఎక్కిస్తారు. దీంతో రోగి శరీరం అత్యవసరమైన రక్త కణాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని సంతరించుకుంటుంది. అలా రోగ నిరోధక శక్తి పునరుత్తేజితం అవుతుంది. తీవ్రమైన రక్త రుగ్మతలైన అప్లాస్టిక్ ఎనీమియా, తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా, మల్టిపుల్ మైలోమా, అక్యూట్ మైలాయిడ్ లుకేమియా లాంటి రక్త క్యాన్సర్లు, లింఫోమా సమస్యల్లోనూ ఈ చికిత్సను ఉపయోగిస్తారు. ఇందులో ప్రధానంగా రెండు రకాలు ఉన్నాయి.

1. ఆటోలోగస్

ఈ రకం చికిత్సలో రోగి సొంత హీమోపోయిటిక్ మూల కణాలను ఉపయోగిస్తారు.

2. అలోజెనీక్

ఈ రకంలో ఆరోగ్యకరమైన దాత హీమోపోయిటిక్ మూల కణాలను ఉపయోగించి చికిత్స అందిస్తారు.

నిపుణుల పర్యవేక్షణ

రక్త క్యాన్సర్ల చికిత్సలో ఇతర చికిత్సలు పనిచేయనప్పుడు, రోగుల దీర్ఘకాల జీవితానికి హామీ ఇవ్వాలంటే ఎముక మూలుగ మార్పిడి ప్రభావవంతమైన చికిత్స. ఇది చాలా సంక్లిష్టమైన చికిత్సా విధానం. దీనివల్ల.. అలసట, వికారం (నాజియా), నోట్లో పుండ్లు (అల్సర్లు), రక్తం ఎక్కించాల్సి రావడం, ఇన్ఫెక్షన్లు ప్రబలే ప్రమాదం లాంటి సమస్యలు పొంచి ఉంటాయి. కాబట్టి ఎముక మూలుగ మార్పిడి చికిత్స జరుగుతున్నన్ని రోజులూ రోగిని నిపుణులైన వైద్యులు, నర్సులు, పోషకాహార నిపుణులు, ఇతర సంబంధిత నిపుణులు అంటిపెట్టుకుని ఉండాల్సి వస్తుంది. రోగికి ఇన్ఫెక్షన్ల ముప్పు తగ్గించి, వ్యాధి నుంచి కోలుకోవడం కోసం వారిని క్రిమి రహితం చేసిన స్టైరైల్ గదిలో ఉంచాలి. రోగి కోలుకోవడం మీదే దృష్టిపెట్టి చికిత్స అందించాలి.

రెండో జన్మ లాంటిదే

రక్త క్యాన్సర్ రోగులకు కీమోథెరపీ, కీమో ఇమ్యునోథెరపీ, బయలాజికల్ ఏజెంట్స్, ఇతర చికిత్సలను కలగలిపి తొలిదశలో (ప్రాథమికంగా) చికిత్స అందిస్తారు. ఎంత ఉత్తమ చికిత్స అందించినా, కొన్ని రక్త క్యాన్సర్లు తొలి దశ చికిత్స తర్వాత మళ్లీ తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో ఎముక మూలుగ మార్పిడి (బీఎంటీ) రోగులకు మళ్లీ జీవితాన్ని ప్రసాదిస్తుంది. వైద్య రంగంలో సాధించిన అభివృద్ధి కారణంగా కొత్త ఔషధాలు అందుబాటులోకి వచ్చాయి. అలా బీఎంటీ మరింత సురక్షితమైన చికిత్సగా అవతరించింది. రక్త క్యాన్సర్ రోగులకు ఓ ఆశాదీపంలా మారిపోయింది.

# పళ్లెంలోనే పోషకాలు

ఆరోగ్యకరమైన ఆహారం అంటే ఏంటో చాలామందిలో గందరగోళం ఉంటుంది. ఈ విషయంలో ఇంటర్‌నెట్, సోషల్‌మీడియా చిట్కాలు అంతగా సహాయపడవు. కానీ, భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) పోషకాహారం గురించి కొన్ని మార్గదర్శకాలను జారీచేసింది. ఇలాంటి ఆహారంతో అంటువ్యాధులు కాని రోగాలైన ఊబకాయం, డయాబెటిస్, గుండెజబ్బులలాంటి వాటిని నివారించవచ్చు.



ఆరోగ్యకరమైన ఆహారం అంటే తక్కువ క్యాలరీలు తీసుకోవడం, కొన్ని రకాలైన తిండ్లను అసలే ముట్టుకోకపోవడం మాత్రం కాదు. సూక్ష్మ, స్థూల పోషకాలు కలిగిన ఎనిమిది రకాలైన ఆహార వర్గాలను మన పళ్లెంలో భాగం చేసుకుంటేనే అది సమతులాహారం అవుతుంది. కాబట్టి%ో% సూపర్ ఫుడ్ మాయలో పడి ఏదో ఒకదానిని అతిగా తినడమూ మంచిది కాదు. మంచి ఆరోగ్యానికి మంచి ఆహార విధానమే మూలమనే విషయాన్ని మరిచిపోవద్దు.

కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, దుంపలు, వేరుదుంపలు మన పళ్లెంలో సగభాగం ఉండేలా చూసుకోవాలి. తృణధాన్యాలు, చిరుధాన్యాలను 45 శాతానికి పరిమితం చేసుకోవాలి. 15 శాతం మేరకు పప్పుధాన్యాలు, బీన్స్, మాంసం ఉండాలి. మిగిలిన భాగంలో గింజలు, కూరగాయలు, పండ్లు, పాలు చేర్చుకుంటే మంచిది. ఎక్కువ చక్కెరలు, కొవ్వులు, అల్ట్రా ప్రాసెస్ చేసిన పదార్థాలను దూరం పెట్టాలి. వీటిలో ఫైబర్, పోషకాలు ఉండవు. ఇవి మన ఆరోగ్యం మీద దుష్ప్రభావం చూపుతాయి.

ఏవి ఎంత మోతాదులో?

కార్బొహైడ్రేట్లు: మైదా, రిఫైన్డ్ పిండి, పొట్టులేని బియ్యం లాంటి వాటి నుంచి లభించే కార్బొహైడ్రేట్లకు దూరంగా ఉండాలి. వీటి స్థానాన్ని ముతక గోధుమ, చిరుధాన్యాలు, దంపుడు బియ్యంతో భర్తీచేయాలి.

పండ్లు, కూరగాయలు: వీటిలో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ప్రీబయాటిక్స్‌లా పనిచేస్తాయి. రోజుకు 500 గ్రాముల కూరగాయలు, పండ్లు తినాల్సిన చోట భారతీయులు కేవలం 100 నుంచి 200 గ్రాములు మాత్రమే తీసుకుంటున్నారు. కాబట్టి, మన పళ్లెంలో రుతువుల వారీ కూరగాయలు, ఆకుకూరలు, రంగురంగుల కాయలు, పండ్లు ఉంటే మంచిదని గుర్తుపెట్టుకోవాలి. ఆలుగడ్డ లాంటి దుంపల కంటే క్యారెట్లు, ముల్లంగి లాంటి వేరుదుంపలు మంచివి. ఇక డయాబెటిస్ రోగులు రోజువారీ పండ్ల మోతాదును 30 గ్రాముల పరిమితి దాటొద్దు. దీన్నీ 15 గ్రాముల చొప్పున రెండు భాగాలుగా విభజించుకొని తినాలి. ఫైబర్, మినరల్స్ నష్టం జరుగుతుంది కాబట్టి పండ్లరసాలు మంచివి కావు. పైగా వీటిలో రక్తంలో చక్కెర స్థాయిని పెంచే గ్లైసిమిక్ ఇండెక్స్ కూడా ఎక్కువ.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy